# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 9-9-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 36 | పేజీలు:8 | వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

బానలో నీరు
తీస్తు పోస్తూ ఉండాలి
నెత్తిన అప్పు.

కంటి నలుసు
చిలుకరౌతు మామ
మాయలదారి.

కొలువు కూటం
తేనె ఊటల ఘటం
ఊకదంపుడు.

పేరుమారింది
అవార్డుకు గౌరవం
ధ్యాన్ చంద్ దా గ్రేట్

కల్తీ మాటలు
నూతన పదకోశం
దుఃఖం లో అమ్మ



\- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీ నిజాలు**

పంటెక్కడ ఇల్లెక్కడ
అంతా జలమయమే !
బతుకెక్కడ మెతుకెక్కడ
అంతట జనభయమే !

మంటికి మింటికి ఒకటే
ఎడతెరగని వానా !
కన్పించక నీట మునిగె
ఉత్తర తెలంగాణ !



\- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# రాష్ట్రంలో సాంకేతిక వినియోగం అత్యద్భుతం



హైదరాబాద్, సెప్టెంబర్ 8: తెలంగాణలో ఐటీ రంగం అభివృద్ధి, దాని ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలు, టెక్నాలజీ వినియోగం అత్యంత అద్భుతమని పార్లమెంటరీ కమిటి ప్రశంసల జల్లు కురిపించింది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ గవర్నెన్స్ సేవలు, ఇన్నొవేషన్ రంగంలో ఇంక్యులేటర్ల ఏర్పాటు, టీ ఫైబర్ ప్రాజెక్టులను ప్రత్యేకంగా కొనియాడింది. రెండు రోజులుగా హైదరాబాద్‌లో పర్యటిస్తున్న శశిథరూర్ నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ తెలంగాణలో ఐటీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకై అధ్యయనం చేస్తున్నది. ఈ విధానాన్ని ఇలాగే కొనసాగిస్తే హైదరాబాద్ ఐటీ రంగంలో మరిన్ని అద్భుతాలను సాధిస్తుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఐటీ రంగంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆదర్శవంతమైన కార్యక్రమాలను అన్ని రాష్ట్రాల్లో అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఇందులో భాగంగా ఐటీ రంగంలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రాజెక్టులు, విజన్‌పై రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కే. తారకరామారావు, స్థాయి సంఘానికి బుధవారం నివేదిక అందించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రవేశ పెట్టిన టీఎస్ఐపాస్. ఇతర విధానపరమైన నిర్ణయాలు, ఐటీ పరిశ్రమతో కలిసి ప్రభుత్వం పని చేయడం వల్ల రాష్ట్రానికి అనేక పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ప్రపంచంలోని నాలుగు అతిపెద్ద టెక్ కంపెనీలకు సంబంధించిన క్యాంపస్‌లు అమెరికా తర్వాత హైదరాబాద్‌లోనే ఉన్నాయని చెప్పారు. ప్రతి రంగానికి ఐటీ సేవలు అందించామని, ఇందుకోసం ప్రత్యేకంగా ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందుకు ఉదాహరణగా టీహబ్, వీహబ్, అగ్రిహబ్,బీ హబ్, రిచ్, టీ వర్క్ ఇంక్యులేషన్ కేంద్రాల గురించి వివరించారు. డిజిటల్ ఎకానమీ, పరిపాలనలో ఐటీ వినియోగంపై పార్లమెంటరీ సంఘం ఆసక్తిగా అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ వివరంగా సమాధానమిచ్చారు. మొబైల్ ఆధారిత ప్రభుత్వ సేవలు, కాంటాక్ట్ లేస్ గవర్నెన్స్ దిశగా చేపడుతున్న కార్యక్రమాలు, టీ వాలెట్ సాధించిన మైలురాళ్లను, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇంటింటికి ఇంటర్నెట్ అందించే ఉద్దేశంతో చేపట్టిన టీ ఫైబర్ ప్రాజెక్టు గురించి వివరించారు. టీ ఫైబర్ ప్రాజెక్టు ప్రాధాన్యం దృష్ట్యా కేంద్రం మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా సీఎం కేసీఆర్ విజన్ మేరకు ఏర్పాటు చేసిన ధరణికి వినియోగిస్తున్న టెక్నాలజీ, దాని పనితీరు గురించి చెప్పారు. తెలంగాణకు ప్రత్యేకంగా సహాయం అందించడంలో కేంద్ర ప్రభుత్వం మరింత చొరవ చూపేలా సిఫార్సు చేయాలని ఈ సందర్భంగా పార్లమెంటరీ కమిటీని మంత్రి కేటీఆర్ కోరారు. ముఖ్యంగా ఐటీఐఆర్ వంటి ప్రాజెక్టును లేదా అదనపు ప్రోత్సాహాన్ని వెంటనే ప్రకటించే అంశంలో కమిటీ సహకరించాలని కోరారు.

# లక్ష్యం కోటి చేపపిల్లలు



హైదరాబాద్, సెప్టెంబర్ 8: గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడంతో పాటు కులవృత్తులు ఆధారపడిన వారి కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర పశు సంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శామీర్‌పేట పెద్ద చెరువులో మంత్రి మల్లారెడ్డితో కలిసి బుధవారం చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అనుక్షణం పాటుపడుతున్నారని, ఎన్నో సిటీ ప్రాజెక్టులను చేపట్టి తెలంగాణలో 365 రోజులు నీళ్లు ఉండేలా ప్రణాళిక రూపొందించారని వివరించారు. ఎక్కడ నీళ్లుంటే అక్కడ చేపలు ఉండాలని, 100 శాతం సబ్సిడీపై చేప పిల్లలు పంపిణీ చేస్తున్నామన్నారు. మేడ్చల్ జిల్లాలో కోటి చేప పిల్లల పంపిణీతో పాటు ఉచితంగా సీడ్ ఇస్తున్నామన్నారు. గొల్లకురుమలకు గొర్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన హరితహారంతో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. వ్యవసాయం, చేపల పెంపకంతో పాటు అన్ని రంగాలకు మంచి రోజులు రాబోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రాజేందర్, కమిషనర్ లచ్చిరాం, బుక్య, అడిషనల్ డైరెక్టర్ శంకర్ రాథోడ్, జీఎంవీ శ్రీనివాస్, జడ్పీ వైస్ చైర్మన్ రైతు బంధు జిల్లా అధ్యక్షుడు నందారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లూబాయి బాబు, జడ్పీటీసీ అనితాలాలయ్య, వైస్ ఎంపీపీ సుజాత తిరుపతిరెడ్డి, జిల్లా మత్స్యశాఖ మాజీ చైర్మన్ వెంకటేశం, నర్సింహారెడ్డి, మద్దుల శ్రీనివాస్‌రెడ్డి,డీడీ లక్ష్మీనారాయణ, చెరువు చైర్మన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి రఘు, టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్, యూత్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



బుధవారం సాయంత్రం ఖైరతాబాద్ మహాగణపతి వద్ద యువతుల సందడి

# ప్రైవేట్ స్థలాల్లో వినాయక విగ్రహాలకు ఓకే

హైదరాబాద్ , సెప్టెంబర్ 8:వినాయక చవితి ఉత్సవాలపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు ప్రదేశాల్లో వినాయక విగ్రహాలు, మండపాలు ఏర్పాటు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. పూజ సమయంలో ఐదుగురినే అనుమతించాలని నిర్వాహకులకు స్పష్టం చేసింది. ఐదుగురికి మించి ఎక్కువమంది ఒకచోట చేరకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. రాజ్యాంగం ప్రకారం మతపరమైన కార్యక్రమాలు నిర్వహించుకొనే స్వేచ్ఛ, మతపరమైన విశ్వాసాలు రెండూ ముఖ్యమేనని, వాటి విషయంలో సమన్వయంతో వ్యవహరించాలని వ్యాఖ్యానించింది. ప్రజాశాంతి, ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని అవసరమనుకుంటే సముచితమైన ఆంక్షలు విధించే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ ఆదేశాలిచ్చారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కేశవయానగంటలో వినాయక చవితి ఉత్సవాలను పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాల్ చేస్తూ ఆర్. మణికాంత్ వర్మ, ఎస్.ప్రశాంత్, అలాగే తిరుపతి ఆటోనగర్‌కు చెందిన ఓంకార్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై బుధవారం లంచ్ మోషన్‌లో హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్లు మణికాంత్ శర్మ, ఎస్. ప్రశాంత్ తరఫున న్యాయవాది భూషేశ్, మరో పిటిషనర్ ఓంకార్ తరఫున న్యాయవాది కుర్రా శ్రీనివాసులు వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సుమన్, జీపీ మహేశ్వర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాలు, మండపాలు ఏర్పాటు చేయకుండా ఆదేశాలు ఇచ్చాయన్నారు. ఉత్సవాలపై నిషేధం విధించలేదన్నారు. కొవిడ్ నిబంధనలకులోబడి ఉత్సవాలు జరుపుకోవాలని షరతులు విధించామన్నారు. పిటిషర్లకు అనుమతిస్తే రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల చోట్ల అనుమతించాల్సి ఉంటుందన్నారు.

# రఘురాం రచించిన 'జ్ఞానదీప్తులు జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ



హైదరాబాద్ , సెప్టెంబర్ 8: జ్ఞాపకాలు గొప్పొ అనుభూతిని పంచుతాయని ఏపీ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువకళావాహిని, సారిపల్లి కొండలరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మద్దాళి రఘురామ్ రచించిన ' జ్ఞానదీప్తులు జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండలి బుద్ధప్రసాద్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సాహితీవేత్త, ఓలేటి పార్వతీశం, రచయిత్రి మండపాక అరుణకుమారి, పట్టాభిరామ్, మద్దాళి ఉషాగాయత్రి, యువకళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# పురోగామి తెలంగాణ

**-గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్**

హైదరాబాద్, సెప్టెంబర్ 8: తెలంగాణ అభివృద్ధి పథంలో పురోగమిస్తున్నదని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ప్రశంసించారు. రైస్‌బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ అభివృద్ధి చెందుతున్నదని కొనియాడారు. ప్రభుత్వ దవాఖానలు మెరుగ్గా పనిచేస్తున్నాయని, కొవిడ్ కట్టడి, టెస్టింగ్‌లు, వ్యాక్సినేషన్‌లో వేగంగా మెరుగైనా ఫలితాలు సాధించిందని కితాబిచ్చారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన రెండేండ్లయిని సందర్భంగా తమిళిసై బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. యంగెస్ట్ స్టేట్‌కు యంగెస్ట్ గవర్నర్‌నని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలకు సిస్టర్‌నని చెప్పారు. గవర్నర్ కార్యాలయాన్ని ఈ-ఆఫీస్‌గా మార్చారని సీఎం కేసీఆర్, మంత్రులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న పుదుచ్చేరికి తెలంగాణ నుంచి పీపీఈకిట్స్, మాస్కులు అందజేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆన్‌లైన్ క్లాసులు వినేందుకు ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులకు ప్రైవేట్ సంస్థలు, కంపెనీలు వినియోగించిన లాప్‌టాప్‌లను ఇవ్వాలని సూచించారు. మెడికల్, ఫా ర్యాహబ్‌గా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని అన్నారు.

# ప్రజలకు సౌకర్యాలు కల్పించండి- ఎమ్మెల్యే ముఠాగోపాల్





చేపల మార్కెట్‌లో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్.

హైదరాబాద్ , సెప్టెంబర్ 8: ముషీబాద్ డివిజన్ చేపల మార్కెట్‌లో డ్రైనేజీ పైపులైన్, మ్యాన్‌హోళ్ల నిర్మాణ పనులను నిర్లక్ష్యం చేయడం పట్ల ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులపై మండిపడ్డారు. మ్యాన్‌హోళ్ల మూతలు ఏర్పాటు చేసి నెల రోజులకే విరిగిపోవడం, నాణ్యతా ప్రమాణాల ౦ పాటించకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో అధికారులతో కలిసి పర్యటించారు. మార్కెట్‌లో సౌకర్యాల తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేపల మార్కెట్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# పెన్నా శివరామకృష్ణకు కాళోజీ పురస్కారం



రచయిత పెన్నా శివరామకృష్ణకు రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ పురస్కారం ప్రకటిం చింది. గురువారం రవీంద్రభారతిలో ఆయనను సత్కరించనుంది. ఈ అవార్డులో భాగంగా రూ. 1,01,116/- నగదు బహుమతి, జ్ఞాపికతో సన్మానించనుంది. హైకూలు, గజల్ల వంటి విశిష్ట ప్రక్రియల్లో పెన్నా విశేష కృషి జరిపారు. 'రహస్య ద్వారం' పేరుతో తొలి తెలుగు హైకూను ఆయన రచించారు. శివరామకృష్ణ జన్మస్థలం నల్లగొండ జిల్లాలోని దుగునపల్లి గ్రామం.

# 143 ఇంజనీరింగ్ కాలేజీలకు ఓకే

హైదరాబాద్ , సెప్టెంబర్ 8: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల గుర్తింపు ప్రక్రియ కొలిక్కి వచ్చింది. బుధవారం 143 కాలేజీల వివరాలను ఎంసెట్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. గురువారం మిగిలిన కాలీజీల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలయ్యే నాటికి కాలేజీల వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. ఈ ఏడాది గుర్తింపు ప్రక్రియలో కొంత జాప్యం జరిగింది. దీంతో ఎంసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో కూడా మార్పులను చేశారు. కాగా, బుధవారం నాటికి 71,172 మంది విద్యార్థులు తమ స్లాట్‌లను నమోదు చేసుకున్నారు. 51,392 మంది విద్యార్థులు తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్నారు. కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అభ్యర్థులు 9లోగా తమ పేర్లను (స్లాట్) నమోదు చేసుకోవాల్సి ఉన్న విషయం తెలిసిందే. అలాగే 11లోగా సర్టిఫికేషన్ పూర్తి చేయించుకోవాలి. 11 నుంచి 16 వరకు ఆప్షన్లను నమోదు చేసుకోవాలి. 18వ తేదీన సీట్లను కేటాయించనున్నారు.

# రూ. 100 కోట్ల శశికళ ఆస్తులు జప్తు

హైదరాబాద్ , సెప్టెంబర్ 8: అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళకు చెందిన రూ.100 కోట్ల విలువైన ఆస్తులను ఆదాయం పన్ను శాఖ అధికారులు జప్తు చేశారు. 1991-96 మధ్య తమిళనాడు సీఎంగా జయలలిత ఉన్నప్పుడు పయనూర్ గ్రామంలో శశికళ ఈ ఆస్తులను కొనుగోలు చేసినట్టు తెలుస్తున్నది. అయితే 2014లో ఈ 11 ఆస్తులను ఆదాయానికి మించిన ఆస్తులుగా పేర్కొంటూ ఇప్పటి కర్ణాటక స్పెషల్ కోర్టు జడ్జి జాన్ మిచేల్ కున్హా తీర్పు నిచ్చారు. ఈ నేపథ్యంలో అధికారులు ఈ ఆస్తులను జప్తు చేశారు. కాగా, ఈ ఆస్తులను అప్పట్లో రూ. 20 లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం.

# ఉత్తమ చిన్న కథానికల ఎంపిక

హైదరాబాద్ , సెప్టెంబర్ 8:రంజని తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్న కథానికల పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథానికలను సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందిరాజు పద్మలతా జయరాం, మట్టిగుంట వెంకటరమణలు ప్రకటించారు. రెండు వందల కథానికలుగా రాగా పదిహేను ఉత్తమ కథానికలను ఎంపిక చేశామని రచయితలకు త్వరలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఎన్ఎల్‌జే రాణి (బంధం), ఎం. సుగుణ రావు (సంస్కృతి), వీఎన్ మంజుల (కావరి), కడియాల ప్రభాకర్ (జీవితమంటే అదే కదా), పెనుమాక నాగేశ్వరరావు (సరస్వతి నమస్తుభ్యం), జీఎన్‌వీ సత్యనారాయణ (ఈ నాన్నను క్షమిస్తావు కదూ), బులుసు సరోజిని దేవి (హే రామ్), వంద త్రినాథరావు (నాన్న), కొత్తపల్లి ఉదయబాబు (పెద్ద గీత-చిన్న గీత), సీహెచ్ శివరామప్రసాద్ (స్టేటస్), మల్లాది హనుమంత రావు (పురుష ప్రయత్నం), వడలి రాధాకృష్ణ (తెల్ల చీకటి), ఆర్సీ కృష్ణ స్వామి రాజు (మస్తాన్‌రెడ్డి), ఎ.ఉమ (వ్యాక్సిన్)లు ఎంపికైనట్లు వివరించారు.

**చరిత్రలో నేటినిజం**

కం॥ [illegible]
[illegible]
[illegible]
[illegible] !!

( సెప్టెంబర్ 9 ఆలూరు బైరాగి జయంతి..)



\-రాధశ్రీ
సెల్: 9494481210




నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 9-9-2021

## నానీలు

మట్టి వాసన
మైమరపిస్తోంది
మేఘం
చినుకై ముద్దాడింది.

చెలిమె తోడితే
ఊరేవి నీళ్ళు
మనసు మరిగితే
ఉబికేవి కన్నీళ్ళు

జరీపూలు
మెరవడం లేదు
నేతన్న బతుకుల
రాత మారడం లేదని



-వద్దేపల్లి సంధ్య
సెల్:7036000123



-శ్రీదాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240

## నేటికవిత-కవిత్వ విశ్లేషణ

నేటికవితలో ఈ వారం: 'చివరకు గెలిచేది'
అనే అంశంపై వచ్చిన కవితల్లోంచి ఓ మూడు కవితలపై విశ్లేషణ



-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

### కీర్తి చంద్రిక

ధనవంతుడ నేనని
ఏదైనా సాధించవచ్చు డబ్బుతోనని
డబ్బుకు లోకం దాసోహమని
మది తలచి
విత్తమార్జన చేసి
విర్రవీగిన ఏమి ఫలం?
మంచి ఏ కొంచెమైనా
ఆర్జించు కీర్తిని
పరులకు తోడ్పడుటకై
సొంతలాభం కొంతమానుకొని
మానవత్వం మూర్తీభవించిన
మనిషిగా
పేదల, దీనుల, ఆపన్నులను
ఆదుకొన్న లభించు
ధనంతో ఒనగూడని ఆత్మసంతృప్తి
పోయినపుడు వెంటరాదు
కూడబెట్టిన ధనం
చివరకు గెలిచేది
నిస్వార్థంగా చేసిన
మంచిపనులకు లభించిన
కీర్తి చంద్రికయే.



-ముదుంబై శేషఫణి
9441771955

వరంగల్‌కు చెందిన కవయిత్రి ముదుంబై శేషఫణి గారు చివరకు గెలిచేది అంశంపై కీర్తిచంద్రిక శీర్షికతో రాసిన కవితలో స్వార్థం లేకుండా జీవితంలో మనం చేసే పనుల ద్వారా ఆర్జించే మంచి కీర్తి చివరకు గెలుస్తుందన్న విషయాన్ని నొక్కి చెప్పారు. సంపదలెన్ని ఉన్నప్పటికీ మన సత్ప్రవర్తనతో పరుల హితంకోసం చేసే మంచి పనులే మనకు కీర్తిని ఆర్జించడమే గాక ఈ జీవితానికి గెలుపును సమకూర్చుతుందని పేర్కొన్నారు.

డబ్బే సర్వస్వమని భావించరాదనీ.. ధనవంతుడనేనని విర్రవీగవద్దనీ..డబ్బుతో దేన్నయినా సాధించగలమన్న ఆలోచన సరియైంది కాదని కవయిత్రి శేషఫణి గారు వివరింప యత్నించారు. డబ్బుకు లోకం దాసోహం అన్న ఆలోచన సరికాదనీ..విత్తమార్జనే పరమావధి కాకూడదని సూచించారు. జీవితంలో మనం సంపాదించే డబ్బు.. ఆస్తులు.. కీర్తిని సమకూర్చవనీ.. మనం చేసే లోక హిత పనులే మనకు శోభను కూర్చుతాయని పేర్కొన్నారు.

సొంతలాభం కొంత మానుకుని..పరులకోసం తోడ్పడాలని హితవు పలికారు. మనిషిలో మానవత్వం మూర్తీభవించాలని.. పేదలు..దీనులు...ఆపన్నులను ఆదుకోవడంలో ఉన్న ఆత్మసంతృప్తి, సంపదవల్ల ఒనగూరదని విడమరచి చెప్పారు. అందుకోసం నిరంతరం పేదల పక్షాన నిలవాలని పిలుపునిచ్చారు. శేషఫణి గారి కవిత్వంలో కవిత్వాంశ కొరవడినప్పటికీ మనిషిగా మనం పాటించాల్సిన కర్తవ్యాలను గుర్తుచేశారు. అభివ్యక్తిలో నవ్యత పాటించకపోయినప్పటికీ దీనుల పక్షాన నిలిచి వారిని ఆదుకోవాలని ఆకాంక్షించడాన్ని అభినందించి తీరుతాం. కవితలో వచనం డామినేట్ చేసినప్పటికీ.. ఓ చక్కని సందేశాన్ని అందించడం కోసం ప్రయత్నించడం ప్రశంసనీయం. పోయినప్పుడు మన వెంట కూడ బెట్టిన ధనం మన వెంట రాదనీ.. చివరకు గెలిచేదీ.. మిగిలేది మనం చేసిన పనులేనని.. అవే మనకు కీర్తిని ఆర్జించి పెడతాయని చెప్పడం వంటివి కొత్తగా చెప్పినవి కాకపోయినప్పటికీ మళ్లీ ఒకసారి గుర్తుచేయడానికి శేషఫణి గారు అంశం వెలుగులో ప్రదర్శించడం బాగుంది.

### ఆఖరిగెలుపు

అహంను పక్కకు నెట్టి
వెలుగు నీడల్లో జయాపజయాల్ని
వెదుక్కుంటూ వున్నాను
ఈర్ష్యాసూయాలను మూలకు కట్టిపెట్టి
రాగద్వేషాలను యిరుకున పెట్టి
కోరికల తుట్టెను తెంచి
నిశ్చలమైన మనసుతో
తమస్సులోని ఉషఃస్సును పట్టుకొని
నీ కోసం చేసే ఎడారి ప్రయాణంలో
ఓయాసిస్సుకై వెదికే దాహార్తిని
గమ్యం లేని గమనంలో
దిక్సూచి లేని బాటసారిని
కళ్ళు లేని ప్రయాణీకున్ని
నాలో నేనును చంపుకొని
మనస్సులో విశ్వాసాన్ని నింపుకొని
నీ కోసం వస్తున్న అజ్ఞాత పాంథుడను
కనిపించని శూన్యంలో
గగన కుసుమాలకోసం వెదుక్కుంటు
నిరంతర ధ్యానంలో నిమగ్నమైన భక్తుణ్ణి
నాకు తెలుసు
నే చేస్తున్న ఈ విశ్వప్రయత్నంలో
నాకు గెలుపు వుండదని
చివరి గెలుపు నీదేనని



-కందుకూరి మనోహర్
9908231588

హైదరాబాదు మల్కాజిగిరికి చెందిన కవి కందుకూరి మనోహర్ గారు చివరకు గెలిచేది అంశంపై ఆఖరిగెలుపు శీర్షికతో రాసిన కవిత ఆద్యంతం ఆసక్తికరంగా మలచబడింది. గమ్యంలేని గమనంలో.. దిక్సూచి లేని బాటసారిననీ.. కళ్లులేని ప్రయాణికుణ్ణి అంటూ శూన్యంలో గగన కుసుమాలు వెదుక్కుంటూ నిరంతరధ్యానంలో నిమగ్నమైన భక్తుని మదిలో కదలాడే భావాలను అంశం వెలుగులో కవి మనోహర్ గారు తాత్వికతతో తమ కవితను తీర్చిదిద్దారు. ఆధ్యాత్మికతను జోడించి ఓ భక్తుని అంతరంగాన్ని ఆవిష్కరిస్తూ ఆఖరి గెలుపు దైవానిదే అన్న అర్థం స్ఫురించే విధంగా కవి మనోహర్ గారు తమ కవితను కొనసాగించారు. సరళత్వానికి పెద్దపీట వేస్తూ సంక్లిష్టతకు తావివ్వకుండా రాసిన ఈ కవిత యొక్క ఎత్తుగడలోనే ఓ భక్తునిగా అహంను పక్కకు పెట్టి వెలుగునీడల్లో జయాపజయాలను వెదుక్కుంటూ ఉన్నానని చెప్పడం బాగుంది. విశ్వాసమే ఆలంబనగా .. ఆరాధనాభావంతో..భగవంతుని ప్రార్థించే సమయాన.. ఓ భక్తుని మదిలోని భావాలను..ఆకాంక్షలను అక్షరాలలో నిక్షిప్తం చేశారు.

ఈర్ష్యాసూయాలను మూలకు కట్టిపెట్టి యిరుకున పెట్టి కోరికల తుట్టెను తెంచి..నిశ్చలమైన మనసుతో భగవదారాధన చేసే అంశాలను ఔచిత్యవంతమైన పదబంధాల ప్రయోగంతో కవితకు కవి మనోహర్ గారు పుష్టిని కూర్చారు. తమస్సులోంచి ఉషస్సును పట్టుకొని .. నీకోసంచేసే ఎడారి ప్రయాణంలో ఓయాసిస్సుకై వెదికే దాహార్తినంటూ కొనసాగించినపంక్తులు కవితలో చక్కగా ఒదిగిపోయాయి. నిరంతర ధ్యానంలో నిమగ్నమైన భక్తుణ్ణి .. నాకు తెలుసు.. నేచేస్తున్న ఈ విశ్వ ప్రయత్నంలోభగవంతుని కృపకు పాత్రుని కాగలను కానీ..నాకు గెలుపుండదని.. ఆఖరికి గెలుపు దైవందే అంటూ భక్తి ప్రపత్తులు ప్రదర్శించారు. ఆఖరికి గెలుపు దేవునిదేనన్న అర్థం వచ్చేలా రాసి భగవంతుడే గొప్ప అని చెబుతూ కవితను రాసినప్పటికీ..నర్మగర్భంగా కోర్కెలు తీర్చేవాడు దేవుడేనని తేల్చిచెప్పిన తీరు బాగుంది. శిల్పం అభివ్యక్తి వంటి విషయాల్లో కవి మనోహర్ గారు మరింత శ్రద్ధ చూపుతూ మున్ముందు గాఢమైన కవిత్వాన్ని అందించాలని ఆశిద్దాం.

### న్యాయం

న్యాయానికి ఉరితాడు వేసే చోట
వేలానికి ధర్మం అమ్ముడయే వేళ
సాక్ష్యాలన్నీ తారుమారై తెల్లముఖం వేస్తుంటే
తలకిందుల అన్యాయపు కోటలో..
తరాజు పట్టుకున్న దేవత
నల్లగంతలు కట్టుకుంది..
అక్కడ వినపడేది పచ్చనోట్ల రెపరెపలే..
నల్లకోటు చమత్కారపు గారడీలో..
జరిగిన ఘోరం అబద్దపు ముసుగేసింది
నిజం మసిబారిన చీకటై మిగిలింది!
న్యాయం జరుగుతుందన్న ఆశతో..
బికారుల్లా ఏళ్లకేళ్లు వేచిచూసే
అమాయకులు!
చిత్రంగా.. యుగాలుగా అవే నీతిసూత్రాలు
చెప్పేందుకే తప్ప చేతకు రాని పాలనలు!
కాలం చెల్లిన పట్టాల బూజు దులిపి
లొసుగులు లేని చట్టాలకు
కొత్త నియమాల రెక్కలు తొడిగి
సత్వర తీర్పులకు తలుపులు తెరిస్తే
తలవంచని నీతి నిలబడినట్టే
ఎందరో నిర్భాగ్యులకు మేలు జరిగినట్లే
మరెన్నో జరుగబోయే దారుణాలను ఆపినట్లే
చివరకు గెలిచేది నిజంగా న్యాయమే.



-విజయ రామగిరి
9949043229

హైదరాబాదుకు చెందిన విజయ రామగిరి గారు చివరకు గెలిచేది అంశం న్యాయం శీర్షికతో రాసిన కవితలో చివరకు గెలిచేది న్యాయమేనని తేల్చిచెప్పారు.

ఎత్తుగడలో ప్రయోగించిన పదబంధాలు బాగున్నాయి. ప్రారంభపంక్తుల భావాలు పాతవే అయినా కవితకు బలాన్నిచ్చాయి. న్యాయానికి ఉరితాడు వేసేచోట వేలంలో ధర్మం అమ్ముడయేవేళ..సాక్ష్యాలన్నీ తారుమారై తెల్లముఖం వేస్తుంటే..తలకిందుల అన్యాయపు కోటలో తరాజు పట్టుకున్న దేవత నల్లగంతలు కట్టుకుందని కవయిత్రి విజయగారు నేడు అక్కడక్కడ నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టారు.

న్యాయస్థానాలన్నీ కవయిత్రి విజయగారు పేర్కొన్నట్లు.. అవినీతి మయం కాకపోయినా.. చాలా సందర్భాల్లో చూస్తున్న ఘటనలు అనుభవాలను అక్షరాల్లో ఆవిష్కరింరే ప్రయత్నం చేశారు. అక్కడ వినపడేవి పచ్చనోట్ల రెపరెపలే... నల్లకోటు చమత్కారపు గారడీలో జరిగిన ఘోరం అబద్ధపు ముసుగేసుకుందని వాపోయారు. నిజం మసిబారిన చీకటై మిగిలిందని వ్యాఖ్యానించారు. న్యాయం జరుగుతుందన్న ఆశతో బికారుల్లా ఏళ్లకేళ్లు వేచిచూసే అమాయకులు.. చిత్రంగా యుగాలుగా అవే నీతిసూత్రాలంటూ అభిప్రాయపడ్డారు. చెప్పేందుకే తప్ప చేతకు రాని పాలనలు అంటూ కవయిత్రి ఆవేదనను వ్యక్తపరిచారు.

కాలం చెల్లిన చట్టాల బూజు దులపాల్సిన అవసరముందనీ.. లొసుగులు లేని చట్టాలను తీసుకరావడానికి కొత్త నియమాల రెక్కలు తొడగాలని సూచించారు. ప్రస్తుత కాలంలో తీర్పుల ప్రకటనలో జరుగుతున్న జాప్యాన్ని తొలగించాల్సిన ఆవశ్యకతను కవయిత్రి నొక్కి చెప్పారు. అందరికీ మేలు జరగాలంటే సత్వరం న్యాయం అందించాల్సి ఉందనీ.. కవయిత్రి ఆకాంక్షించడం బాగుంది. సమాజంలో మరెన్నో దారుణాలు జరగకుండా ఉ ండాలంటేన్యాయవ్యవస్థను ప్రక్షాళనం చేయాలని చెప్పడం బాగుంది. చివరకు న్యాయమే గెలిచేలాసామాజిక స్థితిగతులు.. చట్టాలు మార్చాలని కవయిత్రి విజయగారు భావించడం అభిలషణీయమే అయినా అత్యంత గౌరవప్రదమైన న్యాయవ్యవస్థ ఆమె అనుకున్నంత దారుణంగా లేదన్నది ఆమె గమనించాలి. మన రాజ్యాంగం వెలుగులో మనం ఏర్పాటుచేసుకున్న చట్టాలను మనందరం గౌరవించాల్సిందేనన్న విషయం వారికి తెలియందికాదు.

## పుస్తక సమీక్ష

# శతాధిక కవులు- అర్ధ సహస్రాధిక కవితలు



- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

ప్రముఖ కవి, సాహితీ ప్రియుడు శివమంచాల సంపాదకత్వంలో గత సంవత్సరం తెలుగు సాహితీ సమాఖ్య 'కవన కిరణాలు' పేరిట తొలి కవితా సంకలనం ప్రకటించింది. ముంబయిలో పురుడుపోసుకున్న ఈ సంస్థత యిప్పుడు అంతర్జాతీయ స్థాయిలో అనేక సాహిత్య కార్యక్రమాలు, కవితా పోటీలు, కవి పురస్కారాలు, యిలా సాహిత్య సందడితో అభివృద్ధి పంథాలో దూసుకుపోతోంది. ఈ విజయ యాత్రలో సంస్థ సభ్యులదరూ భాగస్వామ్యులే నంటారు శివ మంచాల.

యిప్పుడు ద్వితీయ ప్రయత్నంగా 'కవన కిరణాలు' పేరిట మరో కవితా సంకలనం వెలువరించారు. దాదాపు 550 పేజీల ఈ ఉద్గ్రంథంలో శతాధిక కవుల అర్థ సహస్రాధిక కవితలు పొందుపరిచారు. మొత్తం 108 కవులు, కవయిత్రులు 540 కవితలు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే గాక ఒడిసా, సోలాపూర్, ముంబయి తదితర ప్రాంతాల నుండి రచనలు సేకరించి ఒక చోట పేర్చి 2021 సం॥ ప్రచురణగా ప్రకటించింది. తెలుగు సాహితీ సమాఖ్య. యిదో బృహత్ ప్రణాళిక. అపూర్వ ప్రయోగం. కొందరు ఒక కవితకే పరిమితమవుతే సింహభాగం రచయితల కవితలు పది నుండి పాతిక వరకూ చోటు చేసుకున్నాయి.

బైసా దేవదాసు 'నేటినిజం' పత్రికా సంపాదకుడిగానే చాలా మందికి తెలుసు. ఈ అక్షర ప్రేమికుడు ఒకప్పుడు కవిత్వం రాసాడని ఎంత మందికి తెలుసు? 'కరోనా' నేపథ్యంలో ఆయన సృజించిన 'అంతర్దర్శనం' కవిత చదివితే దేవదాస్ కవితాశక్తి అవగతమవుతుంది. కవి ఆశావహ దృక్పథం పరిమళిస్తుంది.

**"మనిషి అంతర్మథనం ప్రారంభం అయింది**
**ఆత్మ విమర్శ చేసుకోవడానికి అవకాశం దొరికింది!**
**కరోనా కాలాన్ని తిట్టుకుంటేనో**
**పాప పుణ్యాల లెక్కలేస్తేనో**
**వచ్చిన కష్టం తీరిపోదు, జరిగిన నష్టం భర్తీకాదు!**
**ఎప్పటికైనా ఈ సమస్యను అధిగమిస్తాం**
**తిరిగి ఇంతకు రెండింతలు పురోగమిస్తాం**
**ఇప్పుడు నేర్చుకోవాల్సింది పరివర్తన**
**పరిశుద్ధంగా మార్చుకున్న సద్భావన?!"** యివీ దేవదాస్ కవితా పంక్తులు.

"ముంబాయి తెలుగు సాహితీ సమాఖ్య ముగ్గుపోసిన కవన బృందావనమిది" అంటు గ్రంథానికి పీఠిక నందించిన తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్ నందిని సిధారెడ్డి కూడా "చిత్ర యుద్ధం' శీర్షికన ఓ కవిత నందించారు.

"ఇంట్లో కూర్చోవడం కష్టమని
ఇంట్లో కూర్చుంటే గాని తెలియలేదు'' అంటూ ప్రారంభమవు తుంది కవిత.

సామాజిక దూరం కలిసి వచ్చిన అదృష్టం' యిలా వస్తువు ఆవిష్కృత మైంది. 'కరోనా.. ఈ మహమ్మారిపై యుద్ధం ప్రకటిస్తున్నాడు కవి "చిత్రయుద్ధం".

**'తుంపిళ్ళకు భయపడే**
**రోజొకటి వస్తుందని కలగనలేదు**
**వేలిముద్రలు వేటాడవచ్చు**
**గొళ్ళాలు పెట్టిన చేత్తోనే..**
**గొళ్ళాలు కడుగు, గోడలు కడుగు**
**ఇల్లు పరాక్.. శరీరం పరాక్**
**ఇల్లు కదలకుండా,**
**కడుపులో చల్ల కదలకుండా**
**యుద్ధం చెయ్యొచ్చని**
**వణుకుతూ యుద్ధం చెయ్యొచ్చని**
**ఇంట్లో వణుకుతుంటే తెలిసింది"**

ఇదో విచిత్రయుద్ధంలా తోస్తోంది గదూ! తప్పదు మరి!!

**"కంటికి కనపడని క్రిమికరోనా**
**చావు బతుకులను శాసిస్తోంది!"**

యిదీ.. ప్రముఖ కవి మహ్మద్ షరీఫ్ ఆవేదన.

ఈ రక్కసిని పారద్రోలడానికి షరీఫ్ వద్ద మానవత్వాస్త్రం ఒకటుంది.

**"తోటి వారికి సాయపడటమే జీవిత పరమార్థమని**
**మనుషులంతా ఒక్కటేనని**
**మనం మనం జనం అంటూ**
**మానవ ధర్మం చాటుదాం!**
**మనుషులంతా ఏకమవుదాం**
**చేయి చేయి కలుపుదాం**
**ఐకమత్యంతో కరోనాను ఖతం చేద్దాం**
**మానవత్వానికి మరణం లేదని నిరూపిద్దాం!!"**





ఇది కవి ఆలపిస్తున్న 'మానవత్వ' మంత్రం.

తెలుగు కవనలోకంలో ప్రతిభావంతుడైన కవి మౌనశ్రీ మల్లిక్. కవిత రాసినా, సినీ గీతం పలికించినా, టీవీ సీరియళ్ళకు పాటలు అందించినా కొత్త ఊహలతో కొత్త కొత్త ఉపమలతో కవిత్వాన్ని రసాలూరేలా పండించగల సిద్ధహస్తుడు. ఒక ఆలోచనా శకలాన్ని కవిత్వం చేయగల సమర్థుడు. ఆయన కవితా శీర్షిక 'గాలి'. గాలి తన చెవిలో నెమ్మదిగా ఏదో చెప్పిందట. అదే కవితగా రూపుదిద్దుకుంది అంటాడు. కవితా పంక్తులు విడదీసి వ్యాఖ్యానించడమంటే కవి ఊహాశాలిత్వానికి అడ్డుకట్టలు వేయడమే. అందుకే ఆ సాహసం చేయను, చదువుతే చక్కని అనుభూతినిచ్చే కవిత 'గాలి'.

**"జీవితంలో మనిషితనంతో**
**బతకటమెలాగో నేర్పిస్తుంది"**

అంటు కవితా తత్వాన్ని విశదీకరిస్తాడు కవి, రచయిత సాహిత్య ప్రకాశ్.

గ్రంథ సంపాదకులు మంచాలశివ తన అయిదు కవితలను పొందుపరిచారు. మనసు కలవరాన్ని, మనశ్శాంతి కొరకు సూత్రాలను వల్లె వేస్తారు శివ. వానల కోసం ఎదురుచూసే పల్లె చూపుల వైపు పాఠకులను మళ్ళిస్తారు. రాజకీయ పార్టీ ఏదైనా నాయకులు ధరించేది మాత్రం ఖద్దరు బట్టలే.

'ఖరీదైన ఖద్దరు వెనక దాగిన మృగం రౌడీయిజం".

అందుకే 'బాబోయ్ రాజకీయం!' అంటు బెంబేలెత్తుకున్నాడు కవి. వ్యవస్థలో మార్పు రావాలంటాడు. అందుకు.. "జీత భత్యాలు లేని ఉచిత ప్రజాసేవ చట్టం రావాలి/ రాజకీయ నాయకుల ఆస్తుల ప్రభుత్వపరం కావాలి!!"

ఇదీ శివమంచాల ఆకాంక్ష. ఆయనదే కాదు.. కోట్లాది భారతీయుల మరియు వంచితుల కొరిక కూడా.

కరోనా కష్టకాలంలో, ఈ విపత్కర పరిస్థితుల నుండి విముక్తమవ్వడానికి ప్రజలల్లో ఆత్మ విశ్వాసాన్ని పూరిస్తు, ధైర్యాన్ని కలిగిస్తు, కవులందరూ తమ, తమ కలాలను ఝుళిపించారు. భావోద్వేగాలను పంచుకున్నారు. 'అమ్మ', 'అమ్మభాష' వస్తువులుగా చాలా కవితలే వున్నాయి. అనేక సామాజిక సమస్యలను స్పృశించారు. ప్రకృతిని ఆస్వాదిస్తు కవితలల్లారు. అసంఖ్యాక జీవిత సంఘటనలు, జీవన సందర్భాలు వస్తువులుగా స్వీకరించి రచనలనందించారు. ఒకరా.. యిద్దరా శతాధిక కవులు. అయిదు వందలకు పైగా కవితలు.. ఎన్నని ప్రస్తావించగలం? చదివి అనుభూతించాల్సిందే..

**ప్రతులకు:** కవన కిరణాలు సాహితీ సమాఖ్య
ఇ.నెం. ఎస్ 9, బ్లాక్ నెం.27, 2వ అంతస్తు
హౌసింగ్ బోర్డు కాలనీ, దమినేడు,
తిరుపతి, ఆంధ్ర- 617 501

### నాన్నఫోటో

ఏప్రిల్ మొదటి తేదీ అంటే
ఎవరికి ఏ వార్త చెప్పినా
అనుమానంగా చూస్తారు
అది నిజం కాకుండా ఉంటే
ఎంత ఆనందించేదాన్ని!

ఇప్పుడు ప్రతి సంవత్సరం
ఆ తేదీ అంటేనే వదలని వర్షం
అంతులేని వేదనల రంపపుకోత
పరిమళానికి దూరమయిన పువ్వు

నాన్నఫోటో దగ్గర నిలబడి
అద్దంలో ప్రతిబింబాన్నై
అలాగే చూస్తుంటాను

నాకోసం దాచిన అక్షరగంధాలను
మళ్ళీ మళ్ళీ చదువుకంటాను

వదలలేని వారసత్వంగా
పదిమందిలో నన్ను చూపించి
పరిచయం చేస్తున్నప్పుడు
కళ్ళల్లో దాచుకోలేని గర్వహాసాలనూ

పంచిచ్చిన ప్రేమబంధాల బలాన్నీ
అందించిన అపురూప సంస్కారాన్నీ

కొండంత ఆశ్వాసన పంచిపెట్టి
పందిరేసిన మానవీయ విలువలనూ

నమ్మకాల పూలను నలిపేసి కాల్చినా
సహించిన కన్నతండ్రి కంటితడినీ

చేయిచాపిన ప్రతి దోసిలికి
అన్నమో..ఆదరణో
అందించిన ఆర్ద్ర మానసాన్నీ

వ్యూహంలేని జీవన విహంగాన్నీ
రేపు తలవని కర్మయోగిత్వాన్నీ

అలాగే..అక్కడే.. మరోపుటను
లిఖిస్తూ నిలబడి పోతాను
నాన్నఫోటోతో లీనమైపోతాను



-డా. సి. భవానీదేవి
9866847000

### ఆకాశం నుంచి

ఒక్కొక్క నక్షత్రం దిగి నాతో సన్నిహితంగా సంభాషించింది
ఆ సంభాషణలో నా తొలి నాటి మిత్రులను పరిచయం చేసి మళ్లీ జ్ఞాపకం లోకి తెచ్చింది
జీవితం ఒక సంఘర్షణ వలయం అని ఆనందాల హరివిల్లు
బ్రతుకు నిత్యం ఆనందం ఆకర్షణ కన్నీళ్లు కష్టాలు
సంగ్రామం లో నుంచి బ్రతుకు సంగ్రామంలో కి

సరిహద్దులు సైనికునికి పోరాటం పొలంతో
నిరంతర సంఘర్షణ పడుతున్న రైతులు ఆవేదన ఆవిష్కరిస్తున్న
కాలమిది రైతులు ఎంత పండించిన పేద రైతు గానే మిగిలిపోతున్నారు
ఎడతెగని పోరాటం రైతు ది సామాన్యుని ది పేద వానిది
రైతు సంఘం ఒక్కటిగా మారి రైతు జీవితంలోని కష్టాలను దళారీల దారుణాన్ని
ముందుకు సాగిపోవాలి రైతుల బతికించుకోవాలి
రైతు కష్టాలను తీర్చాలి ఎవరైనా ఏ ప్రభుత్వమైనా
ఏ రాజకీయ నాయకుడైనా అతని క్షేమాన్ని కోరినప్పుడు
పిడికెడు మెతుకులు పెట్టినప్పుడే రైతు రాజ్యం అవుతుంది
రైతులు బతికించిన వారమవుతాం



-డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు
7702537453

### అవ్వ

బువ్వ వెట్టేది! బుద్ది చెప్పేది!
కట్టమత్తె కన్నీళ్ళు తుడిసేది!
మంచి చెడులు జెప్పి మందలించేది!
ఆల్లపొద్దు గాల అలుకు జల్లేది!
సుద్దతో ముగ్గేసి శుద్ది జేసేది!
ఉడ్కిచ్చి మెతుకుల్ని ఉట్టిమీద వెట్టి
సాతగాకపేన సర్వము జేసేది!
చెట్టోలె రోజంత సేవ జేసేది
ఆకులలములు తెచ్చి అండి పెట్టేది
భూదేవి లాంటి బుద్ది మంతురాలు
పనులు జేస్తు మంచి పాటలు పాడేది
ఆట చిల్కలాల పాట చిల్క లాల
అన్ని నుడుగులు చెప్పి ఆశ్చర్య పరిచేది
ఆనోటు ఈనోటు అన్ని లెక్కలు తెలుసు
చెప్పులు లేకున్నా సేనంత తిరిగేది
ఎండలో ఎండి వానలో తడిసేది
కాయ కష్టము జేసి కడుపులు నింపేది
పండుగచ్చినగాని పాతబట్టలే గట్టు
ఆకాశమంతటి ఆత్మగల్ల తల్లి
ఇంటిముందరున్నతులశమ్మ లాంటిది
అర్కతి బర్కతీ బోనము తీసును
మిద్దెలు మేడలు వున్నా లేకున్నా
సల్లంగ బతుకాని దీవెన లిచ్చేది!
అరొక్క దేవుని కారతి వట్టేది
పలారముజేసి పంచి పెట్టేది!
మూలకేమొ నేడు మూల్గుతున్నది
ఆదరించే మనిషి అస్సలే లేపాయే
రేపైన మాపైన అందరి గతి అంతే
ఎల్లకాలమిట్లెవ్వలముంటము
వంతుకు వంతు ఉసురూకుంటదా
మనిషోలె బతుకుండ్రి
మమతను పెంచుండ్రి
అవ్వల గోసల్ని ఆడీడ జూత్తేను
బాంబోలె నాగుండె
బద్దలు ఔతుంది??



-డా పెరుక రాజు
7810032847

### నిప్పురవ్వలు




కూరగాయలు
ఇంటికి వచ్చినా
కొనకపోవడం
కల్లు బ్రాంచీలకు
క్యూలో నిలబడడం-
వి "చిత్రమే"!





నీళ్ళు రాని
కుళాయిని
ఎంత తిప్పనా-,
నియోజకవర్గానికి రాని
మంత్రికై
ఎంత తిరిగినా
నిష్ప్రయో"జనం"!



- డా॥ విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

## భల్లం భాష్యం

# అలా.. అలా.. కవిత్వంలో కలిసిపోతే...!

అదేమిటో తెలియదు.. మంచి కవిత్వం చదవగాలేగానీ- ఎవరైనా సరే చిన్న పిల్లలై గది అదిరేలా అల్లరి కాదు గంభీరానికి చిరునామాలు అయిపోతారు. చాలా పెద్దవాళ్ళై గాఢమైన తాత్విక అంచుల్లోకి హఠాత్తుగా నడుస్తూ వెళ్ళిపోతారేమో.

మౌనంలో నాని, మననం చేయడానికి యోగ్యమైతేనే మంచి కవిత్వమనుకుంటే- అది రాయడమంటే- అందమైన పదాలతో అపూర్వ భావాలతో అక్షర చిత్ర సౌధాల్ని నిర్మించడం కాదు- ఏకకాలంలో భిన్న భిన్న అనుభవకోణాల్ని ఆకళింపు చేసుకొని, అద్భుతంగా పద చిత్రాల్ని చిత్రించగలగడం!! అనుభవాన్ని బట్టీ, తదనుభవ తీవ్రతను బట్టీ, పద చిత్రం కూడా ఒక్కోసారి దృశ్యా దృశ్యంగా, స్పష్టాస్పష్టంగా, శబ్దా శబ్దంగా అనిపిస్తుంది కనిపిస్తుంది, వినిపిస్తుంది. అప్పుడు ఒక్కొక్క కవిత ఒక్కో అద్భుత జ్ఞాపకాన్ని మిగులుస్తుంది. ఒక్కొక్క అనిర్వచనీయ అనుభూతిని అందిస్తుంది.

కవి ఎప్పుడో ఒకప్పుడు ప్రకృతి ప్రస్తావన లేకుండా రాయలేకపోవడం ఒక బలహీనతనుకోండి. లేదా బలమనుకోండి. మనిషిని ప్రకృతిలో భాగం చెయ్యడమే ఒక సవాలుగా మారిన వికృత సన్నివేశంలో ప్రకృతి మాతృకగా కవిత్వం రాయడం గొప్ప సంస్కారమున్న కవి లక్షణమవుతుంది. అట్లాగే కొందరి కవులకు రాజకీయ విశ్వాసాలుంటాయి.

వాటిని ఆయా కవులు ఆయా సందర్భానుసారం కవిత్వంలోని వివిధ ప్రక్రియల ద్వారా వ్యక్తీకరిస్తుంటారు. కవి- కవిత్వంలో తన అంతరాంతర వైయుక్తిక అనుభూతినీ, స్పందనలను బాగా వ్యక్తీకరిస్తుంటాడు. కవిత్వంలో తనదైన సాంద్రభావాలను, తనదైన భాషలో చెప్పగల్గుతాడు.

ఈనాడు- జన జీవనంలో ఉన్న ఆవేదన, ఆందోళన, అలజడి, అసమానత, ఆకలి, నిరుద్యోగం, నిస్సహాయత, ఆనంద విషాదాలు- ఇలా అనేక రకాల ఇతివృత్తాలు ఆధునిక కవిత్వంలో చోటు చేసుకుంటున్నాయి. వీటి తీవ్రనీ, గాఢతనీ చిత్రించడానికి అంతే వైవిధ్యంతో కవిత్వ శిల్పమూ పరిణతి చెందుతూ సాగుతోంది.

ప్రతి అక్షరం- రెండు కళ్ళూ ఒక చూపుగా కవి లోలోన వెన్నెల కాస్తూనే వుంటుంది. అప్పుడప్పుడు వేసవి ఒళ్ళు విరుసుకుంటూనే వుంటుంది. కన్నీట తడిసిన వొత్తి కాగడాగా మారే క్రమంలో, కవిత్వంలో తాత్వికత అనివార్యమవుతుంది. కవి కవిత్వ సారాంశం బట్టి- బతుకు ఎడారి మీద అక్షరాల నడకలు అపుడపుడూ అగ్ని పునీతమవుతుంటాయి.

ప్రతి సన్నివేశాన్ని, సంఘర్షణను, సమాజాభివృద్ధి వ్యతిరేకశక్తుల కార్య కలాపాలను మనః సరోవరంలోని ప్రతి సంచలనాన్ని గూర్చి కవిత్వ భావనలోనే ఆలోచించుకోవడం తర్కించుకోవడం- అందుకు తగ్గ ప్రతీకల్ని చేర్చుకొని, పేర్చుకోవడం ప్రగతిశీలకవి అలవడిన అద్భుత ప్రక్రియ. అందువల్ల ఆ కవికి వస్తుదారిద్ర్యం సంభవించదు. భౌతిక, సామాజిక అంశాలతో పాటు, సంక్లిష్ట మానసిక సంఘర్షణకు, సత్యాన్వేషణకు కవిత్వ రూపమిచ్చే ప్రయత్నం నిరంతరం చేస్తూనే వుంటాడు. అప్పుడు ఆ కవి కవిత్వ వస్తు, రూప వ్యక్తీకరణల్లో నిబద్ధతలోనే అనిబద్ధతను, అనిబద్ధతలోనూ నిబద్ధతను గమనించగలుగుతాం.

> **కవులు కొన్ని వస్తువుల్ని తమ కావ్య ఇతివృత్తంగా మార్చుకునేటప్పుడు- కూర్చుకునేటప్పుడు కొన్ని ఇబ్బందులు ఏర్పడుతుంటాయి. మత విషయాల్ని కవితా వస్తువులుగా గ్రహిస్తున్నప్పుడు మరింత జాగ్రత్త వహించవలసి ఉంటుంది.**

కవి తాను సృజించిన కవిత్వం భిన్నంగా సృజనాత్మకంగా చేయడం వల్లనే కవిత్వ రచనలో విజయాన్ని సృష్టించుకోగలుగుతాడు. ఎవరు- ఎప్పుడు- ఎలా గొప్ప కవులయ్యారని అధ్యయనం- పరిశోధనలు- చెయ్యడమే కాదు.ఆయా కవుల చరిత్రలు- కవిత్వాన్ని చదివి పొంగిపోవడమే కాదు- ఆయా కవుల మాదిరిగా మనం కూడా గొప్పగా కవిత్వం రాయాలని సంకల్పించుకోవాలి. అందుకు సాధన నిర్విరామంగా చేయాలి. ముఖ్యంగా కవులు ఆకళింపు చేసుకోవలసింది భాషే కాదు- మనిషి మనో భాష కూడా.

కొందరి కవుల కవిత్వానికి ఒక నిర్మాణం కూడా ఉండదు. సమాజంలోని వారంతా వారి కవిత్వంలో ప్రతీకలే. సమాజంలోని ఆయా అంశాలపై ఆగ్రహ ప్రకటనే వారి కవిత్వం. సమాజంలో పెరిగిపోతున్న అవినీతి, అరాచకంపై కవిత్వ ఆగ్రహం ప్రతి అక్షరంలో వ్యక్తమవుతుంది.

వైయక్తిక అభిరుచులకతీతంగా, వాదాలు, ప్రక్రియలకతీతంగా నిజాయితీతో సానుకూల దృక్పథంలో కవిత్వాన్ని ఆవిష్కరిస్తే మంచిది. అప్పుడు కవిత్వంలో ఒక మెరుపు, ఒక మంచి భావం, భవిష్యత్తులో భద్రకవిత్వం దొరుకుతుందన్న ఆశావహ దృక్పథం ఏర్పడుతుంది.

కవులు కొన్ని వస్తువుల్ని తమ కావ్య ఇతివృత్తంగా మార్చుకునేటప్పుడు- కూర్చుకునేటప్పుడు కొన్ని ఇబ్బందులు ఏర్పడుతుంటాయి. మత విషయాల్ని కవితా వస్తువులుగా గ్రహిస్తున్నప్పుడు మరింత జాగ్రత్త వహించవలసి ఉంటుంది. కొత్త నిబంధనలలో గల అనేక అంశాల్ని చాలా జాగ్రత్తగా అభివర్ణించారు.

చాలా మంది కవులు తెలిసో, తెలియకో చేసే తప్పేమిటంటే- తాము చదివిన అపరిపక్వ- కవిత్వ గ్రంథాలూ కవిత్వ విమర్శలు, పొయిట్రీ టాక్ షో చర్యల్లో కన్న అంశాలు విన్న విషయాలు, కవిత్వ వికాసం పేరిట, బూటకపు వర్క్‌షాపుల ప్రతిపాదిత దబాయింపు ప్రతిపాదనలూ మొదలైన వాటితో, కుహనా భావ మనోవిజ్ఞాన వ్యాసాలు చదివిన అనుభవంతో కవిత్వ స్వరూప స్వభావాల్ని లోతుగా అధ్యయనం చేయకుండా, వితండ వాదాత్మకంగా విశ్లేషిస్తూ ఉంటారు. అది అంత మంచి పనికాదు. అది ఆయా కవుల అజ్ఞానాత్మక విధి విధానానికి ప్రతీకలుగా మిగిలిపోతాయి.

కవిత్వ విషయమై ఎప్పుడు- ఎక్కడ- ఎలా-ఎందుకు అంటూ రంధ్రాన్వేషణ మనం చేయనక్కర్లేదు. ఆయా కవులు ఆత్మ విమర్శ చేసుకుంటే చాలు. కాని చెదలు పడుతున్నప్పుడు చెడిపోతున్నది మన కవిత్వమే అయినప్పుడు చేతులు కట్టుకొని కలం పక్కన పెట్టుకొని, కూర్చుని, మనకెందుకులే అని చూడ్డం మంచిది కాదు. కవిత్వంలో అడ్డమైన పదాల్ని అడ్డదిడ్డగా వాడినంత మాత్రాన అదే గొప్ప కవిత్వంగా చెలామణి అవ్వదు కదా.

కవిత్వ పరమార్థం ఏమిటి అనే విషయమై ప్రతి కవి ఏదో ఒక సమయంలో ఆలోచించక మానడు. కొందరి ఆలోచనలు ఆలోచనలుగానే మిగిలిపోతుంటాయి. పట్టుదల, కృషి, అధ్యయనంతో ఈ ఆలోచనకు ఒక చక్కని రూపం ఇచ్చే విశేష ప్రయత్నం కొద్దిమంది కవులు మాత్రమే చేస్తుంటారు.



-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

## తెలంగాణ జాతిపిత

తెలంగాణ ముద్దుబిడ్డ జయశంకర్ సారు !
తెగువతోను గర్జించిన జయశంకర్ సారు !

తెలంగాణకు చిరునామా
తెలంగాణకు మార్గదర్శి
ఉద్యమానికి పితామహుడు
తెలంగాణ జన జాతిపిత !
"జయశంకర్ సారు"

కార్యదక్షుడవు మేధావి
లక్ష్యసిద్ధికి స్ఫూర్తి ప్రదాత
ఉద్యమ సిద్ధాంతకర్త
ఉదాత్తమైన వ్యక్తిత్వం
"జయశంకర్ సారు"

నీతి నిజాయితికి నిదర్శనం
నిబద్ధతకై నిరాడంబరం
సమయపాలనకు సాక్ష్యం
మేధోశ్రమ ధారపోసిన ధీరుడా !
"జయశంకర్ సారు"

-శ్రీ మొగలిమాల
9949594288

## చిరస్మరణీయుడు

సీసమాలిక:
విద్యార్థి దశయందె వెన్నుజూపనివాడు
ఓరుగల్లున దాను బోరు సలిపె
బ్రహ్మచారిగనుండి బతుకంత వెచ్చించి
తెలగాణ యుద్యమ తీరునడిపె
స్వప్నించె తెలగాణ వైభవంబును దాను
సిద్ధాంతకర్తగా స్థితిని బొందె
కేసియారుకు సారు కేలూత యందించె
రాష్ట్రసాధనమున రందిజెంది
వైసుచాన్సులరుగ వాసిగాంచెను చాల
పలురచనల జేసె ప్రజలు మెచ్చ
ఉద్యమాగ్ని రగిల్చి యురికె జాగృతి జేయ
తెలగాణ బిడ్డడై తెగువ సూపె
జాతిపితగ వెల్గి జనుల గుండెలనిండ
నిల్చియుండెను సారు నిశ్చయముగ
సాటిరారెవ్వరున్ మేటినాయకుడైన
నీదు ప్రతిభముందు నిక్కముగను

ఆ.వె॥ జయము జయము సారు జయశంకరునకంచు
మరువబోము నిన్ను మాన్యచరిత
ఖ్యాతిగాంచి తెలుగు జాతి రత్నంబుగా
వెలుగుచుంటివయ్య విరివి గాను

-నాయని రాములు
9989390434

## ఆచార్య జయశంకర్

మధ్యతరగతిలో పుట్టె
పదవులెన్నో చేపట్టె
ఆచార్య జయశంకర్
కపట నీతిని పసిగట్టె

అహింసే ఆయుధంగా
ఉద్యమమే ఊపిరిగా
ఆచార్య జయశంకర్
నిలిచెను ప్రజల గొంతుగా

అన్యాయాన్ని ఎదిరించె
పరపాలనను దూషించె
ఆచార్య జయశంకర్
తెలంగాణకై తపించె

అందరికీ బోధించె
చైతన్యము రగిలించె
ఆచార్య జయశంకర్
మార్గదర్శిగా నిలిచె

వనరులకై పోరాడెను
దోపిడీని ప్రశ్నించెను
ఆచార్య జయశంకర్
ఆశయాన్ని సాధించెను..



-కందుకూరి భాస్కర్
9703487088

'గాలిని, కాలాన్ని, చైతన్యాన్ని తెలంగాణవైపు మళ్ళించిన జాతి వైతాళికుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్' జయంతి ఆరు ఆగష్టు సందర్భంగా తెలుగు భాషా చైతన్య సమితి సారధులు పి. బడేసాబ్, డా॥ వి.జయప్రకాశ్, డా॥ఎడ్ల కల్లేశ్ సంకలనకర్తలుగా ప్రొ॥ జయశంకర్ స్మారక కవితా సంకలనాన్ని ఈనెల 12 ఆదివారం ఉదయం హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో డా॥నందిని సిధారెడ్డి, డా॥ఏనుగు నరసింహారెడ్డి పలువురు అతిథుల సమక్షంలో ఆవిష్కరించబడుతున్న సందర్భంగా ఈ సంకలనంలోని పలు కవితలను నేటినిజం పాఠకుల కోసం... -సంపాదకులు..




## ఉద్యమకారుడు జయశంకర్

నిజాం పాలననే వ్యతిరేకించిన ధైర్యశాలి
""వందేమాతరం"" పాడి వినిపించిన పరాక్రమశాలి
డిగ్రీ కాలేజీకై ఉద్యమ బాటను పట్టిన విద్యార్థి
ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన
భారతీయ విద్యావేత్త
నిరంతర శోధన సాధన లో మునిగిన పరిశోధకుడు
యూనివర్సిటీ ఉపకులపతిగా ఎదిగిన ఉన్నతుడు
ఆలోచనల్లో గంభీరత మాటల్లో చమత్కారం
తెలంగాణ వాదం వదలనని
ఘంటాపథంగా పలికిన రచయిత
తెలంగాణ రాష్ట్ర పోరాటానికి ఉద్యమించిన సిద్ధాంతకర్త
గల్లీ నుంచి ఢిల్లీ,ఢిల్లీ నుంచి అమెరికా దాకా
ఉద్యమాన్ని నడిపిన ఉద్యమకర్త
ముఖ్యమంత్రి కే.సి.ఆర్ తండ్రి గా భావించే అనుబంధం
సన్నిహితులతో జీవిత విశేషాలను పంచుకునే స్నేహశీలి
ఆస్థిని జీవితాన్ని
పోరాటానికే అంకితం చేసిన
త్యాగమూర్తి.



-యలమర్తి అనూరాధ
9247260206

## జోహార్లు

ఈవేళ తెలంగాణ ప్రజల గుండెలు సయితం
విచారముతో విషాదంతో నిండిపోయినయ్
మానవోత్తములు,మేరునగధీరులు, తెలంగాణ ఆశాజ్యోతి
అకుంఠిత కార్యదీక్షులు,విద్యావేత్త ప్రొఫెసర్ జయశంకర్ సార్
అప్పుడే ప్రపంచాన్ని విడిపోయిండ్రని
తెలిసి బాధను ఎట్లా తట్టుకుంటమ్
నిత్యయవ్వనులు వర్తమానం పదునైన కత్తి
దానిని ఒత్తి చీకటిమొదళ్లను కోసే తెలంగాణ రాష్ట్ర శాసనులు
భూతకాలం నూనెలో తడిపిన వత్తి
దాన్ని మెదిపి తెలంగాణ భవిష్యత్ దీపాన్ని వెలిగించాలన్నవారు
ఈ ప్రపంచాన్ని విడిచిపోవడం
వాడవాడలు సయితం గోడుమంటు విలపిస్తున్నయ్
ఈ గాలులు సయితం శోకంతో పరితపిస్తున్నయ్
ఈ తెలంగాణలో,ఈదేశంలో ఇంత హుందాగా
ఇంత గంభీరంగా తిరిగిన మనీషి
ఈలోకాన్ని వదిలివెళ్లిన వార్త మమ్ములను
బాధల సముద్రంలో ముంచేస్తున్నయ్
విద్యార్థి దశనుండి మొదలయిన మీ ఉద్యమం
పల్లెనుంచి ప్రపంచదేశాలకు సాగిన ప్రస్థానం
అనిర్వచనీయము, అద్వితీయం ,అజరామరం
అయినా మీ మేధోమథనంతో రాసిన గ్రంథాలు
మీరు పాటించిన ఆదర్శాలు,మీరు బోధించిన సూత్రాలు
మా వెంటనే ఉంటయ్ చైతన్యం చేస్తూనే ఉంటయ్
మీ స్ఫూర్తి,సహనం,వాక్చతురత, ఉత్సాహం
మా వెంటే ఉండి మమ్మల్ని వెన్నుతట్టి నడిపిస్తయ్
మీ స్ఫూర్తితో ఉక్కు పిడికిళ్లె బిగుసుకుంటమ్ ఉద్యమంలా శ్రమిస్తమ్
ప్రాంతం దోపిడీదార్లను పాతరేస్తామ్ పారద్రోలుతామ్
మీ ఆశయం నెరవేరుస్తామ్ బంగారు తెలంగాణ సాధించుతామ్
జయశంకర్ సార్ మీకు జోహార్లు జోహార్లు
తెలంగాణ అమరుడా మీకు జోహార్లు జోహార్లు

-డాక్టర్.వాసరవేణి పర్శరాములు
9492193437

## తెలంగాణ జాతిపిత

కం: శ్రీ జయశంకర గురువర
తేజోమయ బుద్ధి శాలి తెలగాణమునన్!
మీ జీవనమే ధన్యము
రాజిల్లును సూర్య తేజ రాజసమొప్పన్!

ఉ: కారణ జన్మనీది జనకాంక్షను దీర్ఘగ నుద్యమించి శ్రీ
కారము జుట్టినావు కలకాలము నిల్చెడి పోరుబాట ఈ
ధారుణి కిచ్చిజీవనపు దారులు జూపిన దివ్యమూర్తి స
ర్కారును తీవ్రమైన నిరకాటము బెట్టిన ధైర్యశాలిగన్!

మ: కలలో నైనను మర్వలేరు విలువల్ కర్తవ్యముప్పొంగగా
బలిదానమ్మును జేసినారు బ్రతుకున్ భాగ్యమ్ము మానేలకున్
తిలకమ్మైతిరి పోరుబాటకు సదా ధీరత్వమద్దంగ మా
తెలగాణమ్మున మీకుసాటి గురువుల్ తేజమ్మునన్ లేరుగా!

సీ: తెలగాణ సిద్ధాంత ధీశాలి గురువర్య
జయశంకరాచార్య జాతిపితవు
జాతి హితము గోరి జనజాగృతిని జేసి
తెలగాణ దెచ్చిన ధీరవర్య
చిరునవ్వు మోమున చిందించు వాడవు
పరుషమ్ము మాటలు పలుక వెపుడు
పోరుబిడ్డగ నీవు ఓరుగల్లందున
జన్మంబు నెత్తావు జనము కొరకు

తే.గీ:నిధులు నుద్యోగ నియమాలు నీళ్ళకొరకు
పోరు సల్పిన తెలగాణ పుణ్యచరిత
యరువదేళ్ళుగ జేసిన పోరు మనది
మరువ బోదయ్య మీత్యాగ మంత్రమెపుడు



- డా.మహ్మద్ షరీఫ్
9866560527

## తెలంగాణ సిద్ధాంత కర్త

తను వరంగల్లు వాసులు
లక్ష్మీకాంత్ రావు సుతులు
అక్కం పేటలో పుట్టెను
మహాలక్ష్మి ప్రియ పుత్రులు

తను ఓ విశ్వ బ్రాహ్మణుడు
తను జయశంకర్ నాముడు
ఇంటి పేరు కొత్త పల్లి
అర్థశాస్త్రం చదివాడు

ఆ జన్మ బ్రహ్మ చారుడు
తను ఉత్తమ అధ్యాపకుడు
ఆదర్శ గురువు ఆతను
విప్లవాన సూరీడే

ఉద్యమాలే నడిపినాడు
విప్లవాగ్ని రగిల్చాడు
ఉద్యమ రథ సారథి
తెలంగాణ పితామహుడు

తెలంగాణ తన లక్ష్యము
తెలంగాణ తన గమ్యము
క్యాన్సరుతో మరణించె
తన కీర్తి అజరామరము!

-ఆరెకటికె. నాగేశ్వరరావు
9492612699

## తెలంగాణ వైతాళికుడు

జయశంకర్ జీవితము
ఉద్యమ ప్రతిబింబము
ఆయన సాగించెను
తెలంగాణ ఉద్యమము

ఉద్యమాల్లో పాల్గొనెను
ధర్మమార్గాన నడిచెను
తెలంగాణ కోసమే
నిరంతరం పోరాడెను

ఆలోచనలో బుద్ధుడు
ఆవేశంలో రుద్రుడు
స్థిత ప్రజ్ఞ కలిగినట్టి
రాష్ట్ర సిద్ధాంత కర్తడు

ఆంధ్ర పెత్తనం వద్దని
విశాలాంధ్ర ఒక ఎత్తని
ఫజల్ అలీ కమిషన్ ను
వ్యతి రేకించిన జ్ఞాని

తెలంగాణ పితామహుడు
తెలంగాణ వైతాళికుడు
అజన్మ బ్రహ్మచారై తన
జావితాన్ని అంకితం చేసిండు



-శీలోజు శోభన్ బాబు
9676858160

## తెలంగాణ ఉద్యమకర్త

తెలంగాణ ఉద్యమకర్త
చీకటి కమ్మిన కాలాన్ని చీల్చుకుంటూ
దేశపుఅంచుమీద కవాతుచేసినవాడు
తెలంగాణ పితామహుడు జయశంకర్

దిక్కరిస్తూనే రాజకీయపు అరాచకాలపై
కాండ్రించి ఉమ్మిన ప్రశ్నల బాణం
ప్రశ్నించే ఉద్యమనేత మనజయశంకర్

పోరాట పౌరుషాన్ని పిడికిల్లో బిగించి
రాష్ట్రాసాధనకై రక్తాన్ని ధారపోసినవాడు
పోరాటానికి అసలైన వారసత్వంజయశంకర్.

విసిరేఖడ్గమై వ్యవస్థను ఖండిస్తూనే
తెలంగాణ అవతరణకై అవతరించినవాడు
మరణంలేనిఅమరుడు మనజయశంకర్

వందలాది అమరవీరులు సమిధలై
అరవైఏళ్ల ప్రాణత్యాగాలఫలితం తెలంగాణ
తెలంగాణపుట్టుక కారకుడుజయశంకర్



-పోలె వెంకటయ్య
9951914867

## నీ ఉద్యమబాటలో పయనిస్తాం!

మా వనరులపై మాకే అధికారం కావాలని,
పట్టుబట్టి ఉద్యమించిన విప్లవ సూరీడా!
తెలంగాణా సాధించాలని కలలు కని,
రణ నినాదాన్ని వినిపించిన ఓ పోరాట శీలీ!
విశాలాంధ్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించిన,
తెలంగాణా సిద్ధాంతకర్తా! ఓ కొత్తపల్లీ!
ఆజన్మ బ్రహ్మచారివై త్యాగజీవి వయ్యావు,
ఆర్థిక శాస్త్రంలో పి.హెచ్ డి పట్టానే పొంది,
ప్రిన్సిపాల్ గా, రిజిస్ట్రార్ గా చివరికి,
వైస్ చాన్సలర్ గా కూడా పదవులనధిష్టించితివి,
నాన్ ముల్కీ ఉద్యమంలో పరిగెత్తి పాల్గొని నీవు,
ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ అంటూ ఉద్యమించితివి,
తెరాస నిర్మాణంలో కేసీఆర్ కు మార్గదర్శి గా,
మంచి సలహాదారుడి గా వెన్నంటి నిలచితివి,
అధ్యాపకుడిగా ఎంతో మంది యువకులకు,
మార్గనిర్దేశనం చేసిన ఓ జయశంకర్ సార్!
గల్లీ నుండి ఢిల్లీ దాకా ఉద్యమ వ్యాప్తి చేసి,
ఢిల్లీ నుండి అగ్రరాజ్యం వరకు ప్రచారంమే చేసితివి,
ఇతరుల పాలనలో యాచించిన మనము,
స్వయం పాలన లో శాసిస్తామని నినదించిన,
ఓ కొత్తపల్లి జయశంకర్ సార్!
నీ కలల బంగారు తెలంగాణా రాకముందే,
వీరత్వం పొంది అమరుడివి అయ్యావా!
నీ ఆశయాలు కొనసాగిస్తాం!
నీ ఉద్యమబాటలో మేం పయనిస్తాం!!

-చింతపట్ల.
వెంకటరమణాచారి మౌనయోగి,
9493331195

## బ్రహ్మచారి - తెలంగాణ సూత్రధారి

కొత్తపల్లి జయశంకర్ తన నామధేయం
తెలంగాణ గడ్డపై తానస్తమించని సూర్యబింబం
అక్కంపేటన విశ్వబ్రాహ్మణ జాతిలో జననం
అత్యున్నత విశ్వవిద్యాలయాల్లో విద్యాభ్యాసం.

ఉద్యమానికది అడ్డని చేపట్టలేదు సంసారం
పాటించె తాను కడవరకు కఠోర బ్రహ్మచర్యం
ఉద్యమ స్ఫూర్తికి అది తన అంకితభావం
తెలంగాణ సిద్ధాంతకర్తగ తన పేరు సుస్థిరం.

విద్యార్థి దశనుండే ఉద్యమం వైపు పయనం
నాన్ ముల్కీ ఉద్యమంతో చుట్టె దానికి శ్రీకారం
తెలంగాణ వచ్చాకనే నా మరణమన్న నినాదం
చెబుతుంది తెలంగాణపై తనకున్నవీరాభిమానం.

అధ్యాపకునిగ ఉద్యోగ అరంగ్రేటం
చిత్తశుద్ధితో చేసెను విద్యాదానం
వారిలో ఉద్యమస్ఫూర్తి నింపిన ఆదర్శం
విద్యార్థుల పేర్లు తనకు కంఠోపాఠం

స్ఫూర్తి నింపెను ప్రవాసీయులకు సైతం
రాష్ట్రానికే అంకిత తన జీవితం, ఐశ్వర్యం
ప్రసంగాలలో ఉద్యమ గళమెత్తిన వీర కిశోరం
యాచక టు శాసక అన్న తన ఉద్యమ నినాదం

బంగారు తెలంగాణకై పోరాడిన యోధుడు
ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని గెలిచిన వీరుడు
రాష్ట్రాన్నిగని తృప్తిగ అస్తమించిన సూర్యుడు
తెలంగాణ రాష్ట్ర చరితలో చిరస్మరణీయుడు

-జె వి కుమార్ చేపూరి,9640712062

## యుగ పురుషుడు

కొత్తపల్లి వంశతిలకుడు
తెలంగాణ మట్టిబిడ్డడు
సరస్వతి సాధకుడు
తెలంగాణ అణువణువులో
ఇమిడిపోయిన ఆత్మబంధువుడు
వలసపాలకుల దుష్టచర్యలకు
గుండెకన్నీరై కుమిలిపోయిండు
తన జాతి నరకయాతనను చూసి,
బుజబుజలాడే నిరుద్యోగ
దట్యాన్ని పరికించి
పంటలెండే భూముల ఘోషను,
గొంతులారిన జీవశ్చవాల దీనవేదనలను
వేదాలుగా పఠించి
మేధస్సును మరిగించి
ఆంధ్రోళ్ళపై ఆకాశమై లేచిండు.
తెలంగాణ విముక్తి
నాపెల్లి ప్రసక్తి
అని ప్రతిజ్ఞ బూనిండు.
తెలంగాణ భీష్ముడై అవతరించిండు.
ఉద్యమాలకు పురుడుపోసిండు
తెలంగాణాను ఏకంచేసిండు.
పెన్నోడికి పెన్నును
గుతపోనికి గుతపను
మాటోడికి మాటను
పాటోడికి పాటను
అప్పగించి
సమస్త రంగాల
జనయాత్రను చేపట్టిండు
వలసపాలకులపై
అఖండ దండయాత్రతో
స్వాతంత్ర్య తెలంగాణాను
దేశ చరిత్రలో నిలిపిండు.
పసిపాప తెలంగాణాను
పురిటిలోనే వదిలేసి
ఆగమేఘాల మీద
అనంత లోకాలకు
పయనమై వెళ్ళినీడు.
జయశంకరుడు......
జన్మ జన్మ తెలంగాణాకు
కన్నతండ్రి అయ్యిండు.

-డాక్టర్.కందుల శ్రీను
9652674834

## అక్షర నీరాజనం

ఓరుగల్లుకే తలమాణికం మహాలక్ష్మి కాంతా రావుల పుత్రరత్నం
దశాబ్దాల పీడనపై సమరశంఖం ఊది
దగాపడిన జనావళిని జాగృత పరిచి
అక్షరాలే శరాలుగా విద్యార్థులే సైనికులుగా
ఆశయాల సాధనకై అలుపెరగని యోధుడు
గుండె గుండె నీవే ప్రతి నోట నీ మాటే
దివ్వెలా దిక్సూచిలా పోరుబాటకు దారి చూపే
దశాబ్దాలు పోరాడుతూ ధైర్యంగా సాగినావు
ఉద్యమానికి ఊపి రూది యువతను చైతన్య పరిచినావు
అణువు అణువున స్ఫూర్తినింపి తనువునే అర్పించినావు
ఉద్యమాల ముద్దుబిడ్డ మరువదు తెలంగాణ గడ్డ
తెలంగాణ పీతా మహుడు సామాజిక శాస్త్రవేత్త
క్రాంతి దర్శి మార్గదర్శి మహా మనిషి
సీమాంధ్రుల దారుణాలు దద్దరిల్లి విప్పి చెప్పి
అవిశ్రాంత పోరాటం ఆచార్యుని ఆరాటం
అష్ట వక్రుల అడుగుల్లోను ఆశారేఖలు దర్శించి
కుట్రదారుల పడగ నీడల్లోంచి తెలంగాణ ప్రజల స్వేచ్ఛకై
విక్రమించిన స్వా ప్నికుడు స్ఫూర్తి దాత
అక్కంపేట అజేయశక్తి ముల్కీని దుద ముట్టించాడు
ధర్మాన్ని వెలుగెత్తి చాటాడు తెలంగాణ బ్రహ్మ
రేపటి చరిత్రకు ప్రతీకై నీలో జయం
నీవే ఆదర్శం నీ స్వప్నం సమరం గమనం గమ్యం తెల0గాణ

-డా. నన్నపు రాజు విజయ
91 00439 88 4

## జయ జయ శంకర! ఉద్యమ భాస్కర!

కం. నదుల జలంబుల పంపక
మదియే ప్రత్యేక రాష్ట్ర మను కాంక్ష ను దా
మదిలో రాజేయన్, జన
పదముల జైతన్య పర చె బటు తర లీలన్

కం. అందరు నైజామ్ ప్రభువును
సందడి బ్రార్థనను సలుప, సైపక బడిలో
వందే మాతర గీతము
నందుకొనెన్ బాల శంక రాఖ్యుడు గరిమన్

జననం బక్కంపేటను
ఘనమగు నా యర్థ శాస్త్ర గా ధ త జిలికెన్
తనశోధన ను స్మా నియ
దనరెను కులపతి గ మిగుల దన దౌ శైలిన్

కం. నిరసన దెలిపెను యింటరు
తరగతిలో, రాష్ట్రములను
మరి విభజన సేయంగను
కరదీపిక య గుచు "ముల్కి" కార్యాచరణన్

జయ శంకరుడుద్యమమును
స్వయముగ వ్యాపింప జేసె జనముల లోనన్
నయమగు పరిశోధనలన్
భయరహితంబైన విపుల పథమును జూపెన్

"ఆటా" ఆహ్వానము నన్
చాటెను పది నగరములను జయశంకరుడే
నాటెను "యమెరిక" గడ్డను
దీటుగ సిద్ధాంత బీజ దీప్తుల నెలమిన్

ఎట్టికి మట్టికి సైతము
గట్టిగ మనవాడె తగును కార్యము దీర్చన్
అట్టి దె యుద్యమ స్ఫూ ర్తిగ
పట్టెను జయ శంకరుండు ప్రస్థానగతిన్.

-పాణ్యం దత్త శర్మ.
9550214912

## మాస్టర్

ఆచార్య జయశంకర్ ఒక చరితగన్న సిద్ధాంతకర్త
తెలంగాణా భావజాల వ్యాప్తికై శ్రమించిన కార్యకర్త
మాస్టరై, ప్రొఫెసరై ఉత్తమ రీతిన బోధించీ
సూత్రీకరణ గావించే తన మేథస్సే
దార్శనికతయై నిలిచింది
స్వరాష్ట్ర ఉద్యమమందు తాను ముందుండి
ప్రజా వికాసమే ధ్యేయంగా జీవించిరి
వరంగల్ అక్కంపేటన ఉద్భవించెనీ ఉప్పెన
నాన్ ముల్కీ ఉద్యమనేత కాగల్గెను
పద్దెనిమిదేండ్ల ప్రాయాన
జయశంకర్ భాష్యం కదిలే సైన్యం
జయశంకర్ పోరాటం
ఎందరికో మార్గదర్శకం
తన ఆలోచనా విధానమే ఒక దిశానిర్దేశికం
జనుల హృదయాల్లో వెలుగొందుతూనే యుంటారు
ఉద్యమజ్యోతియై, నిత్యసత్యమై.

-కుదమ తిరుమలరావు
9505665748

## సద్యోజాతకుడు

శ్రీ సర్వస్వ సుపర్వ సంశోభిత సేవా విలసన్నవ
శ్రీ విభవ తెలంగాణా మహాసామ్రాజ్యైక
సాధనాశయ సేవాప్రేమి..
ఆర్షధర్మాశయ సువాసనాశ్రయ నాటి కాలపు
జనారణ్యంవాసాన నెలకొన్న విభవోన్నత శ్రేయస్కామి..
కొత్తపల్లి వంశపు అర్చకస్వామి ..
పోతపోసిన సల్లక్షణాల పోహళింపుల ప్రోవు..
అకుంఠిత దీక్షా దక్షతల సిద్ధాంతోద్యమ సాంప్రదాయ ధార్మిక శాఖా తావు..
ఆయనో వర్తమాన స్ఫూర్తి ప్రదానపథ పురోగామి..
ప్రవర్ధమాన కిసలయాదర్శ జీవనుల కరదీపికాగ్రగామి!
భారతీయ సంస్కృతీ సద్యోజాతకునిగా..
నవీన సామాజిక ప్రగత్యైక సాంప్రదాయ విద్యావేత్తగా
అందరికీ సుపరిచితులైన ఆధునిక ధీంద్రియోత్తేజతేజం..
నైష్ఠిక శస్త్రాస్త్ర జాలోష్మస్ఫార జాహ్నవీ వరిన్నిధి..
సచ్ఛిలనా చింతనల సుధావార్నిధి!
జయశంకర్ అంటే–
క్షణక్షణ క్రమశిక్షణాయుత సత్సంప్రదాయ సశ్యక్షేత్రం..
వారొక నిర్విరామ దేదీప్యమాన నీతిహోత్రం..
శారదవీణాక్వణన్నినాదోత్తుంగ తరంగ ధైర్యం..
కొత్తపల్లిగారి జీవితం అహర్నిశలూ ""యాచక దశ నుంచి శాసక దశ""
దిశగా తెలంగాణ రాష్ట్రావిష్కరణకు సమర్పించిన అర్ఘ్యం!
ఒడిదుడుకై దుడుకెరుగని నిదాన ప్రదాన పథగమనాలముందడుగై..
ఆంధ్ర రాష్ట్రీయతా దర్శ ప్రియంభావకుల..
ఆదర్శాల సుసేవా నిర్వహణా పద్ధతుల,ఉద్ధతుల ప్రచోదనాల..
రాష్ట్ర పునర్వైభవ కర్తృత్వానికి అంకురార్పణ చేసిన నిష్కల్మష కర్మయోగి..
కీర్తి కాంక్షలపట్ల యదార్థ విరాగి!
సాయుధ్య ప్రశస్త స్థిత నవీన ధీంద్రియోత్తేజ తేజోమూర్తి గా..
స్వాతంత్ర్య సమర యోధునిగా ..
రమ్యా! సంస్కృతీ గమ్యా! కామ్యా! విజ్ఞానమాన్యా!గణ్యాగణ్య...
శ్వాసగా సాగు సనాతన ఆధ్యాత్మిక విన్యాసముక్తాఫలమ్ముల పోటెత్తిన భావనాప్రముదితాంభోరాశి!
సుశిక్షితార్చక నిర్నిమేష పర్యవేక్షణానుబంధ సంధానంతో..
నిరతమూ ""అంజలి"" ఘటించే స్థిరభంగిమ తప్ప
విశ్రమగతికి పొరపాటునైనా రాని
విశాల విశ్వహిందువు–ఆర్తజనబంధువు!

-పిళ్ళా వెంకట రమణమూర్తి, 9701885764

## జయశంకర జోహార్

ఉద్యమమే ఊపిరిగా
ఆశయ సాధనే ఆయువుగా
ఆరు దశాబ్దాల అలుపెరుగని పోరు
అనువణువున ఉద్యమ హోరు
అవరోధాలెన్నొచ్చిన అదరని జోరు
బెదిరింపులకు బెదరని సారు
తాయిలాలకు లొంగని పేరు
జయశంకర నీకు జోహారు....
తెలంగాణ అవసరాన్ని జనానికి చాటిన
మహోన్నత ఉద్యమ శిఖరం
అలుపెరుగని పోరు కెరటం
అహరహము రగిలిన అగ్నికణం
ప్రలోభాలు వెల్లువెత్తిన ప్రభ తగ్గని
రవికిరణం
తెలంగాణ ఉద్యమ సారథి
తొలి మలి ఉద్యమాల వారధి
జగం మెచ్చిన జనహృదయ నేత
తెలంగాణ జాతిపిత
జయశంకర నీకు జోహారు

-సురేందర్ చట్ల
8985414948

## అస్తిత్వకేతనం

త్యాగాల పోరుగడ్డపై
అస్తిత్వం కేతనమై ఎగిరింది
నిర్బంధం, నిరంకుశత్వం
మోసంతో స్వేచ్ఛను బంధిస్తే
కపట బుద్ధుల దురాలోచనను
కొదమసింహం చిన్ననాడే ప్రశ్నించింది
విషం చిమ్మే మనుషులు
పెదాలపై నవ్వును అతికించుకొని వస్తే
వలస పాలన కుతంత్రంపై
ఉడుకు రక్తం ఉప్పెనైంది
విశాలాంధ్ర ముసుగులో
ఇడ్లీసాంబార్ల రుచిజూపి
నాన్ ముల్కీలు మన గట్కదోస్తుంటే
సహించని చైతన్యం తిరగబడింది
బలిదానాలను తలుచుకొన్నప్పుడల్లా
ఆ గుండెపొరల్లోంచి రక్తం
ఆరిపోని ఆశయమై ఎగసింది
దశాబ్దాల నివురుగప్పిన చరితను
యాది మరువకుండా
తరతరాల తలరాతలకు రాసిన
నిప్పులకొలిమి, నిత్యం మండింది
రాలిపోయేవరకు రాజీపడని వ్యక్తిత్వం
అలుపెరుగని పోరు లో
ఆత్మగౌరవాన్ని శ్వాసించింది.

-డా. చింతల రాకేశ్ భవాని ,
9246607551

## సదా స్మరణీయుడు

ఆయన సదా స్మరణీయుడు
తెలంగాణ జాతికి పితృసమానుడు

నాటి ఆంధ్ర పాలకుల దురంతాలు
తెలంగాణ ప్రాంతంపై ఆగడాలు
నీళ్లు నిధులు ఉపాధులలో దోపిడీలు
భాషా సంస్కృతులపై ఉక్కు పాదపు నీడలు
ఎదురునిలిచి ఎండగట్టిన యోధుడు. /ఆయన/

తెలంగాణ విలీనాన్ని వ్యతిరేకించిన ధైర్యశాలి
"సాంబార్ ఇడ్లీ బ్యాక్" ఉద్యమ కార్యశీలి
విశాలాంధ్ర ప్రతిపాదనను ఢీకొన్న ధీశాలి
యాచనకన్నా స్వేచ్ఛ పాలన ముఖ్యమన్న అభ్యుదయ శీలి
బ్రహ్మచారిగా నిలిచి బ్రతుకు బాట నేర్పిన /ఆయన/

తెలంగాణ భావజాలాన్ని విస్తృత పరచిన కార్యకర్త
తెలంగాణ సంస్కృతికై పోరాడిన సంఘ సంస్కర్త
ఆంధ్రుల అహంకారంపై హుం కరించిన మహానేత
తెలంగాణ ఉద్యమానికి ముగ్గు పోసిన జననేత
జగమంతా కుటుంబం నాదనీ నినదించిన. /ఆయన/

తెలంగాణ తల్లికి రాచపుండు ఆంధ్రుల పాలన
శస్త్రచికిత్సతో తొలగించాలని ఆయన తపన
చంద్రుని ఆయుధంగా మలచిన రాజకీయ నీతి
చరమగీతం పాడింది ఆంధ్రుల అవినీతి రీతి
స్నేహశీలి ఆత్మీయ బంధువు సమాజానికే గురువు./ఆయన/



-డా.వైరాగ్యం ప్రభాకర్
9014559059

## జయశంకరుడు

జయశంకరుడుతాను సలిపెను నిరతము
తెలగాణకొరకును తెగనిపోరు
సలిపినయట్టియు సజ్జనమిత్రుండు
ఇడ్లిసాంబరువారు యిటవలదని
చాటిచెప్పినయట్టి సమరశీలియతడు
జగతిననిలచిన జనులమనిషి
జాతిపితగనిల్చి జాగృతపరిచియు
రాష్ట్రసాధనకయ్యి రణముసలిపె
ఉర్దు,ఆంగ్లము,పార్శి,హింది భాషలయందు
ప్రతిభను సాధించె పట్టుబట్టి
రచనలెన్నొసలిపి రాటుదేలియు తాను
ఉద్యమంబునదూకె నుడుకుతోన

ఆ.వె.
రాష్ట్రసాధనకును రమ్యముగనితడు
పథకరచనజేసె పాటిగాను
జాగృతమునుజేసి జనములనెదయందు
నిలచియుండెతాను నిండుగాను.

-అయ్యవారు మురళి
9491534075

## జయహో జయశంకర

కాకతీయ స్వాభిమాన వారసత్వ కేతనం
తెలంగాణ సైద్ధాంతిక నిబద్ధతా కర్తృత్వం
పక్షపాత పరిపాలన ప్రతిఘటనా పాటవం
ఉద్యమ పథ నిర్దేశిత ఆచార్య సారథ్యం
జనగణ తెలంగాణ రణ కంఠారావం
అధర్మ ప్రతిబంధక ఆర్థిక శాస్త్రాస్త్రం
ఆడంబర పథరహిత జీవిత చరితం
జనసేవాంకితభరిత బ్రహ్మచర్య జీవితం
ఆఖరు శ్వాసదాక అలుపెరుగని ప్రేరణం
స్వప్న సాకార శిఖరి స్పర్శించని కిరణం
తెలంగాణ జన హృదయారాధ్య దేదీప్యం
జయ జయ జయ జయశంకర
జయ జయహే జయశంకర
జయశంకర జయశంకర
జయజయహో జయశంకర

- మనోహర్ రెడ్డి గంటా
9949992964

## మరణం లేని మేరునగ ధీరుడు

తానే తెలంగాణ
తెలంగాణే తాను
బతుకే తెలంగాణ
గతికే వరకు అలసటెరుగని
మాటల ఫిరంగిల పోరు
అణువణువున తెలంగాణను నింపుకొని
తపించి శ్రమించి
ప్రత్యేక రాష్ట్రం కోసం కలలు కని
కానకుండా కనులు మూసిన మహనీయుడు!!
ముల్కీగో బ్యాక్ ఇడ్లీ సాంబారు,
తెలంగాణ తొలి మలి ఉద్యమాలలో
అన్నీ తానై అన్నింటా తానై
ముందు నిలిచిన పోరాట యోధుడు!!
ఉవ్వెత్తిన యెగిసిన చైతన్య కెరటం
తెలంగాణ చరితను లిఖించి
దశదిశలా చాటిన ధీశాలి
అధ్యాపక వృత్తి మొదలు
ఉపకులపతి వరకు ఎదిగి
వున్నతలక్ష్యంతో ముందుకు సాగి
ఉత్సాహ విత్తనాలు చల్లి
ఉద్రేక మొలకలు యెదలో నాటి
విద్యార్థుల తీర్చిదిద్ది
తెలంగాణ జాగృతికై
పరతపించి ఆచరించి చూపిన ఆచార్యుడు
ఆజన్మ బ్రహ్మచారి
అందరికీ ఆదర్శం!!
తెలంగాణ రాష్ట్ర సమితికి
రూపాన్నిచ్చిన సిద్ధాంత కర్త
గులాబీ రంగునద్దిన చిత్ర శిల్పి
తెలంగాణ తనువు
తెలంగాణ తరువు
మరణం లేని మేరువు
భూపాల్ పల్లి వీరుడు
కొత్తపల్లి జయశంకరుడు!!

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383



## జయశంకర్ సార్ కు జోహార్ జోహార్

పరిస్థితులకు కొట్టుమిట్టాడుతు ,
పడి లేచిన కెరటం...లా
ఉద్యమాలతో ఉగ్రకాంతులై
హక్కుల కొరకు న్యాయపోరాటం సల్పి
జీవితమంతా, చివరి శ్వాస వరకు
నమ్మిన సిద్ధాంతం, ఆశయం నెరవేరాలని
తూటాలకు బలై అమరులవుతారు
చరిత్ర కేక్కుతారు
తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమపోరాట సిద్ధాంతకర్త,
ఆజన్మ బ్రహ్మచారి విశ్వబ్రాహ్మణ కులభూషణుడు
సరస్వతీ పుత్రులు
ఉస్మానియా విశ్వ విద్యాలంలో డాక్టరేట్ పొంది
కె యూ కాలేజీ లో ప్రిన్సిపల్ అయి
విద్యార్థులు .. ఎందరో దేశభక్తి
నాయకులకు గురువులై ,
ఆనాటి నైజాము పాలన దౌర్జన్యాలను ఎదిరించి,
ముల్కీ ఉద్యమంలో పాల్గొని
ఆదరనియులు మన ముఖ్యమంత్రి
చంద్రశేఖర్ కు మార్గదర్శకులయి,
దేశ విదేశాల్లో
తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సంస్థలు
నెలకొల్పిన వారు
ఉద్యమ గ్రంథాల రచనలతో
విప్లవం సృష్టించిన ఘనుడు
మనవాడు మన తెలుగువాడు
తెలంగాణ విజయ పతాకం
కొద్ది నెలల్లో ఎగరవేసే రోజుల్లోనే ...
అందని లోకాలకు వెళ్లి చరిత్రలో నిలిచి
తెలుగువారు అందరి
హృదయాలలోనిలిచిన గురుదేవ



-యెల్డి సుదర్శన్ పద్మశాలి
09892411067

## జయహో జయశంకర్ సర్

సీసమాలిక :
ఆచార్య జయశంకరనిశంబు తెలగాణ
రాష్ట్రసాధనకు తా రణము జేసె
సిద్ధాంత కర్తయై స్థిరముగా పోరాడె
తన కుటుంబము యన్న తపన లేక
ఎనలేని ధీశాలి ఏబది నాల్గులో
జన సమస్యలు దెల్పి జయము గోరె
తెలగాణ వాణివిశాలాంధ్రలో ప్రతి
పాదన వినిపించె ప్రతిభశాలి
అభయుడై తెలగాణ యావశ్యకత దెల్పి
మన పితామహుడునై మాన్యుదయ్యె
ప్రజల కంకితమయ్యి ప్రతిరోజు రచనలు
సలిపి పోరాటమున్ సాగదీసె
ఆయువు పట్టుగా నందరి హృదయాల
విప్లవాచార్యుడై విధులు దెలిపె
సాంబారు యిడ్లీల గోబ్యాకు నుద్యమా
లందు పోరాడె తానాశ జెంది.

తే. గీ.
అట్టి జయశంకరా చార్య నభినుతింతు
యువకు లీతీరు నడవాలి యుక్తి గలిగి
జలములుద్యోగములు పొందు బలము గలిగి
దాసదాసుడు రఘురామ దాసు పలికె.

-కర్నాటి రఘురాములు గౌడ్
6281519576

## ఉద్యమాల ఊపిరి జయశంకరుడు

మహాలక్ష్మి లక్ష్మీ కాంత్ గారల గారాలపట్టి అతడు
ఆత్మకూరులోని అక్కంపేట కే వన్నె తెచ్చిన ఆణి ముత్యమతడు
నాలుగుభాషల్లో ప్రావీణ్యం సాధించిన ప్రొఫెసర తడు
శిష్యుల పేర్లతో పిలిచి అనుబంధం కలుపుకున్న ఆదర్శ గురువతడు
ఉన్నత పదవులేన్నింటికో వన్నెతెచ్చిన ప్రజ్ఞాశీలి అతడు
సభల్లో సమావేశాల్లో రణనినాదాన్ని చేసి ఉద్యమకారుడతడు
అమరజీవుల జాబితాలో చేరలేదని వేదనపడిన
నిఖార్సయిన కార్యశీలతడు
తల్లడిల్లుతున్న తెలంగాణా కు వెన్నుదన్నై
ఉద్యమాన్ని వేడెక్కించిన సైనికుడతడు
తెలంగాణా ఉద్యమానికే జీవితం అంకితం చేసిన
ఆజన్మ బ్రహ్మచారతడు
ఉద్యమాలెన్నింటికో ఊపిరిపోసిన పోరాట యోధుడతడు
ప్రత్యేక తెలంగాణాకై అక్షరసమరం చేసిన కళాకారుడతడు
అధ్యాపకుడిగా పరిశోధకుడిగా మన్ననలందిన విద్యావేత్త అతడు
తెలంగాణా సిద్ధాంత కర్త గా తెలంగాణా పితామహుడిగా పేరొంది
ప్రత్యేక తెలంగాణా కై కలవరించి పలవరించి
నింగికేల్లి దేవతల ఒప్పించి మెప్పించి
అమరుడై తెలంగాణా తెచ్చిన ధ్రువతారతడు
ఆ అతడు మరెవరో కాదు
ప్రత్యేక తెలంగాణా సాధనే ఆఖరికోరికన్న జయశంకరుడు
తెలంగాణా ఉద్యమానికి ఊపిరి
ఎంతెత్తు ఎదిగినా ఒదిగి ఉండే నిగర్వి
నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమైన నిరాడంబరుడు
చిరునవ్వుకు చిరునామా
ప్రతిభకు మారుపేరైన ప్రతిభా శీలి
తెలంగాణా జనుల మనసు దోచిన మారాజు
ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకరుడు

-నామని సుజనాదేవి
7799305575

(3వ పేజీ తరువాయి..)

## సార్ యాదిలో

యాది మరువని సార్
మన జయశంకర్ సార్..
తెలుగు సంస్కృతికి మకుటాయమైన
ఓరుగల్లులో ఊపిరి పోసుకుంటివి
ఉన్నత ఆశయంతో విద్యనుగరిపి
బంధాలు బంధితుణ్ణి చేస్తాయని
ఆజన్మబ్రహ్మచారిగా
స్వరాష్ట్రసాధనమే లక్ష్యంగా
పోరుబాట పడితివి
నాన్ముల్కీ ఉద్యమంతో మొదలిడి
తెలంగాణ భావజాల బీజాలునాటి
బలమైన ముద్ర వేసావు జనంలో
మలిదశ ఉద్యమ మార్గదర్శివై నడిపించావు
ప్రజావాహినిని
సిద్ధాంతకర్తవు,పితామహుడివి..
నిబద్ధత, చిత్తశుద్ధిని గూర్చి
తెలిపిన గురువువు నీవే...
వక్రీకరణలు-వాస్తవాల వివరణలను
కలంలో,గళంలో వివరిం చావు
ఉద్యమమే వూపిరిగా నీబలమే తెలంగాణమని
ఆత్మగౌరవపోరాటానికి పునాది వేసావు
తెలంగాణ సౌధానికి కృషి సల్పావు
నీళ్లు,నిధులు,నియామకాల
వ్యత్యాసాన్ని ఎత్తిచూపి,
యాచకదశ నుండి శాసకదశకు
రావాలి తెలంగాణాఅని పరితపించిన
ఓ ఉద్యమ జ్యోతి...నీవే మాకు స్ఫూర్తి...
ఏకతాటిపై ప్రజావాణిని నడిపి
ఆవిర్భవించిన తెలంగాణాకు
కర్త,కర్మ,క్రియవు నీవే..
తెలంగాణ సాధన కల సాకారం కాకుండా
శాశ్వతశ్రాంతిని పొందావు...
కాని.....
మా ప్రజల గుండెల్లో యాది మరువని సార్
జయశంకర్ సార్...



-డా.శ్రీభాష్యంఅనూరాధ,
8790325502

## తెలంగాణ జాతిపిత జయశంకర్

నమ్మిన సిద్ధాంతం!
జయశంకర్ పంతం!!

తెలాంగానే ఆశ!
తెలాంగానే శ్వాస!!

విశాలాంధ్ర వ్యతిరేకుడు!
తెలంగాణ ఆకాంక్షకుడు!!

రాష్ట్రవిభజన రూపకర్త!
తెలంగాణా సిద్ధాంతకర్త!!

జయశంకర్ విద్యావేత్త!
తెలంగాణ జాతిపిత!!

కెసిఆర్ తో కలిశాడు!
తండ్రి కొడుకుల్లా మెదిలాడు!!

నీళ్ళునిధులు నియామకాలు!
జయశంకర్ ఆశయాలు!!

అందరినీ ఏకంజేసే!
రాష్ట్రమంతా జాగృతంచేసే!!

తెలంగాణాకు కృషిచేయాలనే!
అందరూ ఫలాలుపొందాలనే!

ప్రణాళికలు వేశాడు!
ప్రాంతాలన్నీ తిరిగాడు!!

ఆంధ్రులను కలిశాడు!
సభలలో మెప్పించాడు!!

మేధావులకు వివరించాడు!
జేఏసిని ఏర్పాటుచేశాడు!!

మీటింగులెన్నో పెట్టాడు!
యువతరం వెన్నుతట్టాడు!!

గల్లీ సభలకు వెళ్ళాడు!
ఢిల్లీ సభలకు వెళ్ళాడు!!

అవమానించినా సహించాడు!
అదిరించినా బెదరకున్నాడు!!

తెలంగాణ సాధించాడు!
దిగ్విజయం గావించాడు!!

చూడకున్నా తెలంగాణా!
నిలిచాడు ప్రతిహృదయాన!!

నిధుల జాడలేకుండే!
ధరలు పెరిగిపోతుండే!!

నియామకాలు లేవు!
ఉద్యోగాలు లేవు!!

కుటుంభ పాలనాయే!
అభివృద్ధి తగ్గిపోయే!!

అప్పులు పెరిగిపోయే!
అవినీతి పెరిగి పోయే!!

ఆశయాలు తగ్గిపోయే!
అలసట పెరిగి పోయే!!

కదలాలి నేటి తరం!
వదిలించాలి జాడ్యం!!

-మార్గం కృష్ణమూర్తి
9441841314

## కీర్తి కిరీటి

పేరొందిన తెలంగాణా సిద్ధాంత కర్త.
భాషాప్రావీణ్యత గల ఉద్యమ శ్రేష్ఠ.
ఉన్నత పదవులందిన ఆర్థక శాస్త్రవేత్త.
చుడ చక్కని తెలుగు సున్నితంబు.?

తెలంగాణారాష్ట్ర ఆవశ్యకతల పోరాటకుడు
తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల విలీన
వ్యతిరేకతల విద్యార్థి నాయకుడు ?
చుడ చక్కని తెలుగు సున్నితంబు.?

పల్లె-పల్లె లో జయశంకర్ మాటల స్ఫూర్తి.
ప్రజాస్వామ్యైక సంస్కృతి స్థాపనకు
జీవతమంతా పోరాడిన ఉద్యమ శక్తి.
చూడ చక్కని తెలుగు సున్నితంబు.?

విశాలాంధ్రా ప్రతిపాదనల వ్యతిరేక కర్త.
తెలంగాణా వాణిని బలపరచిన భాషాప్రవక్త.

ప్రత్యేక తెలంగాణ అతని జీవిత తుది స్వాశ
చూడ చక్కని తెలుగు సున్నితంబు.?

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాట వారధి
తెలంగాణ నినాదాల ప్రతిధ్వని సారధి
సామాన్య జనుల భావభాషా పునాది.
చూడ చక్కని తెలుగు సున్నితంబు.?

అసమానతల పోరాటాల వీరుడు.
రణనినాదాల రచనాదురంధరుడు
జయశంకర్ కీర్తిశిఖరాలనేలిన ఘనుడు.
చుడ చక్కని తెలుగు సున్నితంబు.?

-శ్రీమతి పుల్లాభట్ల జగదీశ్వరీమూర్తి
8097622021

## వేగుచుక్క

కళ్ళముందు వాస్తవాన్ని
కనిపెట్టిన ఘనుడు
జరుగుతున్న అన్యాయాన్ని
ప్రశ్నించిన వీరుడు
సీమాంధ్ర కుట్రలను పసిగట్టిన ధీరుడు
తెలంగాణ గొంతుకను వినిపించిన
ధీమంతుడు.

అతడే...
తెలంగాణ జాతిపిత
తెలంగాణ వేగుచుక్క

తెలంగాణ కేతనాన్ని
ఎగరేసిన జండా
మన నీళ్లు మన నిధులు
దక్కాలనే నిండా

తెలంగాణ అస్తిత్వపు
చిరునామా అతడు
తెలంగాణ జ్యోతిని
వెలిగించిన సూర్యుడు,

తల్లి తెలంగాణ స్వేచ్ఛకోసం
తల్లడిల్లిన పేగుబంధం
స్వీయజాతి రక్షణ కోసం
ఎదురొడ్డిన అగ్నిగుండం

ప్రతినిత్యం ఆరాటం
తెలంగాణ పోరాటం
స్వరాష్ట్ర ఆకాంక్షయే
అతని జీవితాశయం.

అనునిత్యం తెలంగాణకు
పాటుపడిన ఉద్యమం
నిరంతరం కుట్రలకు
అడ్డుపడిన కేతనం.

నిబద్ధతతో జీవించిన
నిజాయితీ అతని కిరీటం
సామాన్యుడిగా బతికిన
అసామాన్యం అతని చరితం

నాన్ ముల్కీ ఉద్యమానికి
గొంతుకను వినిపించినావు
సాంబార్-ఇడ్లీ
గోబ్యాక్ ఉద్యమానికి
అండగా నిలిచినావు

తెలంగాణ ఉద్యమానికి
జీవితమే అంకితం
సిద్ధాంతమే ప్రాణంగా
బతకడం అతని నైజం.

తెలంగాణలో వలసపాలనకు
చరమగీతం పాడినావు
ఆంధ్ర పాలకుల గుండెల్లో
పెనుమంటై రగిలినావు
సమస్యలను ఎక్కుపెడుతూ
సమరభేరి మోగించినావు
ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమే
ప్రతిక్షణం పలవరించినావు

ఉద్యమమే జీవితంగా
నిరంతరం బతికినావు
ప్రత్యేక తెలంగాణకు
దిక్సూచిగా నిలిచినావు
వచ్చిన తెలంగాణను
చూడకుండా పోయినావు
ఊపిరిచ్చి తెలంగాణకు
గుండెకాయ అయినావు.

అసాధ్యమన్న తెలంగాణను
సాధించి చూపినావు
కళ్ళారా చూడకుండా
తనువును చాలించినావు
జోహారు జయశంకరా !
జోహారు విజయశంకరా !!



-డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

## ఆయన ఒక గ్రంథం

పోరాటాలకు ఆరాటాలకు
నిరంతర సూర్యుడిలా వెలుగొందుతూ
విద్యార్థుల ఆశయాలు,ఆకాంక్షలకు జ్యోతు లుగా
ప్రజ్వరిల్లుతూ తెలంగాణ జాతి నిండుగౌరవానికి
స్మృతిగా, హృదిగా నిలిచిపోయిన కొత్తపల్లి
నేటి విద్యార్థులకు బొండు మల్లి...
యాచక దశ నుండి శాసక దశకు చేరాలని
వనరులతో సిరులు కురవాలని
అన్నదాతల మోములో ఆనందమవ్వాలని
చదువుకున్న ప్రతి బిడ్డకు ఉపాధి రావాలని
తెలంగాణా కావాలని నినదించిన యోధుడు
జయ శంకరుడు భవిష్యత్
తరాలకు మార్గదర్శకుడు...
విద్య వైద్యం పేదలకు ఉచితమైతే
గ్రామీణ వ్యవస్థ సస్యశ్యామలమైతే
గోదావరి కృష్ణా జీవనాధారలైతే
ఆడపడుచుల బోనాలు ఆలంబనైతే
బంగారు తెలంగాణ
కోటి రత్నాల వీణ
ఏనాటికైనా ఆయన ఒక కోన.

-గండికోట సుధీర్ కుమార్
9985321325

## జయశంకర్ - తెలంగాణ ఆకాంక్ష

సాధికార మై సాష్టాంగ పడతా
నా ముక్కోటి నినాదాల
మూడు దశల గాయాల గానాలకు
స్వరాలుపేని శివమెత్తిన శిఖరమా
జయహో తెలంగాణనీ
నీవు నా మట్టి పెద్దల మీద ప్రేమగా
యేసుకున్న పచ్చబొట్టు
నా నొసటి మీద మాసిపోని పుట్టుమచ్చవు
పెద్దయ్యా! నీవు నా కోసం రాసిన వీలునామా
నా గుండె గోడల మీద
చల్లారని నిప్పు కణికలు
నా నోట్ల మన్నుబడ్డ మతులావులు
కథలు కాలిపోయిన ఎతలు
బతుకమ్మకు తీరొక్క పూలు పేర్సినట్లు సెప్పితివి
నాది కొడిగట్టిన కొమ్మ మీద పక్షి దుఃఖం
పిల్లాది మార కాన్నునీచి
చావుల సాలు బోసిన.
బండ కన్నాతడి ఉంటది గాని
నా మట్టిలనే ఎదిగిన
ఎట్టి సాబ్ లకు నా శోకాల తడి
అంటుత లేదు
పెద్దయ్య !
సంగతులన్నీ రోడ్ల మీద బంతి
బోజనాలంత బహిరంగంగా లేవు
ఎవరు ఏ గోతులు తీస్తున్నారో
ఎంత లోతుల్ల దిగ బడ్డారో
అంతు బడ్త లేదు
ఎవల కలుగుల ఏమేమి
కంతలున్నాయో , కత్తులున్నాయో
ఎవరి మాటల్ల ఏమి
మాయ మందల్లున్నాయో
మర్మాలు ఉన్నాయో
ఎవరు మందో
ఎవరు మన్నో సమజ్ అయితలేదు.
నన్ను నిలువుతా ముంచనీకో,
తెల్లారిన ఎలుగోలే తేల్చనీకో
ఏంది ముచ్చట అంటే
అవ్వా! తెలంగానా
నిన్ను సుక్కల్లో సంద మామను సేత్త మంటున్నరు.
సామాజిక న్యాయాల ప్రశ్నలు
నీ నొసటి చుట్టూ .,
గిర్ర గర్ర తిరుగుతుంటే మరో పోరుకు
నారు పోద్దాం అంటివి .
నేను విముక్తయే
నీ కలలు కండ్ల ముందటికి
రాకముందే నన్ను ఒంటి పిట్టని చేసి
యాడికి పోయినవు పెద్దయ్యా !
నా గొంతుల, గుండెల తడారని
నీ తండ్లాటలకు , కుందాపనలకు ,
సాధికారమై సాష్టాంగ పడతా

-జూపాక సుభద్ర
హైదరాబాద్

## బోనంకుండ

ఎన్ని గడ్డిపోచల్ని ఏకం చేసినువ్వు
పోరాటపు తాడును పేనావో కదా!
ఎన్ని వర్గాల ఆలోచనల్ని ముడివేసి
ఉద్యమ దిశగా
పురికొల్పావో కదా!

మా తెలంగాణ మాగ్గావాలె
అని నినదించి
నిండు బోనంకుండవై
మా ఆకలి తీర్చిన ఆత్మగౌరవానివి నువ్వు
తెలంగాణ అస్తిత్వ పోరాటంలో
తొలి, మలి దశల్లో ఉవ్వెత్తున లేచిన
ఉద్యమ కెరటానికి నువ్వు

వనరుల కొరత లేని
తెలంగాణ వెనుకబాటుకు
ఉమ్మడి పాలనే కారణమనీ,
వాస్తవాల వక్రీకరణల్ని తేటతెల్లం చేసి
తల్లడిల్లిన తెలంగాణా దుఃఖాన్ని తలచుకుని
అక్షరమై ప్రశ్నించిన చైతన్యపు గొంతుకవు
ఆస్తినీ జీవితాన్ని రాష్ట్ర సాధనకై ధారపోసి
ఒక్కడివే పెక్కులను ఏకం చేసి
జనసంద్రమై మొలిచి,
ప్రజ్వలించే సూర్యుడివై నిలిచి,
వేకువవెలుగై
మా బ్రతుకుల మార్గం చూపిన జయశంకర్
సారూ..
నీ కల సాకారమై కళ్ళెదుట నిలిచినా
మరణమై అర్థాంతరంగా
ఎక్కడికని వెళ్ళిపోయావు?

నువ్వు చూపిన తోవల్లో పురోగమనమై,
నువ్వు నడిచిన చోటుల్లో
స్వయంపాలనై శాసిస్తాం!!

-రాజేశ్వరరావు లేదాళ్ళ
9441873602

## తెలంగాణ రాష్ట్రదీపకుడు

వరంగలు అక్కంపేట జనపదాన
మహాలక్ష్మి లక్ష్మీకాంతారావు దంపతుల
గర్భ శుక్తి ముక్తి ఫలం
ముద్దుల జయశంకర్
తెలంగాణ రాష్ట్రదీపకుడు!!

స్వార్థ జీవనానికి నీళ్లొదిలిన
ఆజన్మ బ్రహ్మచారి
తెలంగాణ తొలిమలి ఉద్యమాలను
రాజేసిన నిప్పురవ్వ!!

ప్రాంతీయ అసమానతలను
అవపోషణ పట్టిన మేధావి
ముఖ్యమంత్రి కె సీ ఆర్
రాజకియ బోధకులు
నవతెలంగాణకు నాంది!!

ఎన్నో అడ్డంకులను అధిగమించిన
ఆలోచనాపరుని
అలుపెరుగని సేవలకు
కృతజ్ఞులవడం మన తక్షణ కర్తవ్యం!!

తెలంగాణ బిడ్డలమై అభివృద్ధి పథంలో
రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తూ
వారి ఆశయసిద్ధికై ప్రతినబూనటమే
నేటి జయంతిన మనమిచ్చే నిజమైన నివాళి!!



-జి. శాంతారెడ్డి,
8008177325




## నేటి తరం కర్తవ్యం...

తెలంగాణ ముక్తికోరి
తెగువజూపి నడిచె ముందు
అణచబడ్డ గడ్డమీద
అధికారము మనదన్నడు

పోరుబాట తప్పదని
జోరుపెంచి గళము విప్పె
పరవాడే శత్రువైతె
పొలిమేరలు దాటించవలెను
ఇంటి దొంగ చొరబడితే
గోతి తీసి పాతవలెను

సాధించిన తెలంగాణ
చక్కదిద్ద కదలాలి
ఒక్కటై జనమంతా
పిడికిలెత్తి చాటాలి

నీళ్ళు మనము పొందాలి
నియామకమందు కోవాలి
నిధులు అందరికందాలి
ఆత్మాభిమానమే
ఆభరణమై మెరవాలి

ప్రజాస్వామ్య విలువలను
ప్రాణమళ్ళె నిలపాలి
జగమంతా తెలిసేలా
ప్రగతి రథము నడపాలి



-డా..బి.సుధాకర్
9849243908

## ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయం

పల్లవి: అందుకొ జోహరు జయశ0కరా
మా కన్నీటి జోహారు మా శ0కరా (2మా కన్నీటి)

చ: నాలుగు కోట్ల ప్రజల నాయకుడ వై నావు
కె చంద్రశేఖర్ కు రథసారధి అయినావు
తెలంగాణ పోరు బిగ్గగా పుట్టావు
త్యాగా పోరాటాల తారగా నిలిచావు (2 త్యాగ )

విద్యార్థి దశలోనే విజయాలు సాధించి
ఉన్నత ఉద్యోగ పదవులు పొందావు
పోరు జెండాగా మాకు అండగా నిలిచారు
పొద్దు పొడుపుల్లోనా ని?వు కలిసిపోయారు (2 పొద్దు)

సిద్ధాంత కర్త గా నీవు పేరుపొందారు
చివరి దశ ఉద్యమాలు ఉద్ధృతంగా చేశావు
సమైక్య వాదులకు సవాలుగా నిలిచావు
శోక సముద్రంలో నా మమ్ములను ముంచావు (2.సొక)

ప్రత్యేక రాష్ట్రమే లక్ష్యం అని అన్నావు
ప్రత్యేక ఉద్యమం ప్రజ్వలింప చేశావు
పాపిష్టి జబ్బుతో ప్రాణాలు వదిలారు
పర లోకాలకు పయనమై పోయావు (2.పర లొకాలకు)

నీ త్యాగాలకు మేము ప్రణమిల్లుతున్నాము
నీ జ్ఞాపకాలను మార్వలెకు న్నాము
మీ ఆశయాలకు మేము నెష్ఠమై ఉన్నాము
ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి తెస్తాము (2.ప్రత్యేక)

నీ చివరి పలుకులే శిరోధార్యం మాకు
నిలబెట్టు తామయ్యా నీఆశయాలు
నిబద్ధత ని? స్ఫూర్తిని తీసుకుంటాము
నిజమైన నివాళి మీకు ఇస్తాము (2.నిజ మైన)

-నూనె రాజేశం
9704875222

## ఆచార్యుని ఆశయ సిద్ధి

తెలంగాణ రాష్ట్రమే కాంక్ష
మదిలోని ఏకైక వాంఛ
ఒక్కటే మాట ఒకే మార్గం
తెలంగాణ వాదాల తండ్రి
తెలంగాణ సిద్ధించే వరకు
విశ్రమించేది లేదన్నావు
పరుల పాలనే మాకు వద్దు
స్వయం పాలనే మాకు ముద్దు,
పొట్టపోసుకొనే వానితో పోరుయేల
పొట్టకొట్టే వానితోనే మన పోరు
స్వరాష్ట్రానికి కావాల్సిన వనరులతో
గ్రామీణ వ్యవస్థ సస్య శ్యామలం కాగా
నీళ్లు, నిధులు, నియామాకాలతో
మాప్రాంతం మాతోనే అభివృద్ధి అని
ప్రజాస్వామిక, భాష ,సంస్కృతి
ఉచిత విద్య, వైద్యం
మా ముందు కలలు
మా ఆశలతో ఆడుకొని
శవాలతో ప్రయాణం చేసే
ఊసరవెల్లి రాజకీయాలకు స్వస్తి పలికి
తెలంగాణ సమరం నుండి శాంతి కొరకై
పచ్చటి బతుకులతో వెచ్చని జీవితం
బొజ్జనిండా బుక్కెడు బువ్వ
గుక్కెడు నిద్ర
ఆత్మ విశ్వాసం తొ రేపట్నుంచి
బుగులు లేని జీవితం
వలస పాలన్లో మగ్గిన
తెలంగాణ సమాజానికి
సంక్షేమ పథకాలు,
సాగు నీటి పారుదల, సంస్కరణలు.
ఉద్యోగం లాంటి కళలు సాకరం కావాలని
తెలంగాణ నే మనాది గా నింపుకున్న ఆచార్య
మమ్ము దీవించు స్వర్గంబు నుండి

-కందికట్ల శ్రీనివాసులు
9848152211

## జయశంకర్ సారు

సారూ జయశంకర్ సారూ
ఎందరికో ఆదర్శం మీ తీరు
తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా జీవించినారు
ఎన్ని అడ్డంకులెదురైనా, ఆ ఆశతోనే శ్వాసించినారు
పేద, ధనిక తారతమ్యాలు అంతరించాలన్నారు
స్త్రీ, పురుష బేధ భావాలు తొలగిపోవాలన్నారు
కులమతాల జాడ్యాలు అంతం చేద్దామన్నారు
సర్వ మానవ శ్రేయస్సే ఆశయంగా తపించినారు
ఎన్నికల్లో, ఎన్నో కలలతో ఓటేసిన జనత
అన్ని రంగాల్లో సమానత్వం కోరుతున్నారు
అందరికీ అభివృద్ధి ఫలాలు అందాలని అడుగుతున్నరు
మీ కలల ప్రపంచంలో ఇంకా తీరని అవసరాలెన్నో లెక్కకు
ఇప్పటికీ మీరు జీవించి ఉంటే ఎంతో బాగుండేది మాకు
ఏ కాలమైనా, ఏ ప్రాంతమైనా, ఏ పార్టీ ఐనా
ప్రజాస్వామ్య స్ఫూర్తితో పనిచేస్తే మెరుగు
అప్పుడే ప్రపంచంలో మనకు విలువ పెరుగు
అసమ్మతి తెలపడమంటే దేశద్రోహం కానే కాదు
ప్రజాస్వామ్య సౌరభానికి అదే మంచి పాదు
తాము చేసినపని ఒప్పు, అదే పని ఇతరులు చేస్తే తప్పు
అను భావన అందరూ మార్చుకోవాలి ముందు
భావ ప్రకటనా స్వేచ్ఛయే ప్రజాస్వామ్యానికి మంచి మందు
రోగానికి తగిన మందులు రాయాల్సిన వైద్యులు
రోగ నిర్ధారణే సరిగా చేయనపుడు బలి కాబడతారు రోగులు
సమాజ అభివృద్ధికి తగు పథకాలు రచించలేనప్పుడు
సమాజంలోని లుకలుకలు సరిచేయ మనసు రానప్పుడు
సమాజం రోజు రోజుకూ నిర్వీర్యమై పోతుంది
జీవశ్చవానికి చిరునామాలా మిగులుతుంది



-నాగిరెడ్డి అరుణ జ్యోతి,
9966181561

## తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త

తెలంగాణ సాధన లక్ష్యం..
చేసెను ఉద్యమ సారథ్యం
బ్రతికుండగ నెరవేరలేదు ధ్యేయం..
చూడచక్కని తెలుగు సున్నితంబు

బహుముఖ ప్రజ్ఞాశాలి అతను..
పలుభాషా కోవిదుడు తాను..
ప్రొఫెసర్గా దారిచుపాడు తాను..
చూడచక్కని తెలుగు సున్నితంబు

ఓరుగల్లు ముద్దుబిడ్డ జయశంకరుడు..
ఉద్యమాల పోరుగడ్డకు వారసుడు..
రాష్ట్రసిద్ధికై తపించిన నాయకుడు..
చూడచక్కని తెలుగు సున్నితంబు

తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త..
ప్రజాచైతన్యం తెచ్చిన వక్త..
అలుపెరుగక పయనించిన ధీరోదాత్త..
చూడచక్కని తెలుగు సున్నితంబు

జయశంకర్సారుకు చేద్దాము వందనం..
తన నాయకత్వ పటిమకు ప్రణామం..
నిఖార్సైన వ్యక్తిత్వానికి సలాం..
చూడచక్కని తెలుగు సున్నితంబు

-గీతారాణి అవధానుల
9491475210

## సార్ ఆశయాలను నెరవేర్చాలి

జయ శంకర్ సారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు చేసిన
కృషిని మారువలేము
అడుగడుగునా అవమానాలు ఎదుర్కొంటు
తన వృత్తి ధర్మాన్ని కొనసాగిస్తూ యువతను
మేల్కొలిపి రాష్ట్రసాధనకై తమ సహకారం అవసరాన్ని
తెలియజేసి...
తెలంగాణ ప్రజలు ఎలా వెనుకబడిపోతున్నారో యని...
స్తాన బలం కోల్పోయి నిస్సహాయులుగా
మిగిలిపోవడం సమంజసం కాదని....
ఎన్నివిధాల తెలంగాణ అన్యాయానికి
గురియగుచున్నదో కళ్ళముందు చూస్తూ
ఉద్యమస్ఫూర్తిని యువతలో నింపి
తన జీవితాన్ని రాష్ట్ర సాధనలో త్యాగం చేసినఘనుడు.
తెలంగాణ సాధించాము
సారు ఆశయాలకు ఊపిరి పోయాలి
ఉద్యమ కళాకారులను గౌరవించి,
వారి ఆటపాటలతో తెలంగాణ వచ్చిందని మరువ కూడదు
నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి
రైతుబిడ్డలకు భరోసా ఇవ్వాలి
సార్ ఆశించిన పథకాలను, సంస్కరణలు
చట్టప్రకారం అమలు చేయాలి.
ఏడాదికో సారి మాత్రమే తలుచుకోకుండా
నిరంతర కృషిని సాగించాలి.
తెలంగాణ కోటి రతనాల వీణ గా
బంగారు తెలంగాణగా
సస్యశ్యామల రాష్ట్రంగా తీర్చి దిద్దాలి.
జయశంకర్ సార్ కళలు సాకారం కావాలి
అందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

-ఆందోల్ పుష్పలీల రేవతి
8790958751

## మేలుకో నవతరం

తెలంగాణ చరిత్ర గురించి తెలుసు కో నవతరమా !
తెలంగాణ కల ఏల సాకారం అయిందో తెలుసు కో నవతరమా!
తెలంగాణ సిద్ధాతకర్త గురించి తెలుసు కో నవతరమా !
తెలంగాణ కోసం అసువులు బాసిన వీరుల గురించి
తెలుసు కో నవతరమా!
ఎన్నో ఏళ్ల కల సాకారం ఏల అయిందో తెలుసు కో నవతర మా !
ఈ గడ్డ చరిత్ర తెలుసు కో నవతరమా!
జయ శంకర్ సార్ గారి చరిత్ర ను తెలుసుకో నవతరమా!
జయ శంకర్ సార్ గారి ఆశయ సాధన కోసం పోరాడు నవతరమా!
నీ హక్కు ల కై పోరాడు నవతరమా!
తెలంగాణ అభివృద్ధిలో భాగం అవ్వాలి నవతరమా !
స్వరాష్ట్ర న్ని నడిపించే బాధ్యత నీదే నవతరమా!
నీళ్ళ కోసం పోరాడు నవతరమా!
నిధుల కోసం పోరాడు నవతరమా!
నియమకల కొసం పోరాడు నవతరమా!
బహుజను ల రాజ్యం కోసం పోరాడు నవతరమా!
బహుజనుల హక్కుల కోసం పోరాడు నవతరమా!

-బిరుదల ప్రవీణ్ కుమార్
9959840356

## తెలంగాణ తొలి కిరణం

తెలంగాణ తొలికిరణం మీరే
ఆచార్య జయ శంకరుడా!
ఉద్యమాలకు ఊపిరి పోసిన
నవ తెలంగాణ దార్శకుడా!!

నీటి కోసము నిధుల కోసం
ఆత్మ గౌరవం నిలుపుట కొరకు
ఆర్థిక వనరుల వాటా కోసం
బానిస బతుకుల విముక్తి కోసం ॥తెలంగాణ॥

గతకాలపు మోసాలను చూసి
ఆత్మ నిండుగా ఆర్తిని పొంది
గొప్పదైన సిద్ధాంతం తోటి
ప్రతిన బూని పయనం సాగించిన ॥తెలంగాణ॥

అర్థశాస్త్ర అధ్యాపక వృత్తిలో
ఆరితేరి మీరాచార్య
ఉపకులపతిగా ఉన్నత పదవికి
వన్నెతెచ్చి రాణించారు.
నర నరాన నమ్మిన సిద్ధాంతం
నిరంతరం నిన్ను రగిలించ
వ్యూహకర్తగా వారసులను
ఉద్యమ బాటలో నిలిపావు ॥తెలంగాణ॥

కర్తవ్య సమరమ్మున మునిగి
బ్రహ్మచారిగా మిగిలారు
స్వరాష్ట్రాన్ని సాధించు పథములో
త్యాగధనులుగా నిలిచారు.



-తాడిచెర్ల రవి(తార)
8919800447

## పాడవోయి తెలంగాణుడా!

పాడవోయి తెలంగాణుడా!
పాడి ఆడవోయి తెలుగు లోగిటా!
పాడవోయి తెలంగాణుడా!!

తెలంగాణా రాష్ట్రవతరణం
అమరుల త్యాగఫలం
జయశంకర్ ఆశయ,ఆకాంక్షల అమ్రుతభాండం!
కన్నతల్లులెందరికో కడుపుకోత ఫలితంగా
పురుడు పోసుకున్న బిడ్డ తెలంగాణ పోరుగడ్డ!
నవజాత శిశువు తెలంగాణరా!
నడక నేర్చుకుంటున్నదిరా!
నవజాత శిశువు తెలంగాణరా!! "పాడ""

తెలంగాణ వచ్చెనని,వెలుగే తెచ్చెనని
సమరం ముగిసెనని,తిమిరమింక లేదని
సాధనయే లక్ష్యమని సాధించుటె విజయమని
చతికిలబడి కూర్చుంటే బ్రతుకే లేదోయి
పయనించవోయి తెలంగాణుడా!
బంగారు తెలంగాణ బాటలో!
పయనించవోయి తెలంగాణుడా!
ఆపకోయి తెలంగాణుడా
కవి గాయక కళాకారుడా!
దరువాపకోయి తెలంగాణుడా!! "" పాడ"""

-పాలకుర్తి వసంత
9440548535

## జయశంకర్ సారు జోహారు

తెలంగాణ పులి బిడ్డడు రా!
నిన్ను మరువలేదు తెలంగాణ గడ్డ రా!
నీ కుటుంబాన్ని విడిచెను రా!
తెలంగాణే నా కుటుంబం అని పలికెను రా!
తన కర్తవ్యమే తన బలం అని అనుకొను రా!
ఆ కర్తవ్యాన్ని నిలబెట్టడానికి
అమర వీరుడయి పోయేనురా!
ప్రతి విద్యార్థి మనసులో నువ్వు ఉండెనురా!
నీ రూపమే మాకు ఆదర్శమవునురా!
తెలంగాణను సాధించడమే తన ఆశయమురా!
తన ఆశయ సాధనకే జోహారు పలకరా!
తన బాటలో నడవడమే మన కర్తవ్యమురా!
మన తెలంగాణను బంగారు తెలంగాణగా !మార్చడమే
మన గెలుపురా!
యాచక దశ నుండి శాసక దశ వరకు చేయడమే
!మన కర్తవ్యమురా !
అందుకే జయశంకర్ సారుకు జోహారు జోహారురా!

-ముదావత్ గణేష్
7993622019

## చిరస్థాయి

పేరులోనే జయం!నీ కేంభయం?భయానికే జ్వరం
ఎక్కడ ఏ మంచి పని చేసినా నీదే విజయం
తల్లిదండ్రుల బుద్ధి పుణికి పుచ్చు కున్నావు
ఉత్తముడవై శ్రద్ధగ చదివి ఊరికి పేరు తెచ్చావు
ఆశయాలు స్వచ్ఛమైతే వాటికి ఎదురుంటుందా?
చదివిన చదువుకు పదునుపెట్టి
నమ్మిన సిద్ధాంతానికి నమస్కరించి
జనియించిన ధరిత్రికి దండం పెట్టి
మిత్రబృందం విద్యావేత్తలు సహచర గణం
విద్యార్థుల తోడుగా ఉద్యమం నడిపావు
ఆశయ సాధనలో అసువులు బాసావు
అయినా అనుకున్నది సాధించావు
ఆచార్యునిగా పరిశోధనతో పరిశీలిస్తుంటావు
నీ శిష్యులు చిగురించి శాఖోపశాఖలుగా విస్తరించి
నీవు నేర్పిన విలువలకు విలువునిచ్చి
కార్యోన్ముఖులై కర్తవ్యాన్ని కార్యరూపం దాల్చేందుకు
నడుం భిగించారు
గురుభక్తితో అంతిమ విజయం సాధిస్తున్నారు
జయహో గురు ఆచార్య జయశంకర్ జీ!
జయ జయ జయహో తెలంగాణా!
సస్యశ్యామలం ఈ భూమి సంతోషాలు కర్మభూమి
జయహో గురుదేవా జయహో!
గురు ఆచార్య జయశంకర్ జీ జయహో జయహో
నినాదాలు శబ్దఘోష ప్రతిధ్వనిస్తుంది

-ఖండాపు మన్మథరావు
9440943937

## ఒడవని ముచ్చటకు మరో ఆరంభం!

అందరి చూపులు ఆకాశం వంక ఉంటే
అతనొక్కడు మాత్రం
నేల వంక చూసాడు
చుట్టూ వున్న జనమంతా
కోనసీమ సినిమా అందాలను చూస్తుంటే
అతనొక్కడు మాత్రమే
తాను పుట్టిన మట్టి నెర్రెల వైపు దిగులుగా
చూసాడు
కథలన్నీ కాశీకే పోతాయంటారు
కాశీ విశ్వ విద్యాలయంలో
తెలంగాణా కథకు
ముగింపు దొరుకుతుందేమో
అని నిరంతరం వెతికాడు
విద్యార్జనతో పాటు తెలంగాణ
గర్జనను కూడా నేర్చాడు
తెలంగాణా అంటే..
ఓ ఒడవని ముచ్చట అని అర్థం చేసుకున్నాడు.

భూమి పుత్రుడు కదా!
భూమి బిడ్డల గోసకు చలించి తెలంగాణ
పిలుపుకు భూమికను సిద్ధం చేసాడు
మెదళ్ళను కదిలించే అక్షరాన్ని
జ్ఞానాన్ని అందించే ఉపన్యాసాన్ని
పోరాటం చేసే ఆత్మ గౌరవ
రాజకీయాన్ని
కదిలించి అదిలించి
అందరిలో చలనం తెచ్చాడు!

బీద రైతు వాటా నీళ్లు
మధ్య తరగతి సంసారి నిధులు
ఉన్నత విద్యావంతుడి ఉద్యోగం
గాలిలోనే ఎలా
మాయం అవుతున్నాయో తేల్చాడు!

కన్నీటి భాషను,మనసు యాసను,
న్యాయపు బాటను ఎరిగిన యాత్రికుడు కదా!
కరువు గుండెలను,బీద దేహాలను
వివక్ష వడగాలులను
అనుభవించిన మనిషి కదా!
ఇంకానా..ఇక చాలనుకున్నాడు
నా ప్రజలకు ఈ అణిచివేతలు
ఇక చాలని పంతం పట్టిండు!
ఓ జ్ఞాన జ్వాల..
జయశంకర్ సారు!
మరో పెను వాయువు..
కేసీఆర్ జోరు!
ఒకరి ఆలోచన ..మరొకరి ఆచరణ
వారి వెంట సకల జనుల అనుసరణ
ఫలితం ప్రత్యేక తెలంగాణ!
జయశంకర్ సారూ!
మిము కన్న తెలంగాణ తల్లి
ఇప్పుడు సగర్వంగా తల ఎత్తుకుని
నిలబడింది
ఒక్కసారి మా కోసం రారాదూ?!
బంగారు కలలు సాకారమైన
బడుగు బతుకు ఆనందాల్ని చూద్దురు
అలుగు దుంకుతున్న చెరువుల
చప్పుళ్ళ ని
చెవి దోనెలో వంపుకుందురు
ధాన్యపు రాసులతో ఆర్థిక ముల్లెలైన
పల్లెల స్వయం సమృద్ధిని గానం చేద్దురు
కుల వృత్తులకు దక్కిన గౌరవాన్ని
గుండెలకు హత్తుకుందురు!
రా సారూ...!
తెలంగాణ ప్రగతి హారాలని మీ మెడలో
వేస్తాము
మీరు నాటి వెళ్లిన ఆత్మ గౌరవ మొక్కలు
ఇప్పుడు వృక్షాలై పాడుతున్న
సంక్షేమ గానాన్ని వినిపిస్తాము.!
సారూ..
మళ్ళీ ఓ సారి మాకోసం రారాదూ..
నిజమైన మీ స్వప్నాన్ని చూడటానికి...
మీ ఒడవని ముచ్చటను
సరి కొత్తగా చెప్పటానికి...!!

-అయినంపూడి శ్రీలక్ష్మి,
9989928562

## విప్లవించాల్సిందే!

ఈ తెలంగాణ గడ్డలో ఏమున్నదో
ఇది మొదటినుండీ పోరాటాల పురుటిగడ్డే
అప్పుడు, కోటలతో కొట్లాట,గడీలతో గడబిడ
నిజాముతో జజ్జనకరి జనారే
ఆతర్వాత, అస్తిత్వంకోసం, ఆత్మగౌరవంకోసం
నాన్ ముల్కీ, ఇడ్లీ సాంబర్ గోబ్యాక్ ఉద్యమాలు
మొన్నటికిమొన్న మానవహారాలు, మిలియన్ మార్చులు
రోడ్డుమీదభోజనాలు, సకలజనులపోరాటాలు
ఆమరణదీక్షలు, ఆత్మబలిదానాలు
కలాలకవాతులు, ఆటపాటలధూంధాంలు
ఫలితందక్కి తెలంగాణ సాధించాం
ఆచార్య జయశంకర్ గారి ఆశయసాధన
తెలంగాణరాష్ట్ర ఆవిర్భావం మాత్రమే
అనుకుంటే మనం పొరపాటు పడ్డట్టే
మనరాష్ట్రం హరితవిప్లవం సాధించి
తెలంగాణతల్లి మెడలో హరితహారం వేయాలి
క్షీరవిప్లవంతో ఆతల్లికి పాలాభిషేకం చేయాలి
పంటలవిప్లవంతో మనతల్లి చిరునవ్వు చూడాలి
చేతివృత్తులవిప్లవంతో మనపల్లెలన్నీ మురిసిపోవాలి
చెత్తవిప్లవంతో స్వచ్ఛతెలంగాణగా మెరవాలి
పారిశ్రామికవిప్లవంతో మన తెలంగాణ
ఎందులోనూ తక్కువకాదని చాటాలి
చతుష్షష్టికళలవిప్లవంతో తెలంగాణ పునరుజ్జీవంపొందాలి
శాంతితెలంగాణ కోసం, భద్రతెలంగాణ కోసం
సుఖతెలంగాణ కోసం, సౌఖ్యతెలంగాణ కోసం
ఆనందతెలంగాణ కోసం, బంగారుతెలంగాణ కోసం
ఆచార్య జయశంకర్ గారు కలలుగన్న
అద్భుతరాష్ట్రంగా తయారుకావాలంటే
మనతో మనం ప్లవించాల్సిందే విప్లవించాల్సిందే !!!

-డా.గౌరవరాజు సతీష్ కుమార్.
9866757278

(మిగతా 5వ పేజీలో..)

(4వ పేజీ తరువాయి..)

## తెలంగాణా ఉద్యమకెరటం

తెలంగాణ నేస్తమయ్యి
తెలుగు తల్లి బిడ్డడయ్యి
మహాలక్ష్మీ లక్ష్మికాంత
రావుల సంతానమయ్యి!!

ఓరుగల్లు జిల్లలోను
ఉద్యమాల గడ్డలోను
కొత్తపల్లి జయశంకరు
దుదయించే నేతగాను!!

నాన్ ముల్కీ ఉద్యమమును
సమరశీలుడై నడిపెను
తెలంగాణ ఆంధ్ర రాష్ట్ర
విలీనాన్ని యద్దు కొనెను!!

సాంబార్ ఇడ్లి గోబ్యాక్
జొన్న రొట్టెనే కిరాక్
యను ఉద్యమమందు నిల్చి
ఆంధ్రుల కిచ్చెను జలక్!!

స్వరాష్ట్రమే ధ్యేయముగ
ఉద్యమమే ఊపిరిగ
కేసి ఆర్ సార్ వెంట
వెన్నంటీ నిలిచెనుగ!!

యాచక దశ పోవాలని
శాసక దశ రావాలని
నీళ్ళు నిధులు నియామకముల
కొరతన్నదె ఉండొద్దని!!

గళం యెత్తి నినదిస్తు
ఉద్యమాన్ని నడిపిస్తు
తెలంగాణ మంత తిరిగె
చైతన్యము రగిలిస్తు!!

ఇల్లు వాకిలీ విడిచెను
పోరుబాట లో నడిచెను
జీవితాన్ని యర్పించి
బ్రహ్మ చారి గా నిలిచెను!!

తన కల సాకారము
కాకుండనె మరణము
సంభవించి మహాశయుడు
పొందెను అమరత్వము!!

-గాండ్ల వీరమణి
9912540101

## చైతన్య జయశంక'రణం'

అడుగు అడుగు కదిలింది..
పదం పదం పలికింది..
కలం గళం ధ్వనించింది...
తెలంగాణ గడ్డ పై ఓరుగల్లు బిడ్డ
తెలంగాణ ఉద్యమాన తొలి తరానికి ఊపిరిగా
చైతన్య కిరణమై ఉదయించాడు..!!

నాన్ ముల్కి ఉద్యమాన సారధిగా
సాంబార్ ఇడ్లీ గో బ్యాక్ నినాద వారధిగా
గల్లీ నుండి ఢిల్లీ దాక
దేశ విదేశాల్లో ఉద్యమ బాట వేసి
తెలం 'గానం'మనే నినాదాన్ని
రణభేరిగా మ్రోగించాడు..
ఆస్తినీ ..అస్థిత్వాన్నీ
తెలంగాణకే ధార పోసి
మార్గదర్శిగా నిలిచాడు..
విద్యార్థుల వ్యూహాలకు ఆచార్యుడై
అందనంత ఎత్తుకు ఎదిగాడు..!!

తెలంగాణ ఒడిలో వికసించిన కుసుమమై
తెలంగాణ హోరులో గర్జించిన సింహమై
తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా
నవ తెలంగాణ నవోదయానికి నాందిగా
'సిద్ధాంత కర్తను' కాను స్వచ్ఛంద 'కర్తనంటూ'
కర్తవ్య దిశగా అడుగులేసి ఉద్యమ జ్యోతిగా
ఎందరో బ్రతుకుల్లో
సూత్రధారిగా మిగిలాడు..!!

"అబ్ తో ఏక్ హీ ఖ్వాయిష్ హై
వో తెలంగాణ దేఖ్ నా ఔర్ మర్జానా" అంటూ
నిజమైన కలని వీక్షించకుండానే
కలని కన్నీటి తెరని మిగిల్చి
తెలంగాణ ప్రజల గుండెల్లో
శిలాక్షరమయ్యాడు..!!

-స్వప్న మేకల
9052221870

## ఆరాధ్యుడు

సత్యమేదో చెప్పి
మోసం ఏదో విప్పి
ఉద్యమ అరుకు నింపి
రగల్ జెండా ఎగరేసినవు
జయహో జయ శంకర
జన జాగృతి నేత భయ్యా
జాతి సిద్ధాంతకర్త వయ్యా
భావజాల మూర్తి వయ్యా
నీ మాట తెలంగాణ
నీ బాట తెలంగాణ
నీ యాస తెలంగాణ
వొడువని ముచ్చట చెప్పి
అక్రమార్కుల చిట్ట విప్పి
మట్టిలో మొలకెత్తిన మాణిక్యమై
తంగేడు దండలో దారమై
అస్తిత్వ పోరాట బాటవై
ధిక్కార కూడలిలో ఎగిరే కేతనమై
నిలిచిన నికార్సైన వ్యక్తివి...!

నీవు మామూలు శక్తివి కాదు
వలస పాలకుల గుండెల్లో
మోగిన ఫిరంగి గుండువి
నింగి లో వెలిచిన సింగిడివి
అక్కంపేట లో పుట్టి
అన్యాయాన్ని ఎదిరించి
బాధలు ఎన్నో చూసి
బతుకు పాఠం నేర్పినవు
నోరులేని ప్రజల నాలుకవై
నొసటి గీత మార్చినవు
గల్లీ నుండి ఢిల్లీ దాకా పోరు సలిపి
ముందు వరుసలో గెలిచినవు
ఒక్కడిని నేనంటూ ఎక్కడ అదరలే
సీమాంధ్ర పాలకులకు ఎన్నడు బెదరలే
వొడుపు లెన్నో నేర్పి
ఓరుగల్లు పై వెలిసి
కోట్లాది జనం గుండెల్లో నిలిచి
తెలంగాణ తల్లి పెద్దకొడుకువై
దిగంతాల కి వెళ్ళిన
అందరి ఆరాధ్యుడు
మన జయశంకర్ సార్ ...!



-కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి
9441561655

## ఉద్యమ ప్రస్థానం

నిబద్ధత గల వ్యక్తి
నీతి నియమాలు గల ఉద్యమ శక్తి
విశిష్టమైన వ్యక్తిత్వం
విలువలకై నిలబడే అస్తిత్వం.

ఉద్యమమే ఊపిరియై
ఉరకలెత్తిన స్వరమై
నమ్మిన సిద్ధాంతాన్ని
నలుగురికి తెలిపిన వ్యక్తియై
నరనరాన జీర్ణింప జేసినా యుక్తియై
నాన్ ముల్కి ఉద్యమ కీర్తి కిరీటియై
గల్లీ నుండి ఢిల్లీ వరకు
ఉద్యమానికి ఊపిరియై
తొలి ఉద్యమానికి ప్రాణమై
మలి ఉద్యమానికి జీవమై
జనం కోసం ప్రశ్నించారు
జనం గుండెల్లో నిలిచారు.

తెలంగాణాకు ఎజెండాగా
తెలంగాణా గుండె నిండుగా
ఆరెస్సెస్ ఆర్ ఎస్ యూ లకు
ఉద్యమ స్ఫూర్తిని
రగిలించిన రవితేజోమూర్తిగా
టి ఆర్ ఎస్ సిద్ధాంత కర్తగా
కె సి ఆర్ కు దార్శనికునిగా
తెలంగాణా మహోపాధ్యాయునిగా
తెలంగాణా జాతిపితగా వెలిగిన నీకు.

సాటి లేరు నీకెవ్వరు సారు
నీకు నీవే పోటి జయశంకర్ గారు

-గుడికందుల ప్రకాశం
9550894025




## జయహో జయశంకర్

ఉద్యమాలకు ఊపిరిగా నిలిచి
సంఘవిద్రోహులను ఎదిరించి
విద్యార్థి దశలోనే విశ్వవిద్యాలయాలు కోరి
వరంగల్ కాకతీయ కళాతోరణమై నిలిచి.

పల్లె పల్లెనా వాడవాడన
నీరు నారు అందించే
బీడు భూముల్లో పసిడి సిరులు కురిసే
బుగులు బుట్టని శ్రమని కల్పించే
నీళ్లు నిధులు నియామకాలు సాధించే.

తెలంగాణ చెరువు తీరు
జయశంకర్ సారు అంటూ
పాటలకు పల్లవి కవులకు కవితయై.

తెలంగాణ రాష్ట్ర జాతిపిత
పోరాటవీరులకు మార్గదర్శకులు
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి
మరో అంబేద్కర్ నీవు.

విశ్వవిద్యాలయాల విద్యా వెలుగయ్యావు
తెలంగాణ తెలుగు తల్లి కల్పవల్లివి నీవు
బంగరు తెలంగాణ భవితవు నీవు
జయహో జయశంకర్ ...
జయ జయ జయహో ...

-కోలంట్ల రామకృష్ణ
9515514900

## తెలంగాణ జాతిపిత.

ఓ తెలంగాణ ఉద్యమ అగ్నిజ్వాల
మీకు పురుడు పోసి పుణ్యం కట్టుకున్నది ఈ నేల
తెలంగాణ రాష్ట్ర సాధనే మీ కల
మీ నిరంతర కృషితో తెలంగాణ రాష్ట్రం ఈ వేళ
మీ వ్యక్తిత్వం మానవజాతికి ఓ పాఠశాల
మీ అడుగుల సవ్వడిలో కాలం అలిసిపోయాను అలా
మీరు నడుస్తున్న గ్రంథాలయ భవన శాల
తెలంగాణ రాష్ట్రం కై ఉద్యమించిన ఉద్యమ జ్వాల
నీ త్యాగం మరిచిపోదు ఎన్నటికీ ఈ తెలంగాణ నేల
మీ జ్ఞానం చీకటిని చీల్చే కాకతీయ కాంతి రేఖల
మీ జీవితం ఎగిసి పడే కేరటపు అల...
మీరు లేని తెలంగాణ ఉద్యమాన్ని ఊహించడం ఎలా
మీ వ్యక్తిత్వం ఓ ఇంద్రధనుస్సు వెల్లువల
ఈ తెలంగాణ యావత్ రాష్ట్రానికి దేవుడిలా
మీ అక్షరాలే ఉద్యమానికి ఊపిరిలా
మీ ఉద్యమ సమయస్ఫూర్తి సంధించిన బాణంలా
ఏ కవి కలం కి అందని నిలువెల్ల గాయములా
చరిత్రలో మీ త్యాగం చెదరని చరిత్రల
సువర్ణ అక్షరాలతో నిర్మించిన పందిరిలా
మీ కార్యసిద్ధి రెపరెపలాడే విజయ పతాకంల
తెలంగాణ తెగింపు కొట్లాడే సింహంలా
దోపిడీ ,అన్యాయాన్ని ప్రశ్నించే గొంతుల
ఓ జయ శంకరా స్వరాష్ట్రనీ నీ త్యాగ ఫలం
నీళ్ల , నిధులు ,నియామకాలు కై ,గర్జించిన నీ గళం
శాంతి హిత ఉద్యమ సారథి లా
మీ ఉపన్యాసం ఉద్యమ నికి ఆయుష్ లా
మీ జననం ఈ జగతికి పండగ లా
మొక్కవోని దీక్ష లో ఓ మహా ఋషి లా
నిన్ను ఎన్నటికీ మరచి పోము మా యాది లో ....

-సురేష్, బచ్చలకూర
9908030426

## చైతన్య కిరణం

సార్థక నామధేయుడవై
తెలంగాణా రాష్ట్ర సాధనలో...
జయం సాధించిన విజయుడవు...
వృత్తిపట్ల నిబద్ధుడవై, పరిశోధకుడవై....
ఆచార్యునిగా ఎందరెందరో
విద్యార్థులకు మార్గదర్శకుడవు.
తెలంగాణా ఉద్యమానికి ఊపిరి నీవై..
విద్యార్థుల గుండెల్లో
స్ఫూర్తిని నింపిన ధీరుడవు...
తెలంగాణా రణ నినాదాన్ని
దేశాంతరాలకు వినిపించిన
పోరాటశీలివై...
ఎన్నెన్నో ఉద్యమాలకు సారథి నీవై
జయాన్ని పొందిన వీరుడవు...
అసమానతలను,అన్యాయాన్ని
ఎదిరించిన విప్లవకారుడవు..
తెలంగాణా పితమహుడవు..

తెలంగాణా ఉద్యమానికై ఆస్తిని,
జీవితాన్ని అంకితం చేసిన
త్యాగమూర్తివి నీవు..
నీకివే మా కవన నివాళులు...

-రికిబండ్ల విష్ణుప్రియ
8985614385"

## ఉద్యమ తార జోహార్లు

భూమిపై ఉదయించిన ఉద్యమ తార
తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర
స్వదేశం నుండి విదేశాల వరకు
తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన ధీర
గల్లీ నుంచి ఢిల్లీ దాకా జనం కోసం
ఉద్యమాన్ని వ్యాప్తి చేసిన సమర శీలి.

ఎమర్జెన్సీ రోజుల్లో కళాశాల నడిపి
విద్యార్థులను అధ్యాపకులను కాపాడిన ధీశాలి
అధ్యాపకుడిగా ఎంతోమంది విద్యార్థులను
తీర్చిదిద్ది విలువలు బోధించిన ఆదర్శ గురువు
యాచక దశ నుంచి శాసక దశ వరకు
బానిస బతుకు నుంచి స్వతంత్ర జీవనం వరకు
వ్యక్తిగా శక్తిగా ఎదగాలని తెలంగాణ రావాలని
ప్రతి ఒక్క గుండెను కదిలించిన ప్రసంగ కర్త
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తలచి
ఆ కోరిక నెరవేరకుండానే కానరాని లోకాలకు తరలిన
మీరు వెలిగించిన ఉద్యమ స్ఫూర్తి ఊపిరిలో దూకుని
నేడు బంగారు తెలంగాణ గా వెలుగొందుతోంది
ఈ గంత నీదేలే ఓయ్ శంకర్
అందుకే అందుకో జోహార్లు

-బి. శ్రీలత
7382303368

## జయహో ! ఆచార్య

లక్ష్మీకాంతారావు, మహాలక్ష్మమ్మ ల
ముద్దుబిడ్డ మీరు
చిన్ననాటి నుంచి తెలంగాణాకై
స్వప్నించిన వారు
ప్రత్యేక తెలంగాణాకై శాసించిన వారు
జయహో ఆచార్య.

భావ దారిద్ర్యం పనికిరాదని
వరంగల్ కి డిగ్రీ కాలేజీ కావాలని
జరిగే ఉద్యమంలో, యూనివర్సిటీ కావాలని
పోరాడిన మేధావి మీరు
జయహో ఆచార్య.

విద్యార్థులను సంఘటితంగా
వీరులు గా మార్చిన విప్లవ నేత మీరు
మూడు దశలుగా సాగిన ఉద్యమంలో
మూడు చెరువుల నీళ్లు తాగించిన మేధావి
మీరు
జయహో ఆచార్య.

చెన్నారెడ్డి నుంచి చంద్రశేఖర్ దాక
మేధో శ్రమను ధారపోసిన స్థితప్రజ్ఞులుమీరు
తెలంగాణ రాష్ట్ర సాధన ఒక్కటే నా కలని
ఢంకా బజాయించి చెప్పిన వీరులు మీరు
జయహో ఆచార్య జయశంకర్ సార్
జయహో..

-వనం. సావిత్రి
9441440422

## తెలంగాణ చిత్రగుప్తుడు

జాతిగుండెల్లో బంగారు నదులు ప్రవహిస్తున్నా
గాయాల కొలిమిలో నిత్యం రగులుతూ
బతుకంతపోరై కన్నీళ్లను మింగిబతికే బిడ్డల
పారుతున్న గాయాల నదులకు
పసరుమందుగా మారి
తెలంగాణోద్యమపంటను వేదనలతో సాగుచేస్తూ
సాకరమయ్యే కలగా మారుస్తూ
జీవితమంతా త్యాగాలకు ప్రతీకయై
ఉద్యమమే ఊపిరైనా నిస్వార్థజీవి.

దిక్కుతెలియని తన అమాయక జాతికి
సిద్ధాంతకర్తయై కర్తవ్యం బోధిస్తూ
తమ ప్రకృతివనరులను దోచుకుతింటున్నా
తెలుగుజాతి నల్లబిడ్డల ఆర్థిక ముసుగులను
లెక్కల్లో భద్రపరచిన గురితప్పని చిత్రగుప్తుడు
ఆంధ్ర అగస్త్యుడు రా(హు)వు మింగినా
నదుల తల్లుల నీళ్లమీదనే నిప్పులు పుట్టించిన
జయసంకల్ప చైతన్యుడు

స్థూపాలే స్ఫూర్తియైన లెఫ్టిస్టు
అలుగుమత్తడి దుంకి ప్రవహిస్తున్నా నీటిపాలనురగ
వంద పృచ్ఛకులకు సమాధానమివ్వగల
విషయ చమత్కార శతావధాని
జెండాలు-ఎజెండాలేరుగని జాతీసంక్షేమ కాంక్షకుడు
విశాలాంధ్ర విషాన్ని ముందే పసిగట్టినా
యస్.ఆర్.సి.ముందు తెలంగాణ బాణీ వినిపించినా
ఇడ్లీ-సాంబార్ గోబ్యాక్ నినాదమైనా
ఊరూరా ప్రయాణించి ఉద్యమాన్ని బ్రతికించినా
సిద్ధాంతకర్తను గాదు స్వచ్ఛంద కార్యకర్తననీ
నిరాడంబరంగా ప్రకటించిన
తెలంగాణ తొవ్వ
వొడవని ముచ్చట
కొత్తపల్లి జయశంకర్ సార్.

-అతినారపు హరిశంకర్.
8886363249

## జయశంకర్ ఉద్యమ ప్రస్థానం.

తెలంగాణ ఉద్యమంలో ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ
తెలంగాణ రాష్ట్ర సాధనకై నిరంతరం మార్గదర్శకులుగా శ్రమిస్తూ,
విద్యార్థి నాయకుడిగా 1954లో అలీ కమిషన్ నివేదిక ఇస్తూ
తెలంగాణ అవిభాజ్య వ్యక్తిత్వం ఉన్న అందరినీ సలహాలు ఇస్తూ !!

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత సభ ప్రసంగాలు
తన ఆస్తిని జీవితాన్ని సమర్పించడం తోపాటు ఉద్యమాలు,
అబ్ తో ఎక్ హి ఖ్వాయిస హై, ఓ తెలంగాణ దేఖనా ఔర్ మరజానా,
ఒకే ఒక్క రాష్ట్ర సాధన కోరికనే అని వారు మహనీయుడు ఆలోచనలు !!

మేధావి ప్రొఫెసర్ జయశంకర్ అధ్యాపకుని, పరిశోధకుడిగా
తెలంగాణ కోణంతో నిత్య సౌశీల్యం ఆచరణలో గర్వంగా,
సున్నితంగా అధ్యయనం విశ్లేషిస్తూ విద్యావంతుడైన సూటిగా
తెలంగాణలో ప్రతి పల్లె మాటలతో ప్రజలు ఉల్లాస పూరిత ఏకంగా !!

జాతీయ అంతర్జాతీయ వేదికలపై అద్భుత ఉద్యమాల మిద
విశ్వవిద్యాలయాల విద్యార్థులతో పరిశోధన సంస్థల సభ,
ఎంతో విద్యార్థుల తెలంగాణ కోసం అమరులైన నిరాధారులైన
ఎంతో మంది తెలంగాణ ప్రజల గుండెకి లభించే ధైర్యం ఉద్భవించిన!!

అయినా ఉద్యమాన్ని ఆపకుండా ముందే పై అంతస్తు
పోలీసుల లాఠీచార్జ్ ఇలా లాఠీ దెబ్బలను సహిస్తూ
రాష్ట్ర అవతరణ చూడకుండా అందరినీ పలకరిస్తూ
మర్చిపోలేని గొప్పజ్ఞాపకం చుసే కలలలో అనిపిస్తూ!

-జాధవ్ ముకుంద్ రావు
9441375350 / 9392400058.

## తెలంగాణ తెరచాప

తెలంగాణ ఉద్యమ నావకు
తెరచాప గా నిలిచిన త్యాగమూర్తి
మూడు దశల ఉద్యమంలో
ముందు నడిచిన మహోన్నత వ్యక్తి.
సహనం స్థిర చిత్తం సిద్ధాంతంతో
మేథోశ్రమనంతా ధారబోసి
తెలంగాణ నిర్మాణ పునాది రాళ్లను
బలంగా వేసిన మార్గదర్శి ...
ప్రాంతీయ వివక్ష పైన
పరిపాలకులను ప్రశ్నించి
ప్రజల్లో చైతన్యం కలిగించి
తెలంగాణ భావజాల వ్యాప్తికై
నిర్విరామ కృషి చేసిన శ్రమజీవి.
ఉద్యమాచరణలో యువతకు
ప్రోత్సాహాన్నిస్తూ,
ఆందోళన కార్యక్రమాలకు చేయూతనిస్తూ ,
తెగువతోడ ముందుకురికిన ధైర్యశాలి .
రాజకీయ ప్రక్రియతో నే
తెలంగాణ సాధ్యమంటూ
ఉద్యమించే నాయకులకు ఊపిరై నిలిచాడు.
తన విజ్ఞానాన్నంతా పంచాడు.
ర్యాలీలు ధర్నాలు
సభలు సమావేశాలు రాస్తారోకోలు...,
ప్రతీ ప్రజా ఉద్యమంలో పాల్గొన్నాడు.
ప్రాంతీయ వివక్ష తను ప్రశ్నించాడు.
ఎన్నో సుఖాలు త్యాగం చేసి
మరెన్నో నిద్రలేని రాత్రులు గడిపి
తెలంగాణ నే స్వప్నించి
అహర్నిశలు శ్రమించి
జీవితాన్ని తెలంగాణ సాధన కే
అంకితం చేసిన జయశంకర్ సారు
తెలంగాణ సిద్ధాంతకర్తై నిలిచారు.
తెలంగాణ చిరునామా గా మిగిలారు

-చెరుకు మహేశ్వర శర్మ
9441094011

## మార్గదర్శి

తెలంగాణ తొలిదశ పోరాటానికిఊపిరై
మలిదశ పోరాటానికి మార్గదర్శకులైన
తెలంగాణ జయకేతనం
తన ప్రాంత ప్రజలకు కొండంత అండగా
తనువెల్ల తెలంగాణ వాదాన్ని నింపుకొని
కలమై గళమై ముందు నడిచిన
ఉద్యమసారథి
ఫజల్ అలీ కమిషన్ నుండి
శ్రీకృష్ణ కమిటీ నివేదిక దాకా
తెలంగాణ వెనుకబడిన వైనాన్ని
తెలంగాణ అస్థిత్వాన్ని వినిపించిన మేధావి
ఎడారైన జీవితాల్లో వెలుగులు నింపడానికి
పలువరించిన మానవతావాది
వలసవాదుల పాలనలో సాగుతున్న
వివక్షను నిరసిస్తూ
ఉద్యమానికి ఊతమైనాడు
నిరంతరం ముందు నడిచాడు
దీపమై దారిచూపినాడు
ఉద్యమ కిరణాలను ప్రసరింపజేసినాడు
జనుల హృదయాల్లో కొండంత దైవమైనాడు
తాను ఎగురుతున్న పాలపిట్టై
కంచంలో మెతుకై
బతుకు దారి తీసిన మహనీయుడైనాడు

-కొమురయ్య బాలసాని (మధురశ్రీ)
9912657877

## తెలంగాణ అస్తిత్వ బావుట

నూనూగు మీసాల
నూతన యవ్వనంలోనే
సమైక్యవాదుల కుట్రల పసిగట్టి
విశాలాంధ్ర డొల్లతనాన్ని బయటపెట్టిండు
పోరాటానికి సై యంటూ పోరుకేకగా మారిండు
నాన్ ముల్కీ, ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ ఉద్యమ
నినాదమై
ఆధిపత్య భావజాలాన్ని ప్రశ్నించిండు
పల్లె పల్లెన పల్లెర్లు ఎందుకు మొలుస్తున్నాయో
పాలమూరు వలసెల్లిపోవడానికి కల
కారణమేంటో
వివరించి చెప్పిండు
దగాపడ్డ తెలంగాణ దీనత్వాన్ని
అక్షరాల్లోకి ఒంపి చూపించిండు
తెలంగాణ అస్తిత్వ బావుటాయై
దిశానిర్దేశం చేసిండు
యాచకదశ నుండి శాసించే దశకు
పురోగమించాలని ప్రబోధించిండు
తల్లి తెలంగాణ విముక్తికై
జీవితమంతా ఉద్యమగానమై ప్రవహించిండు
శ్వాస ధ్యాస అంతా తెలంగాణమై జీవించిండు
తెలంగాణ జాతిపితగా
గుండెగుండెలో కొలువై నిలిచిండు

-డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య
9704731346

## జయకేతనం!

జీవితమంతా ఏకైక ఎజెండా
జీవనపర్యంతం కడుపు నిండా!
వలసవాద వ్యతిరిక్త వకాల్తా
విరామమేతప్ప విరమణ లేదన్న అభిమత ప్రవక్త!!

ఉమ్మడిరాష్ట్ర ప్రతిపాదనలో అమ్మతనంలేదని
ఉల్లంఘించిన ఉత్తర్వులను ఉటంకించిండు!
భిన్న చారిత్రకనేపథ్యాల!విభిన్నసామాజికపరిణామాలు
భావసమైక్యత లేకుండా!
భాష ఒకటే కలిపి ఉంచదని ఉద్ఘాటించిండు!!

ఉద్యమం ఉప్పెనలా ఉవ్వెత్తున ఎగసినపుడు
విద్రోహం ఉన్మత్తంగ వికటాట్టహాసం చేసినపుడు!
ఉద్ధృత పునర్నిర్మాణానికి పునాది వేసిండు
సుదీర్ఘ ప్రస్థానానికి మార్గం సుగమం చేసిండు!!

నిధులు నీళ్లు నియామకాలు
యాచించి కాదు! శాసించి సాధించుమన్నడు
స్ట్రీట్ ఫైట్లు కాదు!స్టేట్ ఫైట్లే
ఆరెస్యూనుంచి ఆరెస్సెస్ దాకా సమన్వయించిండు!

వ్యావహారికం తౌరక్యాంధ్రమని
వేరుకాపురం తెలుగుకు తెగులని
దక్షిణ పాకిస్థానుగ దాపురించునన్న!
విదూషకులకు విలస్లకు విడమర్చిచెప్పిండు
ఈట్ కా జవాబ్ పత్తర్ సే ఇచ్చిండు!!

ఒక మహోద్యమాన్ని మొక్కవోనిదీక్షతో
సిద్ధాంతాన్ని జతపరచిన ఆచరణతో
ఒక తాత్విక భూమికను ఏర్పరచి
జయకేతనాన్ని ఎగరేసిన యుగపురుషుడు!

కల్లోల కాన్వాసుపై గీసిన గ్వెర్నికా కుడ్యచిత్రం!
కలల కనురెప్పల్లో దాగిన తెలంగాణ స్వర్ణపత్రం!!



-కరిపె రాజ్ కుమార్
8125144729

## జయశంకరా ! జయము ! జయము !

సీ. కొత్తపల్లివంశయుత్తమగుణశీలి
జయశంకరాచార్యజయమునీకు
ఆచార్యునిగసేవలత్యుత్తముగజేసి
విద్యార్థిలోకానవెల్గినావు
పలుపొత్తములు,గొప్పవిలువైనవ్యాసాలు
వెలయించియిలపైననిలిపినావు
మననీళ్లు,నిధులన్ని ,మనకొల్వులన్నియు
మనకుదక్కాలన్నమాన్యుడీవు

తే.గీ. భవ్యతెలంగాణాశించివసుధయందు
భావజాలంబునొసగినసేవకుడవు
నిలిపినావయ్యకీర్తినినిండుగాను
మురిసెతెలంగాణమిమునుగాంచిముచ్చటగను!!!

సీ. సూటిగామాట్లాడిధీటుగాప్రశ్నించి
పెత్తనదారులమత్తుదులిపె
ఉన్నతపదవులమిన్నగాచేపట్టి
వన్నెలుచేకూర్చెభాసురముగ
ఉద్యమంబుకుతానునుత్సాహమందించి
నడిపించెముందుకునమ్మకముగ
వాసిగాతెలంగాణవైభవమ్మునుగూర్చి
కలగన్నసిద్ధాంతకర్తతాను

తే.గీ. వెతలుదీర్చియుతెలంగాణహితముకోరి
ఉద్యమించినసూరీడుసుర్వియందు
త్యాగశీలియైయలరారెధన్యజీవి
జయముజయశంకరాచార్యజాతినేత!!!"

-కట్టరంజిత్ కుమార్
6300474467

## తెలంగాణ బుద్ధుడు

తెలంగాణ పొద్దుల్లో
ఉదయించిన సూర్యుడు
ఉవ్వెత్తున ఎగసి పడ్డ
ఉద్యమ కెరటమై
తెలంగాణను శ్వాసించి
స్వప్నించిన జాతిపిత

మలిదశ పోరాటానికి
అహర్నిశలు శ్రమించి
కార్య దీక్ష బూనిన కార్యశూరుడు
ఆధిపత్య దోపిడీని
ఎదిరించిన ఉద్యమ పిత

ఉదాత్తమైన వ్యక్తిత్వం
ఉన్నతమైన స్థితి ప్రజ్ఞత
నిబద్ధతకు ప్రతీక
నిజాయితీకి ప్రతిబింబం
క్రమశిక్షణకు మారుపేరు
మన జయశంకర్ సారు
తెలంగాణ యువతరాన్ని
నిర్దేశించిన ఆనవాలు

ఆత్మవిశ్వాసాన్ని అందించి
అడుగులేసిన ఆశయాలు
అలుపెరుగని వీరుడు
తెలంగాణ బుద్ధుడు
జయశంకర్ నిబద్ధుడు
మృదుస్వభావుడు

వ్యూహాలేన్నో రచించిన సిద్ధాంత కర్త
జయశంకర్ సారు విజ్ఞాన మేధస్సు
ఉద్యమ తేజస్సును చైతన్య పరిచి
ఉరకలెత్తిన హోరు

జీవితంలో ఒకే మార్గంలో
నడిచిన మార్గదర్శి
సాహిత్య విమర్శ లెన్నో చేసిన సవ్యసాచి
మానవతావాదిగా మహోన్నతడై
తెలంగాణ రాష్ట్ర సాధనకు జీవితం
అంకితం ఇచ్చిన త్యాగశీలి
తెలంగాణ జాతిపిత జయశంకర్ సారు
అందుకో మా జోత అక్షర నీరాజనాలు

-నెల్లుట్ల సునీత
7989460657

## భావదీప్తి ప్రభాసుడు

తెలంగాణ స్వేచ్ఛా స్వప్నం కోసం
అహర్నిశలూ దశాబ్దాలుగా
ఉద్యమ భావవ్యాప్తిని ధర్నాలతో మేధావులతో
యాసల పలుకు బళ్ళతో...
తొలదశ మలిదశ
తెలంగాణ గోడుగా
నాల్గుకోట్ల గుండెచప్పుల్ల
ఆర్తనాదాలను
ఆత్మాభిమానంగా అక్షరీకరించిన
వొడవని ముచ్చట్లు
తెలంగాణదోపిడీ దౌర్జన్యాలను
అరటిపండొలిచినట్లుగా
ప్రసంగాలతో భావుకతను
కలంతో అక్షరజ్యోతుల్ని వెలిగించిన
కవనాలు ఎన్నెన్నో...!
ఆంధ్ర పెత్తనాన్ని ఎదురించే గుండెధైర్యాన్ని,
ఓరుగల్లు పౌరుషాన్ని
సుగుణసంపత్తిగా
జనాల గుండెలకెక్కించిన గుణనిధీ
మనుషుల అంతరాలను తుంచి
ఆత్మీయతా భావాన్ని పంచిన
ఆదిత్య హృదయుడు ...!

ఆశయంగా,ఆస్థిత్వంగా,
భాష యాస సంస్కృతీ తాపసిగా
భావితరాల పరిరక్షణే
తమ బాధ్యతాలాపనగా..!
మనసున్నోడు
మానవత్వాన్ని తొడుక్కున్నోడు..

అధరాల సుధా రసమంతా
యావగా జావగా
ఆత్మీయంగా పంచినఅనితరసాధ్యుడు
అణువణువునా
తెలంగాణ యాస వెన్నెలను కురిపించిన
భీష్మ పితామహుడు...!

తెలంగాణ జాతిపితై
ప్రతి గుండెగూటిలో కొలువైన మృదుస్వభావి
అరశతాబ్దంగా ఉద్యమాన్ని
కర్త కర్మ క్రియా సమన్వయంగా
సమున్నతంగా సాగించిన
ధీరోదాత్తుడు...!

ఉద్యమ కూర్పులో, రూపంలో ,అభివ్యక్తిలో,
రామసక్కదనాల తెలంగాణ పదావళిని
దొర్లించి పొర్లించిన ప్రొఫెసర్ గారు
కొత్తపల్లి జయశంకర్ సారు...!

కీర్తికోసం పదవులు కోరని
నిష్కళంక నిస్వార్థహృదయుడు.
పదవులకోసం పాచికలేయని
భావదీప్తి ప్రభాసుడు...!



-డా.పాండాలమహేశ్వర్
9912180054,
7981737830

## తెలంగాణా ఈశ్వరుడు మా జయశంకరుడు

తెలంగాణా వీరుడా
మా జయశంకరుడా
రాష్ట్రంలో తెలంగాణా
ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా
తెలంగాణా తల్లి బాధను తీర్చనీకి
నీ జీవితాన్ని వీర తెలంగాణాకు అంకితమిచ్చి
ప్రజలలో చైతన్యం నింపి
ఉద్యమ బాటలో నడవాలని
అగ్నికనికళ రగులుతూ
అన్యాయాన్ని సహించబోమని
అనుకున్నది సాదించితీరుతామని
ఉద్యమలలో ప్రసంగాన్ని విసిరి
ఢిల్లీ నుండి గల్లీ దాకా
తెలంగాణకు జరిగిన ఘోరాన్ని వివరించి
మన నీళ్లు మనకు రావాలని
మన నిధులు మనకు రావాలని
మన ఉద్యోగాలు మనకొస్తాయని
ఊరూరా గర్జించి ఉద్యమ బాటలో నడవాలని
చాటిచెప్పిన
మా తెలంగాణకి భగవంతుడు పంపిన మరో
దైవం
మా జయశంకరుడు
మీరు మాకు మరో ఈశ్వరుడు

-గజరాజ మధు
9573033581

## మార్గనిర్దేశకుడు

నిద్రావస్తలో వెనకబడిన అమాయక
మూగబోయిన తెలంగాణ వీణకు
పరిశోధన, పరిశీలన,పరిరక్షణ తీగలను సవరించి
ఆలోచనా రాగాలు మీటిన మేళకర్త.
పొద్దుపొడుపుకు పోరును జోడించి
జనులను జాగ్రద మొనరించి
పల్లె ప్రజల గుండెల్లో తెలంగాణ
ఉద్యమ బాటలు పరిచిన మార్గ నిర్దేశకుడు.

నీళ్ళు, నిధులు, నియామకాల అక్రమాలను
దర్పణమై చూపిన
అపర భీష్ముడు మన జయ శంకరుడు.
తెలంగాణ భాషకు, యాసకు పాటై, పల్లవై
మేధావుల మెదళ్ళకు పదునైన
ఉద్యమ గళమైన మేధావి.

విద్యార్థిదశ నుండే
"ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ " లో గర్జించి,
"నాన్ ముల్కీ" ఉద్యమస్ఫూర్తిని
ఉప్పెనలా ఎలుగెత్తి దేశమంతట
నింపిన చైతన్యం.

ఉద్యోగ ఉపాధ్యాయుల మెదళ్ళ పదునై
ఉద్యమ గళాన, కలాన విరబూసిన
అక్షర వనాన తొలి కి'రణ'మై
మా నాదాల ఢమరుక తరంగమై
ప్రతిఫలించిన జాతిపిత.
నేటి బంగారు తెలంగాణకు తొలిపొద్దు పొడుపు

-అద్దంకి తిరుమల వాణిశ్రీ
9949125250

## తెలంగాణ వేగుజుక్క

తెలంగాణ పేరుకు
ఉద్యమాల యేరుకు
వందనాలు! కొత్తపల్లి
జయశంకర్ సారుకు!

అసమానత నణచుటకు
రాష్ట్రము సాధించుటకు
జయశంకర్ తపించెను
జనులు వృద్ధి జెందుటకు!

తెలంగాణ సిద్ధాంతం
మంచిచెడుల రాద్ధాంతం
జయశంకర్ కలలనుండి
జన్మించిన వేదాంతం!

హెచ్చుతగ్గు లెరిగినాడు
పోరును నడిపించినాడు
ప్రత్యేక రాష్ట్రముకై
జీవిత మర్పించినాడు!

అవమానం బొందినాడు
ఆంధ్రుల నెదిరించినాడు
"తెలంగాణ జాతిపిత"గ
చరిత్రలో నిలిసెనేడు!



-వడిచర్ల సత్యం
7989511543

## తెలంగాణ తొలి ఉద్యమ కర్త

తొలి తరానికి
దిక్సూచి
భావి తరానికి
మార్గదర్శకుడు

తెలంగాణ తొలి
ఉద్యమకర్త
రాష్ట్ర సమితి
సిద్ధాంత కర్త

ఇడ్లీ,సాంబార్
గోబ్యాక్ నినాదం
ఎస్సార్సి ముందు
తెలంగాణ వాణి

ఉద్యమమే ఊపిరిగా
జీవనం
అరవై ఏళ్ల ఆకాంక్ష
తీర్చే కారణం

అన్యాయం, దోపిడీలపై
పోరాటం
రాష్ట్ర విలీనానికి
వ్యతిరేఖంగా గళం

యాచక దశ నుండి
యాస కొరకై
ఖండానీతరాలలో
వినిపించిన నైజం

-హరీష్.తాటి
9553152939

## ఉద్యమ స్ఫూర్తి ప్రదాత

నిరంతరకృషి,దృఢసంకల్ప సాధనతో..
అధ్యాపకుడిగా వృత్తి జీవితాన..
విద్యావిలువలను బోధనలుగా నేర్పి..
విద్యార్థి భవితకు మెరుగులు దిద్ది..
హృదయాన నిలిచారు మన కొత్తపల్లి వారు..
ప్రత్యేక రాష్ట్ర సాధనకై అడుగిడి..
అవరోధాలెన్నెదురైనా అదరక బెదరక..
అహర్నిశలు సాగించిన మీ పోరాటం..
అనిర్వచనీయం.. అనన్యసామాన్యం..
తెలంగాణా సాధనే కాంక్షగా రగిల్చి..
సమర నినాదాన్ని పూరించి..
ఆవేశంగాదనక ఆలోచన ముఖ్యమని..
అణువణువు సాగి,అన్నింట ముందుండి..
నూరి పోసిరి ఉద్యమ భావాలు..
రగుల్కొల్పగసైతం పల్లెటూరిమార్గాలు..
ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా..
ఉవ్వెత్తునకెగసేలా మీ తీరులు..
గల్లీ నుండి ఢిల్లీకి పాకినవి..
తెలంగాణ ఆగ్రహ జ్వాలలు..
దిక్సూచి వలె నడయాడిన యానేల..
వన్నెలీనుతుంది నేడు..
దశబ్దాల కల నేడు సాకారమవ్వగ..
బతుకులన్నీ మార్చుతూ..
బంగారు తెలంగాణ నిర్మాణముకు..
భావి జీవితాన అభివృద్ధి బాటలకు..
మీరు లేని ఉద్యమం ఊహించలేము..
తెలంగాణలో మీపాత్ర మరువజాలము..

-బడిగించల అంపయ్య
6305543724

## ఉద్యమాల నేత

వరంగల్లో పుట్టాడు
అన్య భాషలు నేర్చాడు
పోరాటమెంతో చేసి
తెలంగాణ తెచ్చినాడు!

విద్యాబుద్ధులు నేర్పెను
ఉద్యమాలు నడిపించెను
కష్టాలెన్ని ఎదురైన
తెలంగాణ కై బ్రతికెను!

విశాలాంధ్ర ఎండగట్టి
ఉద్యమాల బాట పట్టి
వీరుడై నిలిచెనురా
తెలంగాణ తెచ్చి పెట్టి!

ఉద్యమాల నేతగాను
తెలంగాణ భీష్ముడిగాను
చిరకాలం నిలుచునురా
ప్రజలలో దేవుడిగాను!

ఎన్నెన్ని మార్గాలో
నవ్య రాష్ట్ర స్వప్నంలో
జయశంకర్ ముందుండెను
తెలంగాణ వాదనలో!

-కే.ఆనంద్
628147153

## గీతం

ఇదే ఇదే జయశంకరు కీర్తి పతాక!
"సాకి:
కొత్తపల్లి జయశంకరు ఆర్తి తెలంగాణ!
కోరుకున్న కోర్కె ఒకటే నవ్య తెలంగాణ!!

పల్లవి: ఇదే ఇదే జయశంకరు కీర్తి పతాక!
పదే పదే పాడుకొనే స్ఫూర్తి గీతిక! ॥ఇదే॥

చరణం 1:
తెలంగాణ పాటకు జయశంకరు పల్లవి
ప్రతిపల్లె-పట్టణ ప్రగతికి అనుపల్లవి
నీళ్ళు..నిధులు..నియామకాలు
నిరుద్యోగ పరిష్కార మార్గాలు ॥ఇదే॥

""తెరాస"" ఏర్పాటులో మూలపురుషుడు
తెలంగాణ సాధనలో సమరయోధుడు
కేసీయార్ తోడు నీడ సలహాదారు
ఆచార్య కొత్తపల్లి జయశంకరు సారు ?? ॥ఇదే॥
రాజ్యాంగ హక్కులతో నినాదాలు చేయించే
ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసనలూ చేయించే
బోనాలు చేయించే బతుకమ్మల ఆడించే
సబ్బండ వర్గాల సేనానియై సమరమే చేయించే ॥ఇదే॥
ఆజన్మ బ్రహ్మచారి ఆశలేవి లేనివాడు
అనుదినమూ తెలంగాణ ధ్యాస ఉన్నవాడు
""కాకతీయ విశ్వవిద్యాలయ"" ఉపకులపతి
యార్ గా దిల్ దార్ గా కేసీయార్ సోపతి ॥ఇదే॥

""విశాలాంధ్ర"" ప్రతిపాదన నిరసించేను నాడే
తొలి తెలంగాణ పోరులో ఉద్యమించినోడే
తెలంగాణ కోణములో రచనలే చేసినాడు
పల్లెప్రగతి వెల్లివిరియ ప్రణాళికే రాసినాడు ॥ఇదే॥

జయశంకరు కదలగా కుటిల గుండెలదరగా
కుట్రదారు బెదరగా కుతంత్రాలు చెదరగా
కదిలిందీ కదిలిందీ జయశంకరు జనసైన్యం
ఆహుతైన అమరుల ప్రతి జన్మ ధన్యం ॥ఇదే॥

ఊరూరా తిరిగినాడు ఉత్తేజ పరిచినాడు
ఉద్యమరథసారథిగా రణరథం నడిపినాడు
ధర్మపురి నరసింహుడు ధైర్యం రగిలించగా
బాసరలో చదువులమ్మ బాసటగా నిలువగా
మేటి దండయాత్రలా నాటి ""దండి"" యాత్రలా
శాసనధిక్కారములో నాటి గాంధీ పాత్రలా ॥ఇదే॥
(వచనం: తెలంగాణ సాకారమయ్యాక బంగారు
తెలంగాణ సాధించడానికి.....)
గొలుసు చెరువు ఉద్ధరించ గుర్తు చేసినాడు
అమరవీరులందరినీ ఆదుకొమ్మన్నాడు
నిరుద్యోగరక్కసి రెక్క నరకమన్నాడు
నిరుపేదల బతుకుల్లో వెలుగు నింపమన్నాడు ??
ఇదే ??

-'జనశ్రీ" కుడికాల జనార్ధన్
హన్మకొండ, వరంగల్ అర్బన్ జిల్లా

## నిత్యచైతన్యశీలి

సీస పద్యం:
తెలంగాణమందున తెగువగల యువ కి
షోరమై జన్మించె శోభితుండు
ఉన్నత విద్యలనొనరుగా చదివి తా
నాచార్యపీఠంబు నందుకొనియె
విద్యార్థి దశయందు నుద్యమ కెరటమై
నాయకత్వమునొంది నడుపుచుండె
తెలంగాణము కొరకు నలుపెరుగక నిల్చి
ముమ్మారు పోరాడ ముందునిలిచె

తే॥సహన స్థిరచిత్త సిద్ధాంత లక్షణుండు
మార్గనిర్దేశమొసగిన మాన్యుడితడు
ప్రజల పక్షాన నిలిచిన ప్రముఖుడితడు
సాధు సచ్ఛీలవంతుడీ సజ్జనుండు
సీసమాలిక:
తెలంగాణ ముక్తికై తెగువతో పోరాడె
ధీశాలురును మెచ్చు ధీరుడితడు
స్వాతంత్ర్య తెలంగాణ సాధింప బూనుచు
సమరశంఖమునూదె సాహసికుడు
ప్రత్యేక రాష్ట్రంబు ప్రాదుగొల్పగనెంచి
సిద్ధాంతమునుకూర్చె శ్రేష్ఠుడితడు
పరులపాలనజూచి పౌరుషపాత్రుడై
ఉద్యమ కెరటమై యుండెనితడు
కార్యదక్షతకల్గి కర్మసాక్షిగనిల్చి
వీరుడై పోరాడె విజయుడితడు
ఉద్యమనేతయై యుదయించె సూర్యుడై
బంగారు తెలంగాణ భాగ్యమితడు
నీతినిజాయితీ నియమవర్తనతోడ
ఆదర్శుడైనిల్చెనవనికితడు
జైతెలంగాణ జైజైతెలంగాణమున్
నినదించిముందర నిలిచెనితడు

తే.గీ.
లక్ష్యసాధన విడువని లౌక్యుడితడు
నిత్య చైతన్యశీలుడై నిలిచెనితడు
కీర్తినొందిన సజ్జన కేసరితడు
మనదు జయశంకరునిజన్మ దినమునేడు""

-గుడేలి రమేశ్
9490005435

(మిగతా 6వ పేజీలో..)

(5వ పేజీ తరువాయి..)

## ఉద్యమ స్ఫూర్తి

దారి తెన్నులేక తన్లాడే
తెలంగాణ ప్రజలపాలిట దిక్కూచి-
స్వరాష్ట్ర సాధనే ఆశగా శ్వాసగా
ఉద్యమ భావ జాలాన్ని
గుండె గుండెలో నింపిన చైతన్య స్ఫూర్తి
పల్లె పల్లెను వాడ వాడను ఏకం చేసి
ప్రజల పక్షాన ప్రశ్నించే సైద్ధాంతిక గొంతుక
దశాబ్దాలుగా జరుగు తున్న వివక్షను
విడమర్చి చెప్పిన అక్షర హాలికుడు
తొలి - మలి దిశ ఉద్యమాలకు వారధి
స్వరాష్ట్రం కోసం వేసిన ప్రతి కమిషన్ కు ప్రత్యక్ష సాక్షి
వి.సి గా విశ్వ విద్యాలయ సంస్క రణకు పెద్దపీఠ వేసిన విద్యావేత్త.
ఆత్మగౌరవపోరును విజయ తీరాలకు చేరువ చేసారు-
పునాది రాళ్లెన్నడు సుందర భవనాన్ని చూడ లేనట్లే
తెలంగాణ కల సాకారం కాకుండానే
కలగంటునే సెలవంటూ వెళ్ళిన
తెలంగాణ పితా మహుడికి
అందిస్తున్నది యావత్ జాతి హృదయ పూర్వక నివాళి

**-డాక్టర్ దాసోజు పద్మావతి**
9441286794

## తెలంగాణ పితామహుడు

అతడు...!
తెలంగాణ చెఱువు మానస సరోవర హృదయ స్పందనల అస్తిత్వం
అలుగు దుంకి పరవళ్ళు తొక్కే మాటల తన్మయత్వ తరంగం
తెలంగాణను స్వప్నించి శ్వాసించిన మహోపాధ్యాయ ఉషోదయం...!
అతడు...!
మంచిగా బతకలేకున్నా బిచ్చమెత్తుకోనైనా బతుకుతమని
ఆంధ్ర వాళ్ళతో కలిసి ఉండమని ఫజల్ ఆలీ తో వాదించిన కార్యవాది
ఉవ్వెత్తున ఎగిసిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి సారథి
నీతి, నిజాయితీ,నిరాడంబరత,నిబద్ధత,సమయపాలనల కలబోత వారధి...!
అతడు...!
పొట్ట పోసుకోవడానికి వచ్చే వారిని కడుపులో పెట్టుకొని చూడాలంటూ
పొట్ట గొట్టే వాళ్ళ మీదే మన వ్యతిరేకమన్న కాళన్న సూత్రాన్ని బలపరిచిన మానవతా వాది
జీవితాంతం తన ఆశయ సాధన కోసం బ్రహ్మచారి అయిన త్యాగనిధి
సహనం, స్థిరచిత్తం,సిద్ధాంత సమ్మేళనాల సుగుణాలనిధి...!
అతడు...!
నేను జీవితంలో కన్న కల ఒకే ఒక కల
అదే తెలంగాణ రాష్ట్రం ఒక్కటే నా కల
అది నెరవేరి నా కల సాకారం అవుతుందన్న ఆశావాది
మలిదశ తెలంగాణ ఉద్యమ పోరు బాట పునాది...!
అతడు...!
ఆంధ్ర వలస పాపాలను రాసి పెట్టిన చిత్రగుప్తుడు
అధిపత్య శక్తులపై శివమెత్తిన శంకరుడు
తన వ్యూహాలను అమలు పరిచిన తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త
అతనే...తెలంగాణ పితామహుడు లక్ష్మీకాంతారావు,
మహాలక్ష్మి ల ముద్దు బిడ్డ జయశంకర్ సారు...!

**-కొంపెల్లి రామయ్య**
7032504646




## తెలంగాణ తొవ్వ

చెరువునీలను,
వాడుకున్నోలు మరువచ్చు.
చెరువెట్లమరుస్తది.

పిల్లలు,
కన్నోలను మరవచ్చు.
తల్లులెట్లమరుస్తరు.

తొవ్వేసినవారిని,
నడిచేవారు మరవచ్చు.
తొవ్వెట్ల మరుస్తది.

అవును సారూ
రాలున్నా ముల్లున్నా
తేలున్నా పాములున్నా
నీవు చూపిన తొవ్వలో నడ్చినం
కలోగంజోతాగి కల్సినడ్చినం
నడ్తున్నంతసేపు వెన్కమల్లిజూలే

జెండాలమై
ఉద్యమానికి ఊపిరూదినం
పిడికిలమై
పోరుబాట పట్టినం
తెలంగాణ నినాదమై
తెగదెంపుజేసినం

ప్రత్యేక తెలంగాణను
పట్టుబట్టి సాధించినం
నీవు కలలుగన్న
తెలంగాణను
సాకారం చేసినం.

సారూ..నీవిప్పుడు
మా గుండె చప్పుడైనవు
నాలుగున్నర కోట్ల ప్రజల
నాల్కవైనవు
తెలంగాణ జెండావైనవు
పాలపిట్ట రెక్కల చప్పుడైనవు
చెరువుల మత్తడైనవు
జై తెలంగాణ

నినాదమైనవు
ఇప్పుడు చెప్పు సారూ
తెలంగాణకు తొవ్వజూపిన
నిన్నెట్ల మరవమంటవు.

**-డా॥గుడేలి శీను**
995 9954848

## జయ జయ జయ శంకరా

జయ జయ జయ శంకరా
జయ జయ కరుణాకరా
నీదు మది కోవెలలో
తెలంగాణ ఆత్మగౌరవ పోరాటాల బాట
జయ జయ జయ శంకరా
జయ జయ కరుణాకరా

ఏనాడైనా కాలంలోనైనా తగ్గింది లేదు
తెలంగాణ సాధనే ఆశయమై నడిచాను
ఆశయాల సాధనకు జీవితాన్ని ఇచ్చావు
తెలంగాణ తల్లి పేగువై కదిలావు
జయ జయ జయ శంకరా
జయ జయ కరుణాకరా.

నీ జిందగీనే ఆత్మగౌరవ యాత్ర
అదే మాకు నడుస్తున్న చరిత్ర
విత్తనం నీవై మహా సంగ్రామం నడిపావు
ఓటమి ఎరుగని రీతిలో పోరు చేసి చూపావు
జయ జయ జయ శంకరా
జయ జయ కరుణాకరా

మీ మాటల్లో సారుప్యత
మీరు తొలగించాలనే అసమానత
ప్రతిబింబిస్తే ఎంత బాగుంటుందో
ఎదురు చూస్తున్నాం తండ్రీ
జయ జయ జయ శంకరా
జయ జయ కరుణాకరా

అధికార అహంకారాలతో
కబ్జాలకు గొడుగు పడుతూ
హింసకు తెరలేపుతున్నరు
కక్షల కాంక్షల్లో రగిలిపోతున్నరు

మీరు నుడివిన మాటలు
అమృత ధారలై కురుస్తున్నవి
మలయ మారుతాలై వీస్తున్నవి
తెలంగాణ నిను మరువదు
జయ జయ జయ శంకరా
జయ జయ కరుణాకరా

ప్రాంతేతర ముప్పులు తిప్పలు పెడుతున్నవి
మనవాళ్ళే వాళ్ళకు నిచ్చెనలేస్తున్నరు
నిర్లజ్జగా తెగిస్తున్నరు
నిజాయితీ పారేస్తున్నరు
జయ జయ జయ శంకరా
జయ జయ కరుణాకరా

తెలంగాణ బాపూజీ
మా సిద్ధాంత గురూజీ
నీ బాటలోనే నడిచే బలమివ్వూ
కష్టాలైనా నీతికి నిలబడే వరమివ్వూ



**-ఏదెల్లి రాములు**
9494800454

## తెలంగాణ స్వాప్నికుడు

నలుబది వసంతాల సుసుధీర్ఘ ప్రసవవేదన
నలుదిశలా క్రమ్మిన కారుచీకటి
కపట హృదయాల కబంధహస్తాల
కౌగిలిలో నలుగుతున్న తరుణాన
చీకట్లను చీల్చుకుంటూ
ఒ కాంతిరేఖ తలుక్కున మెరిసింది
దిక్కుతోచని బతుకులకు దివిటీలా
దారి తెలియని ప్రయాణానికి మార్గంలా
అపోహల అడ్డుగోడలకు ద్వారంలా
కుట్రల వంతెన కూల్చే యంత్రంలా
ఉదయించిన భాస్కరుడు జయశంకరుడు
తెలంగాణ బిడ్డ పురుడు పోసుకున్ననాటి నుండి
నూరుతున్న కత్తులు, పేనుతున్న తాళ్లు
బయటపడితే కుత్తుక తెగ్గోయాలని
కంసుడిలా అవకాశం కోసం
ఆబగా ఎదురు చూస్తున్న పరాయి పాలనం
ఆశలను చిదిమేసి ఆయువుపోసిన
జయశంకరుడి మేధోపాయం
తెలంగాణ కోసం పెళ్లిని త్యాగం చేసి
అభినవ భీష్ముడిగా శపథం పూని
ఊహ తెలియనప్పుడే ఉప్పెనలా జైకొట్టి
ఊహకందని స్వప్నాన్ని ఓరిమితో ఒడిసిపట్టి
పరాయోడి తప్పులను కృష్ణుడిలా లెక్కగట్టి
శిశుపాలుడి వధలా జయచక్రం ఎక్కుబెట్టి
నయవంచకుల నాలుకలను తెగ్గొట్టి
విశాలాంధ్ర అన్నోడి మోసాలను పసిగట్టి
గల్లి నుంచి ఢిల్లి దాక నినాదాన్ని వినిపించి
తెలంగాణ ఆకాంక్ష సబబేనని మెప్పించి
ప్రత్యేక రాష్ట్రానికి తొవ్వనీవు చూపించి
జీవితాన్ని తెలంగాణ సాధనకై అర్పించి
స్వరాష్ట్ర సాధన నెరవేరే తరుణాన
దివికేగిన స్వాప్నికుడా !
మరువము నీ త్యాగం మహాత్మా వందనం
మి ఆశయాల సాధనే మాకు మరో లక్ష్యం

**- కె.హన్మాండ్లు**
9550438418

## జయశీలుడు - జయశంకరుడు

ఉద్యమకారుడై
గురువుగా మార్గదర్శకుడై
వృత్తిపట్ల నియమ నిబద్ధుడై
ఉద్యమానికి ఊపిరోసిన జయుడు
ఉత్తమ నేత జయశంకరుడు.

ప్రత్యేక రాష్ట్రం కావాలనే కలను
తన కలంతో కదన రంగంలో
కొత్త పుంతలు తొక్కించి
వాదాన్ని నాదంగా వినిపించిన
మహోద్యమ సారథుడు.

తెలంగాణ ప్రజల భాగ్యవిధాతై
బ్రహ్మచారుడై దీక్షాదక్షుడై
జీవన స్ఫూర్తి ప్రదాతుడై
జీవితాన్ని అంకితార్పణము
చేసిన త్యాగశీలుడు.

చిత్తశుద్ధుడై చైతన్యదీప్తుడై
ముల్కీవిధాన వ్యతిరేకుడై
ఎస్సార్సీ కమిషన్ ను కదిలించిన
ధీరుడు సిద్ధాంతవాదుడు
తెలంగాణ పితామహుడు

**-శ్రీమతి కల్పన దేవసాని**
9959270063

## తెలంగాణ నిప్పు కణం

కణ కణాన తెలంగాణ
నరనరాన కన్న కలల వీణ
మనసులోన గూడు గట్టిన
సొంత రాష్ట్ర సాధన ఆరాటం
ఒక్కో ఇటుకా పేర్చి కోటగట్టిన పోరాటం
ఆశయమే ఊపిరిగా ,
సిద్ధాంతం గుండె లయగా
పోతపోసిన నిండైన శిల్పం
జయశంకర్ రూపం .

మన నీళ్ళు మనదాహం తీర్చాలని
నేలతల్లి కడుపు నిండి
సస్యశ్యామలఫలమివ్వాలని
విద్యా, వైద్యం ప్రతి మనిషికి
వరమై కోరకనే అందాలని
బంగారు తెలంగాణ జీవన ధ్యేయంగా
జీవితాన్నే అంకితం చేసిన
త్యాగమూర్తి జయశంకర్.

యాచకులం కాదంటూ
శాసకులం కావాలంటూ
పోరాటాగ్నిని రగిల్చిన నిప్పు కణం
దావాగ్నిలా మారి చేసింది భీకర రణం
కల సాకారమైన ఆనంద క్షణం
దివిజుడై చేసింది గురు జయశంకర్ ఆత్మ
రాష్ట్ర ఆవిర్భావ సంబరాల వీక్షణం.
నాల్గు కోట్ల తెలంగాణ ప్రజల మనసుల్లో
అతని ఉనికి కలకాలం అమరం.



**-సౌదరి మోహన్ గౌడ్**
9440464503

## తెలంగాణా - రూప చిత్రలేఖకుడు

ఉన్నతోన్నత గుణ సంపన్నుడు
అద్వితీయ విద్యా వినయ శంకరుడు
రాష్ట్ర సాధనలో వ్యూహకర్త
బహువిధానాల ఆవిష్కర్త
తెలంగాణా వ్యవస్థకు మూలకర్త
తల్లడిల్లుతున్న తెలంగాణా- అంటూ
ఉద్యమ భావజాల పతంగుడు
పోరాట కార్యవాది
స్వప్న సాధకుడు
రాష్ట్ర సాకార చైతన్య భానుడు
తెలంగాణా రథసారథి
సత్య సమ్మత సిద్ధాంతాల వారధి
లక్ష్య సాధనలో అలుపెరుగని శూరుడు
శాంతికాముకుడు ఉద్యమ ధురీణుడు
పురోభివృద్ధి దిశా నిర్దేశకుడు
బ్రహ్మచారి యైన మానవతావాది
ఉత్తమోత్తమ జ్ఞానసాగరుడు
తెలంగాణ రూప చిత్రలేఖకుడు
ఆ సంబరాలు ఓ జ్ఞాపకం- అన్న
నవ తెలంగాణ దార్శనికుడు
సాహితీ తెలంగాణ సార్వభౌముడు
ప్రజల ఆకాంక్షప్రతిఫలింపజేసిన
తెలంగాణ జాతిపిత శాంతిదూత
కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి ప్రదాత

**-దామెర్ల నరసింహ రావు**
9885660972

## నిత్య స్వాప్నికుడు..

తెలంగాణ జాతిపిత మన జయ శంకరుడు
తెలంగాణ ఉద్యమానికి ఆచార్యులు
తెలంగాణ తొలి పొద్దును కళ్లారా చూడాలని
కలలు గన్న నిత్య స్వాప్నికుడు..
విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి,
వారి జీవితానికి బాటలు వేసిన మార్గదర్శి..
గల్లీ నుండి ఢిల్లీ దాంక ఉద్యమాలే ఊపిరిగా
విశాలాంధ్రను ఎండగట్టిన ధీశాలి..
గాలి పీల్చినా, నీళ్లు తాగినా, బువ్వ తిన్నా,
తెలంగాణ ఊసు లేనిదే గొంతు దిగేది కాదు..
పల్లె పల్లెకు తన మాటల గుత్ప లందించిన ఉద్యమకారుడు..
తెలంగాణ అంతా ఆయనకు కొట్టిన పిండే
ఆయన తిరగని చోటు లేదు.. చెప్పని సత్యం లేదు..
తెలంగాణ రణ నినాదాన్ని విశ్వ వేదికలపై
శంఖం పూరించిన అపర భీష్ముడు..
తెలంగాణ కోసం అసువులు బాసిన అమరవీరుల
శవాలపై ప్రయాణం చేసిన రాజకీయ నాయకులకు
పుట్టగతులుండవని శపించిన విశ్వ కర్మ...
యాచక బతుకులొద్దు.. శాసించే అధికారం కావాలని..
పోలీస్ రాజ్యం వద్దని.. ప్రజాస్వామిక సంస్కృతికై
చైతన్యం కల్గించిన అధ్యాపకుడు..

**-లోడె రాములు**
738 280 4913

## ఏమని ఆదేశిస్తారు?

ఉద్యమాల ఉపాధ్యాయ!
అందుకో అరుణారుణ జోహార్లు!
పోరాట స్ఫూర్తి ప్రొఫెసర్ జయశంకరా!
నీతిమాలిన పాలనపై
రిశీలనా ప్రశ్నలు ఎక్కుపెట్టి
ఆర్ ఎస్ ఎస్ నుండి ఆర్ ఎస్ యు వరకు
కూడగట్టి పోరు చేయ నిలబెట్టిన
స్ఫూర్తి ప్రదాత జయశంకర్ సార్!
గ్రామీణ వ్యవస్థ చిన్నాభిన్ననీ అయితే
గాభరాపడి ఆవేదన చెందినావు. ఆంధ్ర ప్రజలు
మేధావి, ఉపాధ్యాయులతో
చర్చించి, నచ్చజెప్పి, ఒప్పించి నావు.
నీళ్లు, నిధులు ,నియామకాలు
దక్కాలని తెలంగాణ కావాలి అన్నావు.
అరువది తొమ్మిది ఉద్యమములో
అలస్యమై ప్రాణాలు దక్కించుకున్నా,
తెలంగాణ కై ఆరాటపడి,
సిద్ధాంతకర్త గా రాణించి
నిద్రలేని రాత్రులు చవిచూసి
తెలంగాణ చూడకుండానే
తెరమరుగైన పోరాట పతాక!
తెలంగాణ ను సాధించినా,
ఆకాంక్షలు నెరవేరకపోతే అర్థమే లేదన్నావు
భౌగోళిక తెలంగాణకే పరిమితమైన మేము
ఆశయాలు నెరవేరలేదని ఎవరితో చెప్పాలి?
తెలంగాణ విద్రోహులు ఇంట్లో చేరి
ఉద్యమ శక్తులను ఊరెల్లగొడుతుంటే
బహుశా !ఈ అరాచక వాదాన్ని
చూడలేననే తనువు చాలించావా!!!
మీ ఆరాటాన్ని, పోరాటాన్ని,
ఉద్యమ పథంలో నిద్రలేని రాత్రులను
నిర్వీర్యం చేస్తున్న జాతి ద్రోహులకు,
చరిత్రను మరిచిపోతున్న చరిత్రహీనులకు
ఏమి శిక్ష విధిస్తారు?
ఏమని ఆదేశిస్తారు??



**-వద్దేపల్లి మల్లేశము**
9014206412

## ప్రశ్నించే గొంతుక

దగ దగ మండే అగ్ని కణములా
ఎగసి పడే నిప్పు కణములా
దగా పడిన తెలంగాణ కోసం ప్రశ్నించిన గొంతుక

నైసర్గిక స్వరూపాన్ని అణువణువున
ఆకళింపు చేసుకుని..
అనుక్షణం జరుగుతున్న అన్యాయాలకు అడ్డుకట్ట వేసి...
జల వనరులను కాపాడిన అపర భగీరథుడు
నాన్ ముల్కీ ఉద్యమాన్ని నడిపి
గోబాక్ ఇడ్లీ సాంబర్ అంటూ .. నినదించి
పరాయి పాలకులక పాలిట.. సింహస్వప్నమై,
వారి గుండెల్లో భయానకపు రైళ్లు పరుగెత్తించి,
ఉద్యమానికి ఊపురి లూది,
నాయకులకు దిక్సూచి గా నిలిచాడు.
కొలువుల పంట పండి, పచ్చటి పంటలతో
పసిడి తెలంగాణ రావాలని కలలు కన్న దార్శనికుడు..
కమిటీల నివేదిక కోసం ..
ఆరోగ్యాన్ని లెక్క చేయని కార్యదక్షుడు..
పదవులు ఆశించని రాజనీతిజ్ఞుడు
తల్లి తెలంగాణ ఋణం తీర్చు కొనగ
కొన ఊపిరి దాక శ్రమించిన అపర మేధావి
ఏమిచ్చి తీర్చుకోగలము నీ ఋణం..
తెలంగాణ జాతిపిత వంటు
నిన్ను స్మరించు కొనుచున్నాము...
జయ శంకర్ సారు...
అందుకో....వేవేల జోహారు...

**-హరీశ్ బాబు. సాక**
9493603594

## ఆరనిజ్యోతి

అరవై ఏండ్ల పోరులో
ఎన్నో సంఘాలకు సారధిగా నిలచి
బ్రతుకంతా తెలంగాణా వాదమై
ఆజన్మ బ్రహ్మచారిగా దీక్ష బూని,
పట్టుదలే ధ్యేయమై
మనసునిండా తెలంగాణను నింపుకొని
ఉద్యమ శిఖరమై నిలిచావు
తెలంగాణా సిద్ధాంత బ్రహ్మవై
సీమాంధ్ర నేతలకు సింహస్వప్నమై
నిత్య సమరజ్వాలలా
జ్వాజ్వల్యమానవై వెలిగావు
మట్టిముద్దలను సైతం
మహాగ్నిగోళాలుగా మార్చి
తెలంగాణా పోరులో
కత్తులు దూయించినావు
నీ త్యాగనిరతి వృధా పోలేదు
వందలమంది విద్యార్థుల ఆత్మబలిదానం
ఎందరో పోరాటయోధుల అకుంఠిత దీక్షతో
తెలంగాణ స్వప్నం సాకారమైంది
నీ మార్గం అనితర సాధ్యం
తెలంగాణా జాతిపితగా
ప్రజల నాల్కలపై నడయాడుతున్నావు
మా గుండెలలో ఆరనిజ్యోతివై నిలిచావు
ఆచార్యా జయశంకరా
అందుకో మా అక్షర నీరాజనాలు

**-డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు**
9491357842

## జయహో జయశంకరా...!

జయహో జయశంకరా ..!
తెలంగాణా వర కుమారా..!
ఉద్యమాన చైతన్యపు సెగను
రగిలించగ జ్వలించిన
ఉత్తేజపు అగ్గిరవ్వ
ఉపన్యాస ప్రవాహమా !

రతనాలవీణ ఈ తెలంగాణా
స్వరాష్ట్రమై ఆత్మగౌరవాన
తనదైన స్థానాన దేశ పటాన
పైడి ప్రభల శోభాయమానమున
విలసిల్లు సుందర స్వప్నము కన్న
ఆచార్యా!జయహో !జయ జయహో !

సౌభాగ్యజీవన ప్రమాణాలనిచ్చి
మెరుగైన అవకాశాల అడ్డాగా
పుష్పకవిమానమై కామధేనువై
తెలంగాణా ప్రగతిబాటల పయనించ
కల్పతరువై విలసిల్లు స్వప్నమును కన్న
ఆచార్యా !జయహో!జయహో !"

**-రావుల కిరణ్మయి**
824 7 5 6 6 6 1 5

## తెలంగాణా రూపశిల్పి

తెలంగాణా ఉద్యమాన్ని
గల్లీ నుంచి ఢిల్లీ దాకా
ఢిల్లీ నుంచి అమెరికాకు వ్యాపింపచేసి
దేశ విదేశాలలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర వ్యాప్తికై
అహర్నిశలు కృషిచేసి
నా కల తెలంగాణ రాష్ట్రం ఏర్పడటమే అని
చివరి శ్వాసవరకు పోరాడిన
ఉద్యమనేత జయశంకర్
మీకివే శతకోటి వందనములు....!!!

విద్యార్థి నాయకునిగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల
విలీనానికి వ్యతిరేకంగా అప్పటి
""ఫజల్ ఆలీ కమిషన్"" కు నివేదికను సమర్పించిన
ఉద్యమ నాయకునిగా, అధ్యాపకునిగా,
పరిశోధకునిగా ఉంటూ ప్రతినిత్యం
ప్రతినిమిషం తెలంగాణ గూర్చి ఆలోచిస్తూ
రచనలు చేస్తు, జాతీయ అంతర్జాతీయ సదస్సులలో
తెలంగాణ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళి
కె. సి ఆర్, కోదండరామ్ లకు ఆదర్శంగా నిలచిన
మీరు తెలంగాణ గాంధీ అనడంలో సందేహం లేదు
అందుకోండి మీకివే శతకోటి వందనములు....!!

తెలంగాణ రాష్ట్రం కోసమే మీ ఆస్తిని, సర్వస్వాన్ని
చివరకు జీవితాన్ని అంకితం చేసి
తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్
తెలంగాణా లో ఏం జరుగుతోంది
తల్లడిల్లుతున్న తెలంగాణ వంటి
ఎన్నో రచనలద్వారా ప్రజల హృదయాల్లో
చిరంజీవి గా నిలిచి
బంగారు తెలంగాణ ఏర్పాటుకు కారణమై
స్వప్న సాకారం జరగక ముందే
శ్రీరామచంద్రుని దరి చేరిన జయశంకర్
మీరు మా పాలిట దైవమే
అందుకోండి మీకివే శతకోటి వందనములు....!!"

**-ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్**
9963265762

## జోహార్లు ! జోహార్లు !!

నా తెలంగాణ సిరి సంపదల ఖజాన
అధిక నిధులతో అలరారుచుండగా
ఆర్థికంగా అలమటిస్తున్న ఆంధ్ర ప్రాంతీయులు
అందరం తెలుగువాళ్ళము - అన్నదమ్ముల్లా కలిసుందామని పోరే
మోసాల వేషాలు పసిగట్టి జయశంకరుడు
విద్యార్థి దశలోనే వద్దని రాద్ధాంతం చేసే
ముల్కీ నినాదంతో పోరాటం చేపట్టే
ఫజల్ అలీక్కూడ ఇరువురిని కలపొద్దని మొరపెట్టే
శంఖమూది ఎన్ని చెప్పినా చెవికెక్కించుకోక
ఆంధ్ర ప్రదేశ్ గ ఏర్పరచగ..
ఆంధ్రులు తనువెల్ల విషముతో..
తెలంగాణీయులకు ఇంగ్లీష్ రాదంటు
ఉద్యోగాలు దోచిరి - నిరుద్యోగుల చేసిరి
ఆనకట్టలు కట్టగ.. నీటినంత మళ్లించుకుని
ఎండగొడుతు తెలంగాణ పొలాలు ఎడారి చేసిరి
బీడు భూములంటు - కూడు పెట్టవంటు
అగ్గువ సగ్గువకు అమ్మించు కున్నారు
ధనిక తెలంగాణను దరిద్రానికి దిగజార్చి
అణగదొక్కుతుండగా.. అవమానభారంతో
"" ఆంధ్ర గో బ్యాక్ "" అంటూ..గళమెత్తి నినదిస్తు
ప్రాణ త్యాగాలు తెలంగాణీయులెందరో చేయగా..
ప్రత్యేక పథకాలు ఎన్నో ప్రకటించి చల్లబర్చంగ
అమలు కాకుండ ఆంధ్రులు అడ్డు తగులుతుండగా...
అన్యాయమంటూ.. అపరమేధావి శంకరుడు
మా వనరుల మీద.. మాదే హక్కంటూ..
దేశ, విదేశాల్లో ఎలుగెత్తి చాటాడు
సబ్బండవర్గాలను ఏకతాటిపై నిలిపి
గల్లీ నుండి ఢిల్లీ వరకు గడ గడా లాడిస్తు
ఉవ్వెత్తున లేచిన ఉద్యమానికి నాంది పలికాడు
ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమే ఆకాంక్షగ
పరితపించిన, పరిశ్రమించిన
ఉద్యమానికి ఊపిరి, సిద్ధాంత కర్త
జయ శంకరా నీకు జోహార్లు ! జోహార్లు!!

**-వద్దేపల్లి నర్సింగరావు**
9959945645

## తెలంగాణ ధ్రువతార

నిండిన బాధతో కదిలే మేఘం
వర్షించే చిరునవ్వుల మోహం
మంచు గడ్డల కరిగే హృదయం
రగలే నిప్పు , వీచె వాయువు
జనగర్జనకై కదలే కదలి
జై తెలంగాణ నినాదపిడుగై
మండే మంటతో ఎత్తన పిడికిలి
బడిలో గుడిలో జన సందడిలో
తెలంగాణమే ఉపిరి పాట ఉద్యమ బాట
ఆక్రందనలు ఆవేదనలు
ఆఖరి మజిలి కాదంటూ
పిడికిలి పీడియే నీ చేయి
కన్నీటి తడిని తుడ్చేయ్ అంటూ
విషవృక్షాల పెకలించ
విషయమేమిటో విడమర్చి
విశాదంలో వినయంగా
విజయ శంఖమే ఆశించి
భోదించిన భోదక వృక్షమే జయ శంకర్
ప్రతివాడికి పోరాట గుత్పను అందించి
అమరవీరుల ఆశయంకై
తెలంగాణ సాధనకై
సమరశిలగ మిగిలిపోయిన ఆ బ్రహ్మచారి
ఆధిపత్యాల అణచివేతలో
అసువులు బాసిన విద్యార్థుల ఊపిరిగా
ఉద్యమ పాఠాలు నేర్పిన మాస్టారు
ఆత్మాభిమానవు వచ్చని చిరాను
తెలంగాణకు కట్టాలంటూ....
కలలు గన్న సిరచుక్కతో వేగు చుక్కల
వెలుగు చూపినాడు జయ శంకర్
అమర్ హై అమర్ రహేగా !
హమారే మంజిల్ ఇ మక్సద్
జైయహై జయ జయ జయశంకర్....

**-మురళీ జాదవ్**
9492539553

## అక్షరశిల్పికి జోతలు

ప్రొఫెసర్ జయశంకర్
ఓరుగల్లు ముద్దుబిడ్డ
అక్కంపేట ఆవరణలోఆణిముత్యం
చదువులలో ఎదిగిన గురువు
పదవులకే తెచ్చిన వెలుగు
నిరంతర సత్యాన్వేషి
ఉద్యమాల సలహాదారు
కేసిఆర్ కు ఆత్మబంధువు
తెలంగాణం కోసం అర్రులు చాచి
అసమానతలను మంట గలిపి
అన్యాయాలనెదిరించి
నమ్మిన సిద్ధాంతం కోసం
మొక్కవోని దీక్షతో
నిలిచిన నిలువెత్తు మనీషి
అంకితభావం కలిగిన ఆజన్మ బ్రహ్మచారి
తెలుగు అధ్యాపకవృత్తి నుంచి
పలు విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్ గా
ఎదిగి ఒదిగిన ఆదర్శజీవి
విద్యతో మణిమాణిక్యాల మలిచిన నేర్పరి
తెలంగాణ సాధన తన గానమైన గాయకుడు
ఉద్యమ స్ఫూర్తి కలిగిన సమరశీలుడు
విశాలాంధ్ర ప్రతిపాదననెండగట్టిన ధీశాలి
రాష్ట్రం కోసం కలం ఝులిపించి
తల్లడిల్లుతున్న "తెలంగాణ అక్షరశిల్పి"
అద్భుతమైన ఆలోచనాసరళి
గల్లి నుంచి ఢిల్లీ దాకా వినిపించిన గళం
తెలంగాణ వాదం పలికిన వాణి
ప్రసంగాలతో పదునైన భావం పలికిస్తూ
తెలంగాణ రణనినాదం
వినిపించిన పోరాటశీలి
అధ్యయనాలతో విశ్లేషణలతో
విస్తరిల్లిన మేధావి
ఇంటింటా తెలంగాణ బీజం నాటి
ముందుకు నడిపించిన మార్గదర్శి
ఖచ్చితమైన భావజాలంతో
వక్రీకరణలు వాస్తవాలను విడమరచిన
తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త
తెలంగాణ యాదిమరవని మహనీయుడు
తెలంగాణ ఎన్నటికీ
ఋణపడిన పితామహుడు
ఆయన జననం మన పుణ్యఫలం
తెలంగాణ అణువణువూ నిండినఋణం
అందరమూ అందిద్దాం మనసారా జోతలు



**-డా.సమ్మెట విజయ**
9989820215

## తెలంగాణ స్మృతికిరణం

తెలంగాణ రాష్ట్ర సాధనకై
ఉద్యమబావుటాను ఎగరేసిన విప్లవసూరీడు..
బంగారు తెలంగాణ కై
బతుకంతా ధారబోసిన బ్రహ్మచారి..
ఉద్యమానికి ఒక రూపమిచ్చి
వ్యూహ శిల్పి గా మారిన సిద్ధాంతకర్త..
ప్రజల మదిలో విప్లవ శక్తిగా
వెలిగిన భావజాలనేత...
మంచిగా బతుక లేకుంటే
బిచ్చమెత్తుకుని అయినా
బతుకు తాము కానీ ఆంధ్ర వాళ్లతో
కలవమని తేల్చి చెప్పిన కార్యశీలి..
ఆందోళన కార్యక్రమాల్లో
ముందుండి దారి చూపిన దార్శనికుడు..
విద్యార్థులందరినీ వెన్ను తట్టి
లేపిన విద్యా సారథి..
రాష్ట్ర సాధనే లక్ష్యంగా, స్వప్నంగా..
జనులకు అండగా నిలిచిన జనశక్తి..
తౌరక్యాంధ్రం అన్నమాటను నిలదీసి
ప్రశ్నించిన అగ్గిపిడుగు..
అమరుల త్యాగానికి చెమ్మగిల్లిన మనసుతో
ఉద్యమమే ఊపిరిగా మార్చిన ఉక్కు పిడుగు..
సమస్యా పరిష్కరణ లో
అనారోగ్యాన్ని సైతం లెక్కచేయక
పరిశోధించిన మహనీయుడు..
బంగారు తెలంగాణ ఆశయంగా,
సేవలందించిన
నిస్వార్థ నిష్కల్మష, తెలంగాణ చిరునామా..
మరువమయ్యా..మరువమయ్యా..
జయశంకర్ సారూ మీ సేవలను,
మీ ఆశయాలను మా గుండెల్లో నిలిచిన
స్మృతి కిరణానివి నీవు...
జోహార్ తెలంగాణ జాతిపిత జోహార్

**-జి. శిరీష**
6304365782

## కలగానే మిగిలిన ఆశయం

అనుకున్న తెలంగాణ ఆవిష్కరణ కాలేదు
భౌతిక స్వతంత్ర తెలంగాణ
భజన పరుల చెంత చేరింది.
పోరాడే తత్వం పోతుంది
పొర్లుదండాలు పొంగుతుండే
ఆత్మాభిమానం ఆవిరయ్యే..
ఆర్థిక స్వరాజ్యం అందలమెక్కే
కలలు గన్న తెలంగాణ
కుట్రల గర్భం దాల్చే..
త్యాగాలన్నీ కనుమరుగాయే
తెలంగాణ ద్రోహ మంత్రులొచ్చే..
జయశంకరా నీ ఆత్మ ఘోష..
జనం గుండెల్లో విలపిస్తుంది,
బహుజన భావం మంట కలిసే
బతుకు జీవన సిత్రం మారే..
ఆశయాల దారి ఆగమైపోతే..
అసువులు భాసిన అమరుల సాక్షిగా
ఆనాటి పోరాట వారసత్వం
పొత్తిళ్ల ఎదలో ప్రతి మదిని నింపాలి.
మళ్ళీ తెలంగాణ ఉద్యమ ప్రాణం పురుడోసుకోవాలి,
జయశంకర్ సాక్షిగా...

**-నీలం శేఖర్**
9642357211.

## బంగరు తెలంగాణ ఆకాంక్ష

అబ్ తో ఏక్ హీ క్వాయిష్ హై
వో తెలంగాణ దేఖ్నా ఔర్ మర్ జానా!
మర్ తే క్షణ్ తక్ శనివార్ ఉపవాస్ ఔర్
తెలంగాణ వాద్ ఛోడూంగా నహీ!

ఎవరు అనగలరీ మాటలు?
ఎవరి కున్నదీ ధైర్యం?
అక్కంపేటలో పుట్టిన జయశంకరన్నకు తప్ప!
ఓరుగల్లు బిడ్డ వీడు పౌరుషాల ప్రతిరూపం
చదువులన్నీ వెన్నతో పెట్టిన విద్య
భాషలన్నీ కరతలామలకం
పదవులన్నీ అలంకార ప్రాయం
పట్టువీడని జయశంకర్ ఆజన్మ బ్రహ్మచారి
నాకున్నది ఒకే కుటుంబం
నాలుగు ధ్వజస్తంభాలుగా
నాలుగు దిక్కుల నిలచిన
నాలుగు కోట్ల ప్రజలున్న నా తెలంగాణ
వంచకుల చేతచిక్కి తల్లడిల్లే నా తెలంగాణ
విద్యార్థి దశలో ప్రారంభించిన ఉద్యమం
ఉపకులపతి అయినా ఆపలేదు తన వ్రతం
వృత్తి పట్ల నిబద్ధత ఉద్యమం పట్ల చిత్తశుద్ధి
నమ్మిన దాన్ని లిఖించెను గ్రంథాలు
ప్రేరేపించి చేసే పోరాట ప్రసంగాలు
నేతలు కోరేరు సలహాలు
విద్యార్థులు ఉన్నారు వెన్నుదన్ను
ఇదిగిదిగో ఊరించారు పాలకులు
లోలోతుల్లోకి చొచ్చుకొనిపోయి
తెలంగాణ గాలి నీరు వనరులు మనవి రా!
ప్రజాస్వామ్యమంటే పాలన మనదేరా!
జై తెలంగాణ! జై జై తెలంగాణ!

నినాదాలతో అమరులైన విద్యార్థులు
రక్తపు మడుగుల గురుతులు
సాక్షులై నిలిచినవి ఉస్మానియా గోడలు
అవునంటూ తల ఊచినవి చెట్ల కొమ్మలు
ఆరాటాలకు పోరాటాలకు
ఉద్యమాలకు పుట్టినిల్లు
యాచించే ద్యాస లేదు
శాసించే దిసయే మేలు
లాఠీ దెబ్బలకు జంకేదీ లేదు
సాధించేదాకా పట్టు విడువనని పోరాడావు
భౌతికంగా మాతో లేకున్నా
నీ కల నెరవేరిందన్నా!
ఊపిరి పీల్చుకో ఉద్యమకారుడా!
బంగరు భవిత గల తెలంగాణ ఏర్పడినది
పల్లకిలో తెలంగాణ తల్లిని బతుకమ్మని
సుపథాన ఊరేగిస్తున్నారు

**-చివుకుల శ్రీలక్ష్మి,**
9441957325

## జయ కేతనం

తెలంగాణా ఉద్యమ ఆద్యుడా
మడమ తిప్పని పోరాట వీరుడా
తెలంగాణా ముద్దుబిడ్డవు
అయ్యావు రాష్ట్రానికి పెద్ద అండదండలు
ఇంటిపేరు లోనే కాదు
పోరు బాట లోను చూపించావు " కొత్త "దనం
నాన్-ముల్కి ,సాంబార్ - ఇడ్లి గో బాక్, తెలంగాణా
ఉద్యమాల్లో పాల్గొని " ఉద్యమ జ్యోతి " గా నిలిచావు
పదవి ,చదువు ,పరపతి ఎన్నున్నా
పక్కకు నెట్టేసి ,బ్రహ్మ చర్య దీక్షతో
ఆశయ సిద్ధికి పోరాడావు .
గల్లీ నుంచి ఢిల్లీ దాకానే కాదు
ఖండాంతరాలలోను నీ వాణీ వినిపించావు .
కలం పట్టి , ఆ బలం చూపెట్టి , ఉద్యమ ఆశయాలే కాదు
తెలంగాణా సంస్కృతి ,సంప్రదాయా లూ తెలియ చేసావు
భాష లెన్నో నేర్చావు ,ఇతర రాష్ట్రాలలోను నీ బాణి వినిపించి
ఆశయ సిద్ధికి పాటు బడ్డావు .
సార్ గా, మాస్టారుగా అందరి మది దోచావు
మార్గ దర్శి వై దిశానిర్దేశం చేసావు.
సిద్ధాంత కర్త వై ,తెలంగాణాకు "సిద్ధాన్నము " సిద్ధం చేసి
భుజించే వేళకు వెడలి పోయావు .
కానీ , నీవున్నా లేకున్నా,తలచుకుంటారు నీ కృషి
జయశంకరా జయుడు వైనావు నీ కృషిలో, ఆకాంక్షలో
సాధించారు ,బంగారు తెలంగాణా.

**-ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి**
9 8 4 9 4 6 4 0 1 7

## సంకల్ప జ్యోతి

నడిచే మార్గంలో దారిపొడవునా కనపడే లోతుల్ని చూసి
మదిలో మథనపడి మెదిలే ప్రశ్నల్ని గొంతుల్లో నొక్కేసి
పక్కకు తప్పుకు పోయే సగటు మనుషులే అందరు

కళ్ళ ముందు కనపడే అగధాలు గుండెల్ని రగిలిస్తుంటే
కాళ్ళను పక్కదారిలో పోనీకుండా
రొమ్ము విరిచి నిలబడే పుణ్యపురుషులు కొందరే

ఆశయ సాధనకు అడుగులు ముందుకు వేసి
లక్ష్యానికి తానే పునాది యై
తెలంగాణ వాకిట తొలి పొద్దు యై
నేటి స్వతంత్ర పుష్పానికినాటి విత్తు అతడు

పిడికిలి బిగించిఅసమానత ను తెగ నరికేందుకు
సంకల్పించిన జ్యోతి అతడు
ఆత్మ బలం ఆయుధంగా చేసుకుని
అన్యాయాన్ని నిలదీసిన నిప్పు అతడు

ఊపిరంతా దృఢ విశ్వాసం నింపుకొని
గళమెత్తి ప్రశ్నించినఆచార్య జయశంకరుడతడు
చరిత్ర పుటల్లో స్వర్ణ అక్షరాలతో లిఖించబడిన
అమర నామం
తెలంగాణ పూదోట లో
ప్రతి పువ్వు స్మరించుకునే
పూజ్య రూపం

**-సాలూరు.సంతోషి**
8019783424

## తెలంగాణ రూపశిల్పి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత
విడమర్చి పీడిత ప్రాంతానికి
పోరాటబాటను చూపి
తెలంగాణ నిర్మాణానికే
జీవితాంకితం చేసిన దార్శనికుడు
ఆరుదశాబ్దాల
తెలంగాణఉద్యమానికి చుక్కానిలా
తెలంగాణవాదాన్ని ప్రపంచానికి చాటిచెప్పి
ఉద్యమమే లక్ష్యమై
నాయకులకే కాక ప్రజలలో
చైతన్య బీజాలు వేసిన తెలంగాణ సిద్ధాంతకర్త
తెలంగాణ యాచకదశ నుండి
శాసించేస్థాయికి ఎదగాలని
బలమైన సంకల్పంతో
ఉద్యమానికి ఊతమిచ్చిప్రజలకు
విముక్తి పాఠాలు నేర్పిన మహోపాధ్యాయుడు
విద్యార్థి దశ నుంచే
ప్రత్యేక తెలంగాణకై పరితపిస్తూ
తెలంగాణ ఏర్పాటు తన శ్వాసయై
తన జీవితసర్వస్వం రాష్ట్రసాధనకై
ధారపోసిన త్యాగశీలి
తెలంగాణ ప్రజల ఆకాంక్షకై
అవిరామకృషితో సమస్యలపై స్పందిస్తూ
ఆజన్మాంతం తెలంగాణనే స్వప్నించి
స్థితప్రజ్ఞతతో శ్రమించిన కర్మయోగి
ఆతపస్వి ఆశయాలు సజీవంగా
ముందుకు తీసుకువెళ్ళడమే మనమిచ్చే నివాళి

**-మండవ సుధ**
9177880320

పుస్తక సమీక్ష

# సరళమైన భాషలో పురాణ సరదా కథలు




ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని బాల సాహితీ ప్రియులకు, బాల కవులకు సుపరిచితమైన పేరు బండారు చిన్న రామారావు. బండారు బాలానంద సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా వివిధ రకాల కార్యక్రమాలతో సాహిత్య సేవ చేస్తున్న బండారు చిన్న రామారావు విద్యార్థులను భావి రచయితలుగా తీర్చిదిద్దాలనే సత్ సంకల్పంతో వారిలోని సృజనాత్మకతను వెలికితీసేలా వాట్సప్ సమూహాల ద్వారా అనేక రకాల పోటీలు నిర్వహించి వారికి పురస్కారాలను, ప్రశంస పత్రాలను , పుస్తకాలను బహుమతులుగా అందిస్తున్నారు. వాట్సప్ అంతర్జాల వేదిక ద్వారా విద్యార్థుల స్వీయ రచనలు స్వీకరించి వాటిని బాలసుధ త్రైమాసిక పత్రిలో ప్రచురించి ఆ పత్రికను ఉచితంగా అందజేస్తున్నారు. బాలల రచనలకు పెద్దపీట వేస్తూ ఇంతవరకు మూడు త్రైమాసిక పత్రికలు వచ్చాయి.

బండారు చిన్న రామారావు బాల రచయితలను ప్రోత్సహించడమే కాకుండా తాను కూడా పిల్లల కొరకు ప్రత్యేక రచనలు చేసి పలు పుస్తకాలను ప్రచురిస్తున్నారు. ఆ కోవలో వచ్చినదే పురాణ సరదా కథలు. ఇందులో భాగవతం, , శివపురాణం, విష్ణు పురాణం మొదలగు వాటిలో ఉన్న భక్తి కథలను పిల్లలకు సరళమైన రీతిలో అందించారు. ఇందులో మొత్తం 23 కథలు ఉన్నాయి. అన్ని కథలు కూడా పిల్లలను ఆకట్టుకునే విధంగా ఉన్నాయి.

గుంజీల గణపతి కథలో ఒక రోజు వైకుంఠం వెళ్లిన వినాయకుడిని లక్ష్మిదేవి ఒడిలో కూర్చోబెట్టుకుని కుడుములు, ఉండ్రాళ్ళు కొసరి కొసరి తినిపిస్తుంది. కానీ వినాయకుడి నాలుక కొత్త రుచులు కోరుకుంది. అప్పుడు వినాయకుడి కన్ను విష్ణుమూర్తి చిటికెన వ్రేలుపై గిర్రున తిరుగుతూ దగ దగ మెరిసె చక్రంపై పడింది. వినాయకుడు గబుక్కున దాన్ని అందుకొని నోట్లో వేసుకున్నాడు. అప్పుడు వినాయకుడిని నవ్విస్తే చక్రం బయట పడుతుందని హాస్య కబుర్లు చెపుతాడు. కితకితలు పెట్టాడు. అయినా వినాయకుడు నవ్వలేదు. అప్పుడు వినాయకుడిని నవ్వించడానికి 27 గుంజీలు తీశాడు. అలా తీస్తున్నపుడు శ్రీహరి పంచె ఊడుతుంది. అది చూసి వినాయకుడు ఫక్కున నవ్వుతాడు. దానితో వినాయకుడి నోట్లో నుండి చక్రం బయటపడుతుంది. అప్పటి నుండి వినాయకుడు గుంజీళ్ల వినాయకుడిగా ప్రసిద్ధి చెందాడు. ఇలాంటి అనేక హాస్య ప్రధానమైన పురాణ కథలను ఇందులో పొందుపరిచి విద్యార్థులకు ఆధ్యాత్మిక భావాన్ని కలిగించే ప్రయత్నం చేశారు రచయిత బండారు చిన్న రామారావు.

ప్రదక్షిణ ఫలం, వినాయకుని తెలివి, తులసీ, ఏక దంతుడు, ఈశ్వరుడు – శనీశ్వరుడు మొదలగు కథలు వినాయకుడి, ఈశ్వరుడికి సంబంధించినవి ఉండగా, జలంధరుడు, ఉషాపరిణయం, వాయు నందనుడు, నెమలి ఫించం, జెండాపై కపిరాజు, కుచేలుడు, శ్యమంతకమణి, బలరాముడు, జరాసంధుడు మొదలైన కథలు శ్రీ కృష్ణుడి లీలలు తెలుపుతాయి. మహాభారత కథల ఆధారంగా రాసిన భీష్ముడు, విదురుడు, ధర్మరాజే, గాంధారీ శాప ఫలం కథలు ఆకట్టుకున్నాయి. ఇవే కాకుండా సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుడు, జ్వరం, కాకి, పరాశరుడు మొదలగు కథలను కూడా విద్యార్థులను ఆకట్టుకునేలా ఉన్నాయి.

ఈ కథలన్నీ సరళమైన భాషలో పిల్లలకు అర్థమయ్యేలా రాశారు రచయిత. బాలసుధ ఉచిత త్రైమాసిక పత్రిక ద్వారా ఇంకా అనేకమంది బాల రచయితలకు అవకాశం కల్పించడమే కాకుండా బండారు చిన్న రామారావు కలం బాలలకు ఉపయోగపడే మరెన్నో రచనలు వస్తాయని ఆశిద్దాం.

ప్రతులకు.. బండారు చినరామరావు, చరవాణి. 9553330545.



–కందుకూరి భాస్కర్
9703487088

## ఎవరి పనుల్లో వాళ్ళు

ఓ వైపు...
ఎప్పటిలానే రాజకీయం
రంగులు మారుస్తోంది... ఊసరవెల్లిలా
మెడికల్ మాఫియా మథించి
పావులు కదుపుతోంది...గుంటనక్కలా!

ఇంకోవైపు...
కుబేరుడ్ని సైతం కుచేలుడుగా మార్చే
కార్పొరేట్ బాగోతాల పర్వాలకు
ఆయుర్వేదమే అసలైన మందని
క్యూ లైన్లలో నిలుచున్న
ఓ ఎదురుచూపుల చకోరం!

కొడిగడుతున్న ప్రాణాలకు
నమ్మకమనే పసరు పోసి
ఊపిరి నిలపడానికి ప్రయత్నిస్తోన్న
ఓ ఆనంద సమీరం!

ఎవరి పనుల్లో వాళ్ళు
తలమునకలై ఉన్నారు!!



– వాడపర్తి వెంకటరమణ
81795 78895

## జీవితం

రెక్కాడితే కానీ డొక్కాడని జీవితాలు,
నిరంతర శ్రమ లో పోరాడే
అభాగ్యపు జీవితాలు,
జీవిత సమరము బాటలో
సొంత ఊరు, సొంత వారిని
వదిలి వేళ మైళ్ళ దూరం దాటి
వలస వెళ్లి ఉపాధి బాట పట్టే
దినసరి కూలీల జీవితాలు,
శ్రమైక జీవనం లో అలుపెరుగని
పోరాటం చేసే జీవితాలు..
యజమానుల దౌర్జన్యంకు విల విల్లాడి,
ఎలాంటి భరోసా లేని బ్రతుకు భారం
కొనసాగిస్తూ జీవించే బతుకులు...
ఇదే వారి జీవితంలో అను నిత్యం జరిగే
జీవిత సంఘర్షణ...!
కల్పించాలి ప్రభుత్వాలు
వారికోసం ఒక రక్షణ..!!



–ఎస్.. రాజేష్
9849335757

## హృదయ సంపుటి

నా వ్యక్తిత్వం నీకు తెలీదు
గుప్త నిధుల కోసం
నేను పరుగెత్తిన
వనధిలోని గవ్వలే
ఏరుకుంటాను
వంచించే మంచి మాటల
మతాబాలు నాకు నచ్చవు
ముఖస్తుతిగా పలకరించే
చిరునవ్వుల కాకరొత్తులు
నాకు రుచించవు
నాది వేరైన దారి
ఎవరూ తొక్కని వసుధైక మార్గం
దారినిండా ముళ్ళేగాని
గులాబీల గుబాళింపులుండవు
కుట్ర పన్నిన రాజకీయాల
కుటిల పన్నాగాలుండవు
నేను ఎప్పటికీ విశ్వనరుడను
మానవత్వం
నా హృదయ సంపుటి.



–భూషికృష్ణదాసు
సెల్: 9618069338

పుస్తక సమీక్ష

# వెల్మజాల ‘అగ్నిశిఖ’



“ఆనందం కొందరిదే / ఆకలి చావు లెందరివో / భవనాలలో కొందరే / బస్తీ గుడిసెలలో ఎందరో” అని అంటూ సమాజంలోని వ్యత్యాసాలను కంటూ “అగ్నిశిఖ”తో ప్రజ్వరిల్లుతున్నాడు వెల్మజాల నర్సింహ.

ఒకప్పుడు పల్లె ఐకమత్యంతో విలసిల్లేది. కాని నేడు పాత కక్షలతో, పార్టీ జండాలతో, వర్గ వ్యవస్థతో, వర్ణవివక్షతో, ప్రచ్ఛన్న నిరుద్యోగంతో, పనిచేయని యువతతో పల్లె పాడౌతున్న దని వాపోతున్నాడు కవి. మరి పట్టణాలెలా ఉన్నాయి ? “పది అడుగుల గుడిసెలో పదిమంది జీవనం... మోరీ పక్కన పడక... పేదలు తలదాచుకునే గూడు – వలసజీవుల మహానగరం” అని ముంబై గురించి చెప్పాడు. “స్వాతంత్ర్యం కోసం / సాగిన పోరాటంలో / ఉరితాడుకు వేలాడిన కంఠాలెన్నో!” అంతమంది త్యాగాలు చేసి స్వాతంత్ర్యం తెచ్చిన దేశంలో నేడు “మాటలకు చేతలకు / అర్థంలేని రాజకీయ నేతలు / డబ్బులదే పెత్తనం / దొరలదే రాజకీయం ! పేదలు పావులౌతున్నారు. మానవ మృగాల వేటకు ఆడపడుచులు బలియౌతున్నారు.

“నిలిచివుంటే చేతిలో / నడుస్తుంటే జేబులో / పడుకుంటే పక్కలో / ఒంటరిగా ఉంటే గేమ్స్‌తో / సమయం ఉంటే చాటింగ్‌తో / రోజంతా బాతాఖానీతో” మనుషులు సెల్‌ఫోన్‌కు బానిసౌతున్న తీరును వివరిస్తాడు.




ప్రతి చిన్న కష్టానికీ చిన్నబోతున్నాడు మనిషి. చెట్టుమీద గూడు కట్టుకున్న పిచ్చుక – ఈదురుగాలితో వచ్చిన వానకు ఆ చెట్టే కొట్టుకు పోతే, నిబ్బరం కోల్పోక, మరో చోట గూడు నిర్మించు కుంటుంది. ఆ పిచ్చుక మనిషికి స్ఫూర్తి కాదా! అలలలాగే మానవ జీవితంలో కష్టాలు వస్తూ పోతుంటాయి. ‘నీలో ఉన్న ధైర్యం / నడిపించు నిన్ను గమ్యం’ అనడమే కాకుండా, ‘నీ పేరిట చరిత్ర లిఖించుకో’ అని సందేశమిస్తాడు నర్సింహ.

కొత్త సంవత్సరం వచ్చినప్పుడు విశేషమేమీ లేదంటాడు. “మత్తులో మునిగితే / సత్తువ కొత్తగా రాదులే / కొత్త సంవత్సరానికి / రెక్కలేమీ రావులే” అంటాడు.

ఆకాశంలో చుక్కలు చూస్తూ ఆనందం పొందాలని, అంతా కలిసి భోంచేయాలని, అరుగులపై కూర్చొని మాట్లాడు కోవాలని, మాటే మనిషిని నడిపే జీవవాయువు కావాలని కోరుకుంటాడు.

“గగనానికి నిచ్చెన వేసి / చంద్రమండలం చూసొద్దామా! / మబ్బులతో స్నేహం చేసి / చినుకులను పిలిచొద్దామా” వంటి కవితలతో ఆహ్లాదం కలుగుతుంది.” మనసున్న మహారాజుకు మగువలు ఆరుగురు / వంతుల వారిగా వచ్చిపోవుదురు / రాణులలో మహారాణి / వసంత వయ్యారి” అని ఋతువుల గురించి చెప్పిన కవితలో కొత్తదనం ఆకర్షిస్తుంది.

“అక్షరం మాట్లాడుతుంది / ...అక్షరం ఆయుధం / మనిషి మనుగడకు అవసరం” అని ఈ కవి ముందుకు సాగుతాడు.” కవిత్వమా! కాసేపు ఉండి కవ్వించు హృదయాన్ని” అని కవిత్వాన్ని ఆహ్వాని స్తాడు. అయితే వెల్మజాల నర్సింహ పూర్వకవుల కవిత్వాన్ని బాగా అధ్యయనం చెయ్యాలని, కవిత్వాన్ని సాధన చేయాలని కోరుతూ – అభినందనలు.

**ప్రతులకు :** వెల్మజాల నర్సింహ
సెల్ : 98678 39147



–ఎ. గజేందర్‌రెడ్డి
సెల్ : 9848894086

## వసంతం వసివాడొద్దు...!

సప్త వసంతాల భారాతవనిలో
నేటికి కరువు రక్కసి కరాల
నృత్యం చేస్తుంది..

అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో
భావి తరం మసకబారుతుంది
విశాల భూ ప్రపంచం మొత్తాన్ని
అతల కుతలం చేస్తుంది కరువు
విధి వక్రీకరించిందో...
కాలం కక్ష గట్టిందో...
భూమాత కన్నెర్ర చేసిందో
ఏదైతేనేం
అడుగడుగునా ఎముకలు
చిక్కిన దేహాలు
శరీరంలో నెత్తురుడిగి పోయి
డొక్క లు తేలిన విధారక దృశ్యాలు
కనిపిస్తున్నాయి.

అన్నమో రామచంద్ర అనే
ఆకలి కేకలు వినిపిస్తున్నాయి
ఎక్కడ చూసినా ఆర్తనదాలు
ప్రజాహిత పాలనంటూ
సంక్షేమ రాజ్యమంటూ
ప్రజలే కన్న బిడ్డలంటు
వేదికలెక్కి ప్రసంగాలు
ఉత్తుతి ప్రమాణాలు
అదర గొట్టే నేతలు
ఇదే కదా నిత్యం
సాక్షాత్కారమయ్యేర్ధి
ఇకనైనా
పౌర సమాజం మార్పు తొడిగితే
ఇల నవ వసంతం వెల్లివిరిసేది
దేశం సశ్య శ్యామలమై వర్ధిల్లేది



–అనిత దావాత్
9394221927

## సుచిత్రం

మనసు నేదో తొలుస్తున్నది
దృశ్యమేదో నిలుస్తున్నది
కనురెప్పల మాటు నేదో
కలగ సాక్షాత్కరిస్తుంది
ఎన్నడెరుగని పరిసరాలలో
దేహమే సంచరిస్తున్నది.

గాలి లోపల తేలి నీలపు
మేఘమాలలో లీనమగుచు
మేఘ గర్జన వేళ్ళ మెరుపుల
తళ తళమ్ముల మెలికలవుచు
గగన వీధుల గమనములతొ
హృదయమే పులకరిస్తుంది.

అప్సరసలతొ అభినయిస్తు
హాయిగా నర్తించినట్లు
సరిగమా పదనిసా యని
గంధర్వగాన మొనరించినట్లు
ఆది దేవుని అంబతో గని
సంతసాన ధరించినట్లు

ఆత్మయే పరమాత్మ యెదురై
వరములిదునని భ్రమిస్తున్నది
ఊహయే ఊపిరిగ మారుతు
యెదదలో సంచరిస్తున్నది
చిత్రమే యిది సచిత్రమ్ముగ
కన్నుల పౌర లాక్రమిస్తున్నది.



– రసస్రవంతి & కావ్యసుధ
9247313488

# మనసు పొర “అక్షరాల తెర”

**‘విన్నావా ఎప్పుడయినా గొంతులో**
**తారట్లాడే శబ్దాల అర్థాల్ని,**
**మాటల అర్థాల కోసం వెతికే మౌనాన్ని’**



గొంతులలోని అక్షర మాధుర్యాన్ని పట్టుకుని శ్రోతల ఆకట్టుకునే కనికట్టు తెల్సింది వారాల ఆనంద్ గారికి. కవి మర్మమెరిగిన వీరు కవిత్వ లయను పట్టుకుని దానిని ప్రపంచమంతా తెలిపే ‘టోరి’ రేడియో ద్వారా చేసిన ప్రయత్నం సఫలం పొందింది. శ్రోతల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందింది. శరీరంలోని జ్ఞానేంద్రియాలలో చెవికి అత్యంత ప్రాధాన్యత వుంది. న్యాయమూర్తులు, వైద్యులు వినికిడికి పెద్దపీట వేసి తమ తమ వృత్తుల్లో అత్యద్భుత ఫలితాలు పొందడం అందరికీ తెలిసిందే. రేడియో కార్యక్రమాలంటే కేవలం వినోదం కోసం కాదని భావించి రూపొందించ బడిందే ‘అక్షరాల తెర’. ఆ కార్యక్రమం విలక్షణమయింది. కాలానుగుణ మార్పులతో దృశ్య మాధ్యమం రేడియోను ఢీ కొట్టింది. ఈ మలుపు లోంచి తిరిగి ఎఫ్.ఎం.లు రేడియో మిర్చీల్లాంటివి వచ్చి ప్రయాణాలను ఆహ్లాదపరిచాయి. యువతకు క్రేజ్ ఏర్పడింది. అయితే వాటి లక్ష్యాలు లక్ష్య సాధన వేరు. ఇక్కడ టోరి రేడియో లో ‘అక్షరాల తెర’ సాహిత్యానికి తెర తీసింది. దీనికి తోడు మానేరు తీరం వెంబడి దృశ్యాలను తన కెమెరా లో బంధించి అక్షరాలతో ప్రాణం పోసిన తెరవిరాట్టు వారాల ఆనంద్ ఆ ప్రయత్నానికి తోడు అయ్యారు. మూడు దశాబ్దాల సాహితీ యాత్రలో ఆనంద్ వచన కవిత్వం, సినీ విమర్శ విశ్లేషణ, వారికి 24 ఫ్రేమ్స్ తో కదిలినప్పుడు అంటుకున్న మాధ్యమ విద్య. ఇదే అనుభవం అక్షరాల తెర కార్యక్రమానికి అనేక కొత్త హంగులు చేర్చడానికి దోహదపడింది. ప్రధానంగా తెలుగు కవుల కవిత్వాన్ని వారి వారి స్వీయ గొంతుకలతో రికార్డ్ చేసి టోరిలో వినిపించారు. అంతేకాదు అనువాద రెక్కల మీద సునాయాసంగా ప్రయాణించిన ఆనంద్ తర్జుమాలతో అనువాదకులను అక్షరాల తెర వైపునకు మాధుర్యం పంచినారు. కథా శిల్పులని తెచ్చి వారు చెక్కిన పాత్రలను ఆయా రచయితల ‘ఔన్ వాయిస్’ లోనో లేదా తన గొంతులోనో పలికించిన వేణు నాద విన్యాసం. డాక్యుమెంటరీ దర్శకత్వ బాధ్యతల్ని గతంలోనే విజయవంతంగా నిర్వహించిన ఆనంద్ టోరిలో అక్షరాల తెర ను రెండు సంవత్సరాలకు పైగా అవిచ్ఛిన్నంగా 116 ఎపిసోడ్ లకు పైగా నిర్వహించారు. ఇందులో ఇప్పటికి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని 150కి పైగా కవుల గొంతుకలని ప్రసారం చేసారు. వీరిలో సుప్రసిద్ధ కవులతో పాటు వర్ధమాన కవులకూ స్థానం కల్పించారు. ప్రతి సోమవారం సాయంత్రాన్ని సోముడి వెన్నెల సోయగంలో అద్భుతమయిన కవిత్వం వినిపించారు. ఆ కవుల గొంతుకలన్నీ ఇవ్వాళ గొప్ప

సాంస్కృతిక సంపద గొప్ప ఆర్కైవ్. వాటిలో కొన్ని కలాలు సమాజ పోకడలు నిలదీస్తే, మరికొన్ని దుఃఖ సమయాలలో ఓదార్పుగా నిలిచాయి. మహమ్మారి కరోనాను భూమికగా చేసుకుని ప్రత్యేక గానం చేసి ప్రజల్ని అప్రమత్తంచేసాయి. ‘పోయెట్స్ ఇన్ దెయిర్ ఔన్ వాయిస్’ అన్న ఆనంద్ మాటల్లోంచి ఇప్పటివరకు 7000 నిమిషాలు టోరి అక్షరాల తెర ద్వారా అందించి అందరికీ ప్యారీ ఆనంద్ గా నిలిచారు. అక్షరాల తెర ప్రతి ఎపిసోడ్ లో ముఖ్యంగా నాలుగు అంశాలుంటాయి. ఒకటి ‘ఈ వారం కవిత’ ఇందులో ఆ వారం వివిధ పత్రికల్లో వచ్చిన,తాను చదివిన తాజా మంచి కవితల్ని ఆయా కవుల గొంతుకల్లో కానీ లేదా ఆనంద్ తానే భావ స్ఫోరకంగా చదివి వినిపిస్తారు. రెండో భాగంలో ‘కవిసమయం’ వుంటుంది. ఇందులో ప్రముఖ కవుల కవితల్ని వారితోనే చదివించి రికార్డు చేసి వినిపిస్తారు.

ఇక ఎపిసోడ్ మూడో భాగం లో నివాళి లేదా బాలల కవితా గానం ప్రసారం చేస్తారు. లేదా అర్థవంతమైన వివిధ భాషల సినిమాలను విశ్లేషిస్తారు. నంది అవార్డు జ్యూరీ సభ్యుడి గానూ, సెన్సార్ సభ్యుడి గానూ, గత నాలుగు దశాబ్దాలుగా ఫిలిం సొసైటీ నిర్వాహకుడిగా ఆనంద్ అనుభవం ఇక్కడ ఉపయోగపడుతుంది. కవిసమయం కార్యక్రమంలో ఆసిఫాబాద్ లాంటి మారు మూల ప్రాంత కవుల కవితాగానం కూడా ప్రసారం చేయడం అక్షరాల తెర విశిష్టత. టోరి రేడియోలో ప్రసారం అయిన మర్నాడు ఆనంద్ ఆ కార్యక్రమాన్ని వీడియోగా రూపుదిద్ది ఆయా కవుల ఫోటోలు జతచేసి యు ట్యూబ్‌లో ఉంచారు. Aksharala Thera By Varala Anand అని యు ట్యూబ్ లో వెతికితే 116 ఎపిసోడ్స్ వీడియోలు లభిస్తాయి.

ఇప్పటివరకు ఈ కార్యక్రమంలో తమ కవితల్ని స్వీయ గొంతుకలతో వినిపించిన కవుల్లో కే.శివారెడ్డి, నందిని సిధ్దా రెడ్డి, పాపినేని శివశంకర్, దర్భశయనం శ్రీనివాసాచార్య, జింబో, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, జూకంటి జగన్నాథం, నలిమెల భాస్కర్, మెహజబీన్, వఝల శివకుమార్, వీణా వాని, విజయ్ కోగంటి, కే.గీత, కొండేపూడి నిర్మల, మందరపు హైమవతి, దేశపతి, కే.ఎస్.అనంతా చర్య లు వున్నారు.

మామూలుగా నయితే ఎఫ్.ఎం., ఆన్లైన్ రెడియోల్లో ఏదో ప్రత్యేక సందర్భాల్లోనే కవిత్వానికి చోటు లభిస్తుంది, కాని వారం వారం గంట సమయం కేటాయించి నడపడం గొప్ప విషయమే. అంతర్జాతీయ స్థాయి లో సాహిత్య ప్రపంచంలో అక్షరాల తెర కు వచ్చిన స్పందన గొప్పది. వారాల ఆనంద్ ఈ కార్యక్రమంకోసం తన గొంతు సవరించుకుని కొత్తరాగం అందుకోవ దంతో అక్షరాల తెర విజయవంతమయింది. ఎంతో మంది కవులకు వేదికగా నిలిచిన అక్షరాల తెర ను నిర్వహిస్తున్న వారాల ఆనంద్ ను 116 ఎపిసోడ్స్ పూర్తి అయిన సందర్భంగా మనస్పూర్తిగా అభినందించాలి.



–కే.ఎస్.అనంతా చార్య
9441195765

## పంచశీల సూత్రాలు

ప్రాణమెంతయొ తీపియౌ పదుగురకును
పరులప్రాణము దీయుట పాడియగునె?
మూగ జీవుల తనువులు మెక్కదగునె
హింసయున్నది అందున హితవు వినుము
పరుల పీడించ హింసయే వలదు వలదు
పరుష వాక్కులున్ నిందలు పరమ హింసె
కరుణ ప్రేమయే హింసను పారద్రోలు
పంచశీల సూత్రమిదియె తృంచుహింస.

నీదికానిది, యేదియూ నీకు వలదు
బరుల దేదియు ఆశింప ఒప్పుగాదు!
ఇచ్చిపుచ్చుకో అదియెంతొ మంచియగును
తస్కరించుట గుంజుట తప్పుగాదె?
శ్రమను దోచుట తప్పగు భ్రమయు దప్పె
వలదు వంచన ద్వేషము వలదుయావ
పరులకుపకారమే జేయు.. పరమగుణము
పంచశీల సూత్రమదియే పంచుప్రజకు.

జీవి జీవికి, నీడు మన మోహముండు
నీతి వీడిన మోహము గతిని జెరచు
మోహ దృష్టితో ఒరులపై మోజు వలదు
మోహ యావన మునిగిన మహితదొలగు
రోగగ్రస్తమై మహికెల్ల రోతగొలుపు
భయము దుఃఖము బాధలె బ్రతకునందు
వలదు అశ్లీల వర్తన వదలవలెను
పంచశృల సూత్రమిదియె పాడిగాదు.

నిజము బలుకుట నీతిని నిలుపుటగును
సత్యవాక్కున స్వచ్ఛత సాక్ష్యమిచ్చు
నిత్య ప్రగతికి మూలము సత్యవాక్కె
నిజము పలుకని వారిలన్ నిలువలేరు
నిలువజిచ్చును సత్యమున్ విడువవలదు
వాస్తవాలను పలుకుట వ్యక్తి విధియె
వాక్కుశుద్ధితో వ్యక్తులు ప్రాజ్ఞులగును
పంచశీల సూత్రమిదియె పలుకునిజము.

మత్తుగొలిపెడి పాలనముల్ మతినిజెరచు
ఇల్లు ఒళ్ళుయు గుల్లగున్ విలువజచ్చు
భార్యబిడ్డల బ్రతుకులు పతనమౌను
మత్తుపానము వ్యక్తికి శత్రువగును
త్రాగుబోతుగ మారెడి తపన వలదు
వ్యక్తి బాధ్యతల్ మరచును శక్తిచెడును
మద్యపానము మనుగడన్ మట్టుబెట్టు
పంచశీల సూత్రమిదియె ఉంచుమదిని.



–బండి ప్రసాదరావు
సెల్: 9866 483732

## ముద్దు బిడ్డడు!

ప్రాణవాయువు అందని ఎత్తుల్లో
ప్రమాదం పొంచిఉన్న స్థావరాల్లో
ప్రతిఘటనే ధ్యేయంగా
ప్రాణజెండా నెగురవేస్తాడు!

రెప్పవేయడం మరిచి
ముప్పు నదుపుచేస్తూ
చీకట్లోనూ చిరుతలా దుముకుతూ
సరిహద్దు నిఘా నేత్రమౌతాడు!

రాతి గుట్టల్లో బొమ్మలా
మంచి కొండల్లో దిమ్మలా
ఘోరారణ్యాల్లో చెట్టు కొమ్మలా
భూ మంత్రమేసినట్లు మారిపోతాడు!

ఆయుధాన్ని శరీరభాగం చేసుకుని
అప్రమత్తత నలవాటుగా మలుచుకుని
అవసరాల తామరాకునంటని నీటిబిందువై
అహరహం పురిటిగడ్డ సేవలో తరిస్తాడు!

నిరంతరం కర్తవ్యాన్ని శ్వాసిస్తూ
నిత్యం మాతృభూమిని కాలుస్తూ
ఉన్నా..లేకున్నా.. ఉనికి చాటుకునే ఆరాధ్యుడు
జాతి చరితన నిలిచి వెలిగే అమరుడు!

దేశ రక్షణకతడు సదా కంకణబద్ధుడు!
దేవి భరతమాతకతడు ముద్దుబిడ్డడు!



– ఎస్. కాశింబి
సెల్: 9052216044

## మాతృస్వామ్యంలో..

పాలనా పగ్గాలు పట్టి
ఏలింది అసమానత ఇన్నాళ్లూ
ఇంక చాలు ఇవ్వాలిక
ఆమె చేతికే ఇంటి తాళాలు..

వాక్కులమ్మ వారసురాలు
కళాకోవిదురాలు ఆమె
ఆయుధం అవసరంలేని యోధ
ముగ్ధత్వం మూర్తీభవించిన స్నిగ్ధ!

ఆత్మగౌరవం ఆమె ఆభరణం
ఆత్మవిశ్వాసం ఆమె అలంకారం
కరుణాంతరంగం ఆమె మనసు
హృదయ సౌందర్యం ఆమె సొగసు

కొత్త అధ్యాయాల కోసం
చరిత్ర వికాసం జరగాలి
మరి మహిళకాక ఇంకెవ్వరు
ఆ సామర్థ్యం కలిగి ఉన్నవారు..

ఆమెకు నటనలు రావు
కేవలం బతకడమే తెలుసు
ఆమెకు అధికార దాహం లేదు
కేవలం ఆలనాపాలనా తెలుసు.

నాగరికతకు ఆద్యురాలు
వ్యవసాయానికి ప్రథమురాలు
సంస్కృతుల పరిరక్షకురాలు
గృహ నిర్వహకురాలు ఆమే.

గుహ నుండి గృహాల దాకా
ఆమే అన్వేషి
ఆమే నిర్మాత
పనిముట్లు కనిపెట్టిన ప్రమద.

సమాజం మానవీయం కావాలంటే
మహిళ ఏలిక కావాలి
సహజ స్వామ్యం ఏర్పడితేనే
వ్యవస్థ సమతుల్యం అయ్యేది.

పురుషుడు సాధించలేని
శాంతి సమాజ స్థాపన
పట్టు విడిచి చూడండి
నెలకొల్పుతుంది తల్లి పాలన.

సమన్వయం సామరస్యం
ఆమె స్వాభావికాలు
నిబ్బరం పరిణితి
ఆమె నాయకత్వ లక్షణాలు..

స్త్రీలతో నెరపాల్సింది అధికారిక
సంబంధాల్ని కాదు
సహజాతపు స్నేహ సామరస్యాల్ని
దోస్తీ చేస్తే హింసకు తావుండదు.

వేల ఏండ్లుగా అంతా బుక్కేసారు
చరిత్ర అడుగుకు ఆమెను తొక్కేసారు
ఆమె భాగాన్నీ భాగస్వామ్యాన్నీ
దౌర్జన్యంగా గుంజుకొని మెక్కేసారు

అమ్మతనం అంటే ప్రేమతత్వం
అమ్మపాలన లాలనమయం
అమ్మది అధికారం కాదు
ఆత్మార్పణ జీవనరాగం.

ప్రపంచ శ్రామిక మహిళా దినం
శతాబ్ది మహిళ గాయాల మయం
ఆమె ఒక స్వేచ్ఛాగీతం
ఎలుగెత్తిన మహానినాదం.



– అనిశెట్టి రజిత
సెల్: 9849482462

## పచ్చని కాంతి

కళ్ళకు పొరలు కమ్మినట్టుగా
చూస్తుండగానే గుండెను పెకిలిస్తున్నట్టుగా
కాళ్ళకింద భూమి కదులుతున్నట్టుగా
మనసును కలచివేసే భావనలు
రోజులు గడుస్తున్నాడు
పచ్చని కాంతి కనుమరుగై
పొలాల పొత్తి కడుపుల్లో
‘రాతి కడీలు’ దిగబడ్డాయి
‘వెంచర్ల’ ‘నల్చర్లు’
పల్లెలను పొడుచుకు తింటున్నాడు
వేలాడే మర్రిఊడలు
తోరణాలై ఒకప్పుడు స్వాగతించేవి
పచ్చని చిలుకల సిగలో
రాగి ఆకులు పొదిగుండేవి
కళకళలాడే పల్లె ప్రాణం పోసేది
భూమాత నుదిటిపై అద్దిన
పసుపు కుంకుమలవలె బంతిపూలు
వాటి ఆకులకై వచ్చే “జింగన్నలు”
కళ్లముందు నుండి
కదిలిపోయినట్లుంది.
చెట్టునీడకూ నేడు పల్లెంతా గాలింపు
పైరగాలికై పరితపింపు
వాగుల గలగలలు
నేడు నిర్జీవాలు ఇసుక తిన్నెలు తరిగి
సమాధులు. అస్థికలు..
బంగారు కొండలుకంకరలై కరిగి
ఊపిరి తిత్తులనిండా తెల్లరాతి పొడి
మనిషి దురాశకు
ఊపిరాడకఅసువులు చాస్తున్న పల్లెలు
పల్లె బ్రతికితేనే ‘దేశం’
పచ్చదనం ఉంటేనే ‘ప్రాణం’
అనే సత్యం మరచి
ప్రకృతిని చంపుతున్న
వికృతానందంలో మనిషి
నేడుభస్మాసురుడి వారసుడు

– సిరిపంగి మహేశ్వర్
సెల్: 9590933377

## ఇద్దరు విజేతలు

(కథ)

“హేయ్ పల్లవి కమాన్, ఈరోజు నేనే గెలుస్తా!” అంది సారిక పల్లవిని దాటేయాలనే ఆరాటంలో.

“కమన్ డియర్! నన్ను దాటడం నీ వల్ల కాదు” అంది కొంటెగా, పల్లవి.

పల్లవి, సారికలు పరుగుపందెం పెట్టుకున్న ప్రతిసారీ పల్లవిదే ముందడుగు! ఎలాగైనా ఈరోజు గెలవాలని మరింత వేగం పెంచింది సారిక. అనుకోకుండా వీళ్లను చూసిన పీఈటి మధుకర్ సార్ వీళ్ళ పోటీతత్వానికి అచ్చెరువొంది మరింత దగ్గరగా వచ్చి నిశితంగా గమనిస్తున్నాడు.

పల్లవి, సారికలు తరచుగా పరుగు పందెం పెట్టుకున్నా, ఈసారి మాత్రం ఇద్దరూ పట్టుదల పళ్ళిపట్టీలు తిన్నట్టున్నారు! గమ్యం దగ్గరికి వస్తుంది. వీళ్ళ పరుగులు చూసి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా ప్రోత్సహిస్తున్నారు. 400 మీటర్ల పరుగు పందెంలో మరో 6 మీటర్ల దూరంలో లక్ష్యం ఉండగా, పల్లవి వెనకాలే వస్తున్న సారిక అనూహ్యంగా లాంగ్ జంప్ చేసి లక్ష్యం ముద్దాడింది! ఖంగుతిన్న పల్లవి నిశ్చేశ్టురాలైంది!

అంతే, అక్కడి వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. చప్పట్లతో, కేరింతలతో హోరెత్తింది. అందరూ సారికను ఆకాశానికెత్తుతుంటే పల్లవి చిన్నబోయింది. ఇప్పటివరకు పరుగు పందెంలో పల్లవి ఒటమి పాలు తాగలేదు! ఇదంతా గమనించిన మధుకర్ సార్ మూడు విజిల్స్ వేశాడు. ఎప్పుడైనా వరుసగా మూడు విజిల్స్ వేస్తే అంతా సైలెంటవ్వాలి. ఇది మధుకర్ సార్ రూల్! మధుకర్ సార్ హెడ్మాష్టర్ గారితో మాట్లాడి, పల్లవిని విజేతగా ప్రకటించాడు!! ఇప్పుడక్కడ కాలం స్తంభించింది!

మధుకర్: “పిల్లలూ! జాగ్రత్తగా వినండి, ఇక్కడ “వీరిద్దరు విజేతలే!” కానీ, పరుగుపందెంలో మాత్రం విన్నర్ పల్లవినే!! సారిక లాంగ్ జంప్ చేసి ముందుకు వెళ్ళింది. రన్నింగ్ నిబంధనల ప్రకారం లాంగ్ జంప్ ఉండదు. ఇక ఇప్పుడు సారిక చేసిన “6 మీటర్ల” జంప్, ద గ్రేట్ అంజు బాబీ జార్జ్ “6.74 ఇండియన్ రికార్డు” ప్రకారం ఇండియన్ టాప్ టెన్ లో ఉంటుంది! అంతేకాదు “400 మీటర్స్ రన్నింగ్ లో హిమదాస్ 50.79 సెకండ్ల ఇండియన్ రికార్డ్” పల్లవి ఈ ఫీట్ ను 59 సెకండ్లలో ఛేదించింది! అంటే పల్లవి కూడా ఇండియన్ టాప్ టెన్ లోనే ఉంటుంది!!” అనగానే అక్కడ కేరింతల వర్షం కురిసింది. హెచ్ఎం గారి ప్రోత్సాహంతో వారిద్దరిని నేషనల్ గేమ్స్ లో ఆడించడానికి తగిన తర్ఫీదునిస్తున్నాడు మధుకర్!

నీతి: “సాధించాలన్న తపన ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదు!”
“విజేతగా నిలబడడమే కాదు, తయారుచేయడమూ ముఖ్యమే.”



–గంగశ్రీ
9676305949

## అక్షరమే నా ఆయుధం

కష్టాల కడలిపై
భావాల నావపై
అక్షరాన్ని ఆయుధంగా
అహర్నిశలు దరించి
ముందుకు సాగే
ఈ నా సాహసయాత్ర
ఆగదు చివరి శ్వాస వరకు
ఎగసే కెరటాలపై
సునామీల అలలపై
వెన్నంటే తిమింగలాల
కోరల మధ్య నుండి
చీకటిని చీల్చుకుని
దూసుకుపోతుంది
అక్షరమే ఊపిరిగా
విప్లవశంఖాల ధ్వనితో
ప్రజాస్వామ్యమే ధ్యేయంగా
ప్రజా శ్రేయస్సే గమ్యంగా
అక్షరమిచ్చిన ధైర్యంతో
ఒకడే ఒక సైన్యంగా
అక్షరమే మేల్కొలుపు పాటగా
హృదయాల వెలుగు బాటగా
ఇహపరానికి నిచ్చెనగా
అక్షరంతో సాగే ఈ పయనంలో
మనిషిపోయినా
అక్షరం మిగులుతుంది.



– ఎస్.ఎమ్.షరీఫ్
సెల్: 9618045319

## పదితరాల బంధం

పల్లవి:– మా పొలం గట్టు మీదొక చెట్టు ఉన్నది
అది పది తరాల నుండి మమ్ము చూస్తున్నది

చరణం: లోతైన మూలంతో, బలమైన కాండంతో
శాఖోపశాఖలతో, దట్టమైన ఆకులతో
చినుకైనా చిందకుండా, సూర్యరశ్మి దగలకుండా
ఇంటికన్న పదిలమైన చోటదేగదయ్యా. ॥మా పొలం॥

వేసవి తాపము దీర్చే ఏ.సి.యే గదయ్యా
వాన నుండి తడవకుండా గొడుగులా నిలుచుండే
కొమ్మలన్ని కాపుకాసి, అమ్మలాగ చూస్తుంది.
వచ్చేపోయే వాళ్ళకు ఆతిథ్యం నిస్తుంది. ॥మా పొలం॥

పక్షి జాతులెన్నొ ఇచట గుళ్ళుకట్టి, గుడ్లుపట్టి
తమ సంతతి యభివృద్ధికి ఆశ్రయమే పొందుచుండె
తుమ్మెదలు కీచురాళ్ళు, సీతాకోక చిలుకలాది
పలు రకాల కీటకాల కూటమికి కూడలిది ॥మా పొలం॥

బాటసారులెందరో బస చేయునిచటనే
సంచారజాతులకు చక్కని యిల్లేయిది
గొల్లలు, గోపాలురుకు రైతన్నలలోతిలిది
యోచిస్తే, చిత్రమైన చిరు ప్రపంచమే గదా! ॥మా పొలం॥

పూర్వీకులెందరితో అనుబంధం పెంచుకొని
మా తాత ముత్తాతల ముచ్చట్లు చెబుతుంది
అనురాగం, ఆత్మీయత ప్రేమనెంతో పంచుతుంది.
మా వంశ వృక్ష గతమునంతా గమ్మత్తు జెబుతుంది ॥మా పొలం॥

చెట్టే మనకాధారం– చెట్టే మనకాస్తి పాస్తి
చెట్టే మన చుట్టము– చెట్టే మన స్నేహితుడు
చెట్టే మన గురువు గొప్ప దైవమని నమ్మండి
చెట్టు గనక లేకపోతే మన బ్రతుకు ఛిద్రమండి ॥మా పొలం॥

తుంచుకుంటూ పోతుంటే మనకు వర్షమెవరు తెస్తారు?
చల్లగాలి సౌకర్యం చలువ పందిరెక్కడిది?
చేతనైతే చెట్టు పెంచు నీ చుట్టూతా వున్న చోట
వృక్షో రక్షిత రక్షితః అన్న ఆర్యోక్తిని యాచరించు.

– చింత రమణ, సెల్: 9701652766

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 319వ రోజు 'కార్టూన్' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'వంటిల్లు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

– సంపాదకులు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక &
దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
**డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు**, 9441046839

## ఫన్-గన్

ఫన్ పంచ్ పెన్ కార్టూన్
నవ్వు రువ్వే గన్!
కార్టూన్ అంటే
హాస్య వ్యంగ్య చురక చిత్రం!
మాటలతూటా!
గీతతో కుంచెతో ఝళిపించేకొరడా!
దిన వార పక్ష మాస పత్రికలలో
నవ్వు పూయించే నవమల్లిక!
అది చూస్తూనే పొట్టచెక్కలు!
తాతగారి పకపకా బోసి నవ్వులు!
నవ్వి నవ్వి కన్నీరు!
"ఏంటా వికవికలు పకపకలు?"
బామ్మ ఝూడింపుకి
గప్ చిప్!
కార్టూన్ చూపితే?
ఆమె ఆచరణలో పెడితే?
అప్పడాలకర్ర అట్లకాడ
ఆమె ఆయుధం!?
చూపకుంటే అనుమానపు జోరీగ!
బిక్కమొహం తాత
మహంకాళీ అవ్వ గీశాడు
బాపూ బాబు బుజ్జాయి!
నాటి తలిశెట్టి నేటి నాగిశెట్టి!
తొలి తెలుగు తరుణి కార్టూనిస్టు
రాగతి పండరి!
ప్రపంచంలో అల్లుకున్న మల్లెపందిరి!
జయదేవ్ శంకు చంద్ర
సత్య మూర్తి బ్నిం
సరసి సుధామ
మల్లిక్ జిమ్మిక్ విన్యాసాలు!
కన్నడ తమిళ హిందీ ఆంగ్లంలో
కొంటె బొమ్మలతో ఒంటరితనం
పోగొట్టే కార్టూన్ బ్రహ్మలు!
సమాజపు కుళ్ళు
రాజకీయ గబ్బు
సబ్బు శానిటైజర్ లేకుండా
గీతలతో వాతల మరమ్మత్తు
చేసే మెకానిక్కులు!
సంతకాలతో పనిలేని కుంచెపేర్లు!
వారి బొమ్మలు పేలుస్తాయిబాంబులు!
కనపడని దెబ్బలు
తగలాల్సిన వారికే తగిలి
దిమ్మతిరుగు!
పట్టించుకోపోతే!?
పరీక్షాపేపర్లు బాగా రాస్తారు
పంచ్ ఫన్ చురకల కార్టూనిస్టులు!
వాటిని చదివి ఆచరణలో పెడితే
అందరికీ లాభం!
సమీక్షించుకుని
కార్టూన్ల పసందుని ఆస్వాదించడం
రాజకీయ సామాజిక
చెదరంగాన్ని చదరంగంగా
మార్చటం మన వంతు!.

-ఎ.రాజ్యశ్రీ

## హాస్య వినోదం

ఫన్ అంటూ పంచ్ కొట్టు
జీవితాన్ని మురిపించి
కార్టూన్ చిత్రాలు అలరించిన తీరు
జగతిలో ఆనందమే కొత్తగా.
కొత్త కొత్త కార్టూన్లు
రకరకాల చిత్రాలు
చిత్రమే కదా!
నిత్య సంతోషాన్ని నిలిపి
పల్లవితో పదము నిలిపి
మాటలే చిలిపిచేష్టలు
అయ్యాయి జగతిలో.
బామ్మ రూపు బొమ్మ జేయు
అమ్మ రూపు బొమ్మ జేసి
చేసినారు కార్టూన్ లు
జగతిలో నిలిచినాయి.
సంతలోన బొంతలెట్టి
సద్దిముడుపు కూరవెట్టి
ఈ జగతిలో నిలిచెను
ఆనందమే పంచుతూ.
అందరిలో ఆనందాన్ని
పంచుతూ కార్టూన్
కదలిన జీవనాన్ని నిలుపును.



-వి.సంధ్యా రాణి

## రేఖల్లో అర్థం

కార్టూనిస్టు గీసే గీతలు
స్పష్టం చేసే భావనలు
పిల్లలకు సైతం ఆనందం
పామరులకు సైతం అర్థం
వ్యంగ్యంతో వ్యవహారం బట్టబయలు
కార్టూన్లు వ్యవస్థను సరిచేసే ఔషధాలు
నవరసాలు ఇట్టే
శ్రీధర్ మల్లిక్
బాపు రమణ ల బొమ్మలు
పలికిస్తాయి భావనలు
మనసుకు హాయి
హాస్యానికి చిరునామా
ఉల్లాసం ఇచ్చే టానిక్కులు.



- వి.శేషారావు

## వ్యంగ్యం- ఎంతో అందం

వంకర టింకర చిత్రాలు
నవ్వుల తీరుల రూపాలు
వ్యంగ్య చిత్ర కారుడి
చేతిలో కలం
దిద్దుకున్న వక్ర చిత్రం
ఖ్యాతైనా
అప ఖ్యాతైనా
నిర్దేశించే కళాఖండం
కార్టూనిస్టు
రాజకీయున్ని ఎత్తేస్తాడు
ఒక్క చిత్రంతో జనాల
ఆలోచనల్లోకి లాగేస్తాడు
తన చిత్రం లేనిదే
వార్తా పత్రికైనా
కథల పుస్తకమైనా
పాఠకుల చేతిలో ఉండలేదు
జనహృదయంలో స్థానం సంపాదించలేదు
వ్యంగ్యం
భాషకైనా
భావానికైనా
చిత్రానికైనా
అందమే
ఎందరో కార్టూనిస్టులు
అందరికీ వందనాలు.



-జె.నరసింహారావు

## ఫట్....ఫట్

కరోనా విషాదం మరచి
కాసేపు హాయిగా జోకులేసుకుందాం
నవరసాల్లో హాస్యమే భేష్
అలనాటి హాస్యకారులే బంగారం
రాగతిపండరి పండిన ప్రథమ రచయిత్రి
ఇంటింటా అప్పడాల కర్ర కలలు
తలబొప్పులు తకిట తకిట కథలు
అడ్డడ్డే....
బాపు చమత్కార చిటపటలు
అబ్బోఅబ్బో!
ముప్పైపళ్ల పకపకలు
ముచ్చట్లు మరువలేం
ముళ్లపూడి బుడుగు జానపసూన
బాల రమణీయం
చక్కలి గిలిగింతలు
సమస్యల జీవితాలకు
ఓ టానిక్
హాస్యానందం ప్రతిమనిషికి కావాలి
ఈనాటి చెత్త టీవి జోకులు డోకులు
ఇంటిలోని పెద్ద చిన్నలకు రోత
మళ్ళీ హైలైట్ కార్టూన్లు రావాలి
సంతృప్తి సంతోషం దొరకాలి
అదే..
అచ్చమైన తెలుగువాడి కోరిక
తలనొప్పి తంటాలు తొలగాలి
ఇకఇకలు పకపకలు
కలకాలం వర్ధిల్లాలి!



-ప్రభాశాస్త్రి జోశ్యుల

## మౌనముని

తనకు మాత్రమే తెలుసు
మరొకరికి తెలియదనే దాన్ని
అందరికి నవ్వు వచ్చేలా తెలిపేదిదే .
తనది తెలిసిపాయె కదా
అన్న బాధను మ్రింగుతు
ముఖంపై బాధ లేనట్లుగా
నిజంగా నటింపజేసేదిదే,
సామాన్యుడు మొదలుకొని
సార్వభౌముని వరకు ప్రతి
ఒక్కరి మర్మాన్ని బహిరంగ
పరచి ఆశ్చర్యపరిచేదిదే.
రేఖలలో ప్రతి ఒక్కరి జీవన
రేఖలను హస్తసాముద్రికము
చెప్పే వారిలా చిత్రవిచిత్ర
దృశ్యాలను దర్శింజేసిదిదే.
సంభాషణ లేని మౌనముని
సంజ్ఞాభాషతోనే భావన
లన్నింటిని నిరక్షరాస్యునికిని
స్పష్టముగా వినిపించేదిదే.



-రుద్రాక్షల మఠం
ప్రభులింగశాస్త్రి

## నవరసాల వేదిక

సమాజ ముఖ చిత్రపు
పోకడలకు అద్దంపట్టే రాత
వాస్తవ చిత్రణ కొరకు గీసిన గీత.
సామాజిక సమస్యలకై ఎక్కుపెట్టిన
వ్యంగ్య బాణాలకది ప్రతీక.
కుటిల రాజకీయ ఎత్తుగడల పై
చురకత్తుల చురక
దేశ విదేశాల విశేషాలను
వడికే చరఖా.
వెయ్యి మాటల్లో చెప్పలేని నిజాలను
ఒక్క చిత్రంలో చూపించే మాయాశశిరేఖ.
చేతిలో రేఖలను
జగతిలో చిత్రాలను
కలగలుపు మేటి కలయిక.
ప్రజల నాడి తెలుసుకొని
పాలకులను ఎండగట్టే
నవరసాల వేదిక.

-వీణాహరీష్ వింజమూరి

## తప్పొప్పుకుంటే మాధవున్ని చేస్తుంది

అవి మామూలు గీతలు
ఆ గీతల్లో ఎన్నో ప్రపంచ పోకడలు
ఆ గీతల్లో
భావాలెన్నో
భావాలల్లో భావోద్వేగాలెన్నో.
చూస్తేనే నవ్వుతెప్పించినా
అంతరార్థం బోధపడి
దాని వెనకున్న వ్యంగ్యం ఆలోచింప
జేస్తుంది
వంకర గీతల్లోంచే చక్కటి జ్ఞానబోధ
చేస్తుంది
పట్టు శాలువా కప్పినట్టే ఉంటుంది
తరిచి చూస్తే
దాంట్లోనే పెట్టి కొట్టినట్టుట్టుంది
అందం కొరవడ్డా
ఎలా అర్థం చేసుకుంటే
అలాంటి భావాలే అందిస్తుంది
ఆలుమగల మధ్య
చెప్పుకోలేని ఇజాలను
నవ్విస్తూనే చురకేస్తుంది.
ఎందరినో మార్చిన గీత అది
ఎన్నో దేశాల రాతలను
అతలాకుతలం చేసిన గీతకూడా అదే
నవ్వుకుంటూ తప్పొప్పుకుని
మార్గానికోసం అన్వేషిస్తే
రహదారిలో
నువ్వు నడవాల్సిన తోవ చూపుతుంది
దేవుడిలా నిన్ను
తన బొమ్మల్లో నిలుపుతుంది
పూలదారి పరిచి పూజలు చేస్తుంది..



- గుర్రాల వేంకటేశ్వర్లు

## హాస్య లహరి

జీవితంలో హాస్యం పండిస్తూ
చక్కని మాటలతో మాటలు
పలకడం గొప్ప విషయం.
హాస్యం గ్లూకోజ్ డోస్
ఎంతో శ్రావ్యంగా
మనో రంజకంగా మదిలో వేణువు.
ఆ హాస్యం అందరికీ రాదు
కొందరికే పరిమితం
కార్టూన్ వేయగలిగె శక్తి ఉన్నతం.
పెన్సిల్ గీతలతో చిన్న బాక్స్
అది పత్రికకు కీర్తి
ఎందరిలోనో ఆనంద లహరికి స్ఫూర్తి



-నారుమంచి
వాణి ప్రభాకరి

## మనసుకి మందు

వ్యంగ్య హాస్య చిత్రం
చక్కటి గీతల కలయిక
భావ యుక్తం
మాటల పొందిక
సరస సంభాషణాల కలయిక.
సామాన్యుడి జీవితమే
కార్టూన్ కి పుట్టిల్లు
జీవితానుభవాలే అంశాలు
రేఖా విన్యాసాలతో
హావ భావ ప్రదర్శన
వీక్షకుల వినోదం
మానసికోల్లాసం
చూడగానే చదవగానే
మోము పై చిరుదరహాసం
మానసిక వేదన దూరం.
బాపు కార్టూన్ కళా కోవిదుడు
బాబు ఆయన శిష్యుడు
గురువంతటి ప్రజ్ఞాశాలి
రాగతి పండరి మహిళా కార్టూనిస్ట్
రాశి వాసిలోనూ లబ్ద ప్రతిష్ట.
జీవిత వేదన నుంచి
ఉపశమనం
హాయిగా నవ్వించే కార్టూన్లు
మనిషికి గ్లూకోజ్ లా శక్తి ప్రదాయకాలు.
ఆరోగ్యమే మహాభాగ్యం నానుడి
ఆరోగ్యానికి శక్తి నిచ్చే రహస్యమే కార్టూన్.



-మోటూరి
శాంతకుమారి

## ఊహా చిత్రం

పిచ్చి గీతలుగా కనిపించే కార్టూన్లు
కఠోర సత్యాలకు
నిలువుటద్దాలు
కొందరికి ఆనందాన్ని కల్గిస్తే
మరి కొందరికి
క్రోధాన్ని కల్గిస్తాయి
వ్యంగ్యంగా గీసిన కార్టూన్లు
చూపరులను హాస్యంతో
ముంచెత్తుతాయి
ఉహాలోకంలోకి తీసుకెళతాయి
దృష్టిని బట్టి ఉంటుంది సృష్టి
చూసే వారిని బట్టే కార్టూన్లు
సందేశాన్నందిస్తాయి.
గీసిన బొమ్మలతోను
మాట్లాడిస్తాడు
రాసిన రాతలతోను
కడుపుబ్బ నవ్విస్తాడు
కార్టూనిస్ట్
దొరికిన అవకాశాలను
దొరబాబులా తీసుకొని
అడ్డు గీతలతో బొమ్మేసి
అడ్డగోలు రాతలు రాస్తాడు
కార్టూన్లు
కార్టూనిస్టుల
అద్భుతమైన చతురతకు
అత్యద్భుతమైన తెలివికి
తార్కాణాలు.



-గుండం మోహన్ రెడ్డి



# తెలంగాణ భాషకు వరం కాళోజీ

తెలంగాణ భాషకి జీవంపోసి వెలుగులోకి తెచ్చిన గొప్ప శక్తి కాళోజీ.

జీవిత కాలంలో అన్ని ఉద్యమాల్లో మమేకమై పోరాడిన మహోన్నత వ్యక్తి వివక్షత ఎక్కడున్నా వ్యతిరేకించి ప్రజల సమస్యలపై అలుపెరగని పోరాటం సల్పిన కలం యోధుడు కాళోజీ నారాయణరావు గారు కాళోజిగా కాళన్న గా జనం చేత సుపరిచితులు.కాళోజి గారి పూర్తి పేరు లక్ష్మీకాంతం రాం రాజా నారాయణరావు కాళోజి. మొదటి ప్రపంచ యుద్ధం తో పాటు భూమి మీద పడినాను అని కాళోజీ తన ఆత్మకథ నా గొడవలో తెలియచెప్పారు. రట్టహళ్లి గ్రామంలో09.09 14 లో జన్మించారు. ప్రశ్నించే తత్వం గల కాళోజి అన్యాయం ఎక్కడ జరిగినా ప్రతిస్పందించారు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు. రజాకార్లను ఎదిరించి జైలు జీవితం గడిపారు . తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వని గా తెలంగాణ అస్తిత్వాన్ని ఊపిరిగా రాజకీయ సామాజిక చైతన్యం కలబోసిన వ్యక్తిత్వమే కాళోజీ నారాయణరావు గారు. వ్యక్తి స్వేచ్ఛకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ధిక్కారకవి గా పేరుగాంచిన ధీరుడు. తెలంగాణ పక్షాన నిలిచి పీడిత ప్రజల పక్షం వహించి తన కవిత్వాన్ని ప్రజల జీవితాల్లోకి తీసుకెళ్లి ప్రజాకవిగా పేరుపొందాడు కాళోజి. సమాజంలోని గొడవను తన గొడవగా చేసుకొని నా గొడవ పేరుతో 8 సంపుటిలుగా వెలువరించారు. రజాకార్లు చేసిన దౌర్జన్యాలకు రగిలిపోయి "కాటేసి తీరాలె " కవితలో తన ఆవేదన వ్యక్తం చేశారు." మన పిల్లలను చంపి మనల బంధించిన/ మానవాధములను మండలాధీశులను/ మరిచిపోకుండా గుర్తుంచుకోవాలె/ కసి ఆరిపోకుండా బుస కొట్టుచుండాలె/ కాలంబు రాగానే కాటేసి తీరాలె... అంటూ మన పిల్లలను చంపి మనల చిత్రవధ గురిచేసిన రజాకార్లను మర్చిపోకుండా వారి నాశనం కొరకు కొరకు కృషి చేయాలి సమయం వచ్చినప్పుడు కాటు వేయాలని కాళోజి పిలుపునిచ్చారు. కాళోజి "నా యిజం " కవితలో.. నేను ఉన్నది నిలువదగిన చోటు/అటు ఇటూ పోయినచో లోటు/ నన్ను దాటిన భ్రష్టాచారం /వెనుక బడిన చాదస్తం /నాది నిత్యనూతన వికసిత జ్ఞానం /నీది బుద్ధి జాడ్య జనితోన్మాదం/ నా కోపం స్వభావ సిద్ధం/ మీకైనను ఓర్పుండొద్దా నాకున్నవి అన్నియు హాబీలు / మీకున్న వ్యసనాలు తగవు/ నాదంతయు అప్డేట్ కల్చర్ / దట్ ఫర్ అండ్ నో ఫర్దర్ /ఇదిగిదిగో చెలియలికట్ట/ కాదన్న వాడి కన్నులు లొట్ట /నాకందినది నాది / నా కందనిది మనది/ నానా "యిజా"ల కడుగున జాడ/నా "యిజం"దే అగుబడును జాడ .. అంటూ కాళోజి తన పద్ధతిని వ్యక్తిత్వాన్ని ఈ కవిత ద్వారా తెలియ చెప్పారు. తనది నిత్యనూతన జ్ఞానమని తనకు కోపం ఎక్కువ అని కాలానుగుణంగా మారుతున్న నాగరికత తనది అని తెలియజేశారు కాళోజీ దృష్టి లో భాష రెండు రకాలు. ఒకటి బడి పలుకుల భాష ఇది గ్రాంథిక భాష. రెండవది పలుకుబడుల భాష. ఇది వ్యవహారిక భాష .జీవ భాష. ఇదియే నిజమైన భాష అని మనకు అవసరమని కాళోజి తెలియచెప్పారు. తెలంగాణ ప్రజలు సల్పు /తెలంగాణ ఉ ద్యమాన్ని/ రౌడీ అలజడి అంటూ/బాకాలూదెడి ఆంధ్రుల /దెంతపాటి సభ్యతంట/ తెలంగాణ యాసనెపుదు ఈసడించు భాషీయుల/సుహృద్భావన ఎంతని.... తెలంగాణ మాండలికాన్ని ఆంధ్రులు హేళన చేయడం తట్టుకోలేక వాళ్లది ఏ పాటి సభ్యతని తెలంగాణ యాసను భాషను తూలనాడడానికి వచ్చినారు అంటూ తెలంగాణ యాసకు జీవం పోస్తూ కవితలు రాశారు.కవిగా ఉద్యమకారునిగా పేరొందిన కాళోజీ కథకునిగా రాణించారు 8 దశాబ్దాలకు పైగా ప్రజాజీవితంలో ముడిపడిన వ్యక్తిత్వం ఆయనది వ్యక్తిత్వం,స్వేచ్ఛ అనే రెండు ప్రధాన విషయాలను మనిషి ఎప్పుడూ కోల్పోవద్దని కాళోజి తెలియచెప్పారు ."ఎవని వాడుక భాష వాడు రాయాలె/ ఇట్ల రాస్తే అవతలోనికి తెలుస్తదా అని /ముందు నిన్నేమనుకునుడు /మనను మనం తక్కువ చేసుకున్నట్టే /ఈ బానిస భావన పోవాలె /నేనెన్నో సార్లు చెప్పినా భాష రెండు తీర్లు/ ఒకటి బడి పలుకుల భాష/ రెండోది పలుకు బడుల భాష/ పలుకుబడుల భాష కావాలె.. అని కాళోజీ మన భాష యాసను మనమే గౌరవించుకోవాలి ఎవరో వచ్చి ఏదో అనుకుంటున్నారని మన భాషను మనం తక్కువ చేసుకోరాదు బానిస భావన పోవాలని తెలంగాణ ప్రజలకు తెలియచెప్పారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం ఆయన జన్మ దినాన్ని దినమైన సెప్టెంబరు 9వ తేదిని తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించింది.వరంగల్ లో నెలకొన్న వైద్య విద్యాలయానికి కాళోజీ

గారి పేరు పెట్టడం జరిగింది .1992లో భారత దేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ అవార్డు పొందారు. తాను చనిపోయిన తరువాత తన భౌతిక దేహం వైద్య విద్యార్థుల పరిశోధనకు అందజేయాలని కోరారు.13 /11 /2002 నాడు కాళోజీ మరణించిన పిదప ఆయన పార్థివ దేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అందజేశారు. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి అంటూ కాలానికి అతీతమైన కవిగా తెలంగాణ తొలిపొద్దుగా చరిత్రలో నిలిచిన కాళోజీ నారాయణరావు చిరస్మరణీయులు.



-సునీత బండారు
9440671530




**అమాయకపు గుట్టన్న కథలు** (పిల్లల హాస్యకథలు..)

## రబ్బరు గాలి బుడగలు ( బెలూన్లు)

జాతర ఉత్సవాలకు గుట్టని గ్రామంలో అనేక కొత్త దుకాణాలు వచ్చాయి . పెద్ద పెద్ద గాలి బుడగలు వారు అమ్ముతున్నారు.గుట్టడు ఒక గాలి బుడగను కొని పైకి ఎగురవేశాడు. అది ఆకాశంలో ఎగురుకుంటూ పోతున్నది. గుట్టడు దాని వెంబడి పైకి చూస్తూ పరుగు పెట్టాడు. ఎదురుగా వస్తున్న ఒక ముసలి అవ్వను వాడు ఢీకొట్టాడు. ఆమె వాడిని శాపనార్థాలు పెట్టింది .

మరి కొద్దిసేపట్లోనే దానిని గుట్టడు దొరకబుచ్చుకుని మిత్రులకు చూపిద్దామని వెళుతూ దానిని చేతితో అటు ఇటు తిప్ప సాగాడు. ఆ గాలి బుడగ పగిలిపోయింది .వాడు పగిలిపోయిన ఆ గాలి బుడగ తో ఆ దుకాణదారుని వద్దకు వచ్చి ఇంకొకటి ఇమ్మన్నాడు. "నీ చేతిలో ఆ గాలి బుడగ పగిలింది కనుక నేను ఇవ్వను" అని దుకాణాదారు అన్నాడు. అప్పుడు గుట్టడు మరొక పది రూపాయలు ఇచ్చి ఇంకొక గాలి బుడగను కొన్నాడు. దానిని ఊపకుండా వాడు నెత్తి పైన పెట్టుకొని పరుగుతీశాడు. ఆ గాలికి నీటి బుడగ తిరిగి ఆకాశంలోకి ఎగిరింది. వాడు దాన్ని చూస్తూ రహదారిపై పరుగు తీస్తూ ఈసారి రహదారిపై పై పడుకున్న ఒక కుక్క పై కాలు వేసాడు. అది భౌ, భౌ మని మొరిగింది .వాడు 'వా' అని అరచి ఒక్క ఎగురు ఎగిరాడు. అదృష్టవశాత్తు ఆ కుక్క వాడిని కరవలేదు. మళ్లీ గాలి బుడగను చేజిక్కించుకుని చేతితో ఊపకుండా ఇంటికి జాగ్రత్తగా తీసుకొని వెళ్ళాడు. అక్కడ మిత్రులకు చూపిద్దామంటే వారు లేరు. ఇంట్లో జాగ్రత్తగా కింద పెట్టాడు. అది' ఢాం' అంటూ మళ్లీ పగిలింది. గుట్టడు ఆ ధ్వనికి 'వా' అంటూ అరచి భయపడి ఒక్కసారి పైకి ఎగిరాడు .గుట్టడు మళ్ళీ గాలిబుడగ జోలికి పోలేదు.



-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535

## అగ్నిగర్భ

*

పుడమి తపించిపోవునటు పూటకుపూటనరాశి వ్యర్థముల్
విడుచుచు నేలపైన పరివేష్టితవాయువునెల్ల ద్రోలగా
సుడులుగ పంచభూతములు స్రుక్కుచు నిప్పులవోలె మండవే?
కడకు ధరాతలమ్మనలగర్భమువోలెక మండిపోయెడిన్!

పెరుగుచున్న వేడి భీషణాళితిగ
మంచు ఖండములను ముంచివేయు
జలము విలయమగుచు జనులను ముంచెత్తు
మానవాళి యునికి మాయమగును!

పుడమిని కలుషమొనర్పక
నడువగ మేలగును,శుభ్రనందనవనిగా
నెడనెడ మొక్కలు నాటుచు
నడుగులు వేయంగవలయు నాపద నాపన్!

నేల,నీరు,గాలి,నిప్పును,నింగియు
నిర్మలంబులైన నిఖిలధరణి
వాసయోగ్యమగును వరసంపదలతోడ
గాన పుడమిగావ బూనవలయు!



— డా॥ అయాచితం నటేశ్వరశర్మ —
9440468557.




## కణిక



సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

## 'బుధవారం బాద్షా'

### పోటీ ఫలితాలు



ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.
నిర్వహణ: **డా॥ప్రతికంఠం మాలతీలత**

### పదాలతో కవిత

ప్రథమ బహుమతి విజేత

ఖనిజసంపదకు నిలయమైన ఆఫ్ఘన్
కారుమబ్బులు కమ్ముకున్నయి
అంధకారం అలుము కున్నది
ఆత్మాభిమానం చంపుకోలేక మహిళలు
అయోమయంలో పడ్డారు
నిన్నటివరకు అందరికీ అనుకూలంగా ఉనీది
నేడు అననుకూలంగా మారిపోయింది.
ప్రపంచంలో ఎక్కడాలేనిది
అఫగనిస్తాన్ లో తాలిబన్లు
ఉన్మాదులుగా తయారయి
మారణహోమం సృష్టిస్తున్నారు
ఎవ్వరికీ అంతుచిక్కని మనస్తత్వం
ఈ రాక్షసులది
చివరికేమవుతుందో ఎటుపోతుందో
ఎవరికీ అంతుబట్టడం లేదు.



-మండికారి బాలాజీ

ద్వితీయ బహుమతి విజేత

### పదాలతో కవిత

నడిచే దారిలో ముళ్ళున్నా
రాళ్ళున్నా
ఎత్తుపల్లాలు ఎన్నున్నా
ఎగుడు దిగుడు ముప్పు
ముంచుకొచ్చినా
'అంధకారం' అలుముకున్న
అవకాశాలు దూరమైన
నా అన్న వాళ్ళే నట్టేట
ముంచినా
గుంపెడంత ఆశతో
గుబులును దూరం చేస్తు
మును ముందుకు సాగుతుంటే
పోతుంటాను!
ఆత్మీయులే ఆత్మ వంచన
చేస్తుంటే
అయిన వాళ్ళే అరచేతిని
అడ్డుపెడుతుంటే
'ఆత్మాభిమానం'తో సాగిపోతా
కళల సాకారం కోసం
అడుగులు వేస్తా
నిత్య వసంతాల ఆగమనం
కోసం ఎదురుచూస్తాను!
జీవితమంతా దుర్భరమే
బతుకు లోగిళ్లలో 'అయోమయం'
అడుగడుగునా వేలెత్తి చూపే మనుషులు
వెన్నుపోటు పొడిచే
కట్టప్పలే
కష్టాల కడగండ్లను దిగమింగుకుని
ఆత్మస్థైర్యం తో దూసుకుపోతాను!
ఆంక్షల వలయాలను ఛేదిస్తూ
'అనుకూలత' పరిస్థితిల అధిగమిస్తాను
అవకాశాలను చేజిక్కించు కుంటాను
ఆర్థిక ఇబ్బందులను
తొలగిస్తాను
'అంతుచిక్కని' ప్రశ్నల
ఛేదనకై శోధిస్తా
అవకాశాలను పట్టేస్తా
ఆత్మవంచనను తొక్కేస్తా
ఆనందం తీరం చేరేస్తా
అందరికి ఆదర్శంగా
నిలిచేస్తాను!



-కోణం పర్శరాములు
9959524585




## ప్రేమకిషోర్ స్మారక కవితా పురస్కారం - 2021కు ఆహ్వానం

ప్రముఖ కవి, గేయ,నాటక రచయిత రావినూతల ప్రేమకిషోర్ స్మాకర కవితా పురస్కారం-2021కు కవుల నుంచి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్టు జానుడి - సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారానికి ఎంపిక చేసిన కవికి రు. 2,116లు నగదు బహుమతి, దుశ్శాలువ, ప్రశంసాపత్రాలను బహుకరిస్తారు. కవులు ఈ పురస్కార ఎంపిక కోసం 2019-21 మధ్య వెలువరించిన వారి కవితా సంపుటులను మూడు కాపీలను ' ప్రేమకిషోర్ కవితా పురస్కారం -2021, జానుడి-సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్, డాక్టర్ మల్లవరపు రాజేశ్వరరావు భవన్, శ్రీనగర్ కాలనీ, మొదటి లైన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-ఆంధ్రప్రదేశ్ - 523001కు సెప్టెంబర్ 25వ తేదీలోపు పంపాలి. మరిన్ని వివరాలకు 98481 87416 నంబరులో సంప్రదించవచ్చు.




Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.